ప్రబుద్ధాంధ్ర

కలాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు:- శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము · జనవరి ౧-౩౪ { సంచిక ౧

పునఃపూజ

ఆంధ్రసోదరసోదరీమణులకు ఈ ప్రబుద్ధాంధ్రపత్రిక చిరపరిచితం గాని కొత్తది కాదు. నా ఆరోగ్యం చెడిపోవడంవల్ల ౧౯౨౯ వ సంవత్సరంలో దీన్ని నిలుపు చేసి నా స్వగ్రామం మహేంద్రవాడ చేరుకున్నాను. ఈ యెనిమిదేళ్ళలోనూ మళ్ళీ ప్రకటించడాని కెన్నోమాట్లు ప్రయత్నించాను; గాని కొనసాగలేదు. సంవత్సరం కిందట రాజమహేంద్రవరం ప్రవేశించాను. ఇప్పుడు దీన్ని మళ్ళీ ప్రకటిస్తున్నాను.

మునపటిలాగే యిప్పుడుకూడా చందా వొక్కరూపాయే; కనక నా దేశీయులకు ఇది మరొక బరువులో చేరదు. ఇందుకు నిదర్శనంగా అనేకులు ఈ పునఃప్రయత్నం చూసి మరీమరీ ప్రోత్సహించారు. సాయంచేస్తా మని మాట యిచ్చారు. కొందరు చేశారు. ఇంకా చేసేవారి సంఖ్య హెచ్చుగానే వుంది.

వెనక చందాదార్లుగావుండిన వారుకూడా చాలాచాలా వుబలాటపడుతూ యెదురు చూస్తున్నారు.

ఈసారి యీ పత్రికలో పద్యాలు ప్రకటించ తలుచుకో లేదు. ఇప్పుడు మనకి వచనవాఙ్మయం చాలా అవసరంగా వుంది. జనసామాన్యంలో విద్య వ్యాపించా లన్నా, విజ్ఞానం వ్యాపించా లన్నా వచనవాఙ్మయమే ఆధారం. ప్రముఖులలో కూడా వచనవాఙ్మయం యెన్నో అభివృద్ధులు కలిగిస్తుంది.

ఈ పునఃప్రారంభం విని వాఙ్మయపోషకు లగు సంపన్నులు చేయూత యిచ్చారు. వశ్యవాక్కు లగు గ్రంథకర్తలు సహకారించూ పారు. శ్రీఅద్దేపల్లి లక్ష్మణస్వామినాయడుగారు పూర్వాభిమానంతో తమ సరస్వతీపవరుముద్రాశాలలో ముద్రించి యివ్వడానికి పూనుకున్నారు. అందరికీ నా కృతజ్ఞత తెలుపుతున్నాను.

ఇట్లు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

ఆశీస్సు

పత్రికా ప్రారంభమును తెలుపుచు తమ రచనలు కోరగా ఆచార్య సర్. రాధాకృష్ణయ్యగారు మా యుద్యమము నాశీర్వదించుచు ఇట్లు ప్రోత్సహించినారు.

ఆంధ్రయూనివర్సిటీ వాల్తేరు, 15-9-33

అయ్యా!

ఇప్పుడు నేను ఎక్కువ పని తొందరలో నుండినందున మీ పత్రికకు ఎట్టి వ్యాసమును వ్రాయజాలకున్నాను, కాని మీరు ప్రకటింపదలచుకొన్న పత్రికవంటి పత్రిక ఆంధ్రజాతీయపునరుజ్జీవమునకు తోడ్పడగల దని నే నంగీకరించుచున్నాను. ఈ కొత్తరూపమున అది విజయము బడయుగాక యని నేను కోరుచున్నాను.

ఇట్లు.

యస్. రాధాకృష్ణయ్య

'ప్రబుద్ధాంధ్ర'—పద్యవాఙ్మయనిషేధము

గన్నవరపు సుబ్బరామయ్యగారు

భారతి సంపాదకులు

వెనుక కొన్నియేండ్లు ప్రవర్తిల్లి 'ప్రబుద్ధాంధ్ర' ఆంధ్రుల హృదయమును చూరగొనినది. అది మరల నిపుడవతరించుచున్నది. అందు 'పద్యవ్యాసములను ప్రకటింప' మని సంపాదకు లొక నియమమును బూనిరి. ఈ నియమము పత్రికాప్రపంచమున ననిదంపూర్వము. దీనివలన విజ్ఞానవికాససాధనమగు గద్యవాఙ్మయము విస్తరిల్లుట కవకాశ మేర్పడినది. ఇట్టి విశిష్టనియమముతో పత్రికను ప్రకటింపబూనిన సంపాదకులకు ధన్యవాదములు.

పద్యములు గణయతిప్రాసబద్ధములు. వానియందుద్దిష్టభావముకొరకు ప్రయాసముతో వెదకులాడవలసియుండును. కావున వైజ్ఞానికవిషయముల పద్యములరూపమున వివరించుట దుష్కరము. ఒక్కచో సుకరమయ్యును నిష్ప్రయోజకము. అదియునుగాక, నాటికి నాడు బహుముఖముల పెరుగుచున్న వాఙ్మయమును మునుపటివలె నీకాలమున కంఠస్థము కావించుకొనుట వట్టిమాట. అట్లుచేయుట కవకాశమును లేదు. ఇపుడు జనసామాన్యమునకు సుఖమయజీవనమునకు వలసిన విషయము లన్నిటితోను మంచిపరిచయ ముండిన జాలును; చక్కని పాండిత్య మక్కరలేదు. అన్నిటను గట్టిపాండిత్యము సంపాదింపగలుగుటయు కలలోని వార్త. ఇక నీదినములలో మానవుని నిత్యజీవితమున కావశ్యకములగు విషయములను 'అక్షరాలా' స్పష్టముగ—అనగా దృష్టికి పదములును, మనస్సునకు వానియర్థమును ఒక్కమారే—తెలుపునట్టి గ్రంథములు వెలువడవలెను. అవి సరళమగు గద్యరచనమున నుండవలెను.

వివిధదేశవాఙ్మయవిజ్ఞానముల సంబంధమువలన నిజాసింతనుల యభిరుచులు మారినవి; విజ్ఞానార్జన వాంఛ అతిశయిల్లినది, సంస్కారమునెడ సౌముఖ్యము కుదిరినది. వారిదృష్టి క్రొత్తక్రొత్తపుంతల ముందున కురుకుచున్నది. తదనుకూలముగ ప్రపంచమున నన్నిభాషలయందును వివిధవిజ్ఞానవిషయములను గూర్చిన వాఙ్మయ మనంతముగ విస్తరిల్లుచు తదభిరుచులకు దోహద మొసగుచున్నది. ఆవాఙ్మయమంతయు గద్యరూపముననే యుత్పత్తి నొందుచున్నది.

అన్నిభాషలయందువలెనే తెనుగునను గద్యవాఙ్మయమునెడ నాదినుండియు నాదరము లేకపోయినది. ప్రాచీనాంధ్రగ్రంథములయందు గద్యము విరళముగ నున్నను భావార్థప్రకటనమున పద్యరచనమున కొకమెట్టు పయిననే యున్నది. మధ్యకాలమునాటి ప్రబంధాదులయందును విరళమే యయ్యును గద్యము రాతినారపాకమునబడి కొరకరానికొయ్య యయిపోయినది. ఇంతయేల? నిర్వచనగ్రంథములుగూడ కొన్ని పుట్టి గద్యరచనమునెడ నానాటి యనాదరమునకు నిదర్శనము లయినవి. పదునేడవ శతాబ్దిప్రాంతముల దక్షిణాంధ్రరాజుల ప్రాపున రెండుమూడు, భారతవిష్ణుపురాణాదిగద్యగ్రంథములు వెలసినవి. అవియయిన ననువాదములే కాని స్వతంత్రములు కావు; తుదకు నిండుగనేని లభించినవియు కావు. శైలిమాత్రము తత్పూర్వపు గద్యము శైలికన్న కొంత సరళముగ నుండుట వానియందలి గుణవిశేషము.

దేశమున నాంగ్లవిద్య పెరుగుచున్నకొలది గద్యవాఙ్మయమునెడ నాదరము పెరుగ జొచ్చినది. అర్వాచీనులలో కీ. శే. కందుకూరు వీరేశలింగము పంతులుగారు గద్యవాఙ్మయ శకపురుషులన బ్రసిద్ధిగాంచిరి. వారు జనసామాన్యమున కుపయోగించు

విషయములను వస్తువులుగాగొని గద్యగ్రంథములను పెక్కింటిని రచియించిరి. వాని శైలియు వాని యందలి విషయములవలె సరసము, మృదులము నయి చదువరుల మనముల నాకర్షింపజాలినది. కావున నేయది మొదలుకొని ప్రజలకు గద్యవాఙ్మయము పయి నభిరుచి మెండుకొనజొచ్చినది. పలువురు గద్యగ్రంథముల ననేకములను రచియించి గద్య వాఙ్మయమునకు క్రమముగ పుష్టిని సమకూర్చుచు వచ్చిరి. కాని వానియందు తోచబడిన ఇంగ్లీషు నవలలు కథలు, పద్యములు, పాటలు పిల్లలకు గాగల నాటకములు మొదలగునవే కాని నైజానికగ్రంథములు కానరావు. అవియు నించుమించు భాషాగ్రంథములకనువాదములే కాని స్వతంత్రములు కావు. వానివలన జనులకు గలుగు లాభము చాలకొలది. రానురాను పాఠశాలల బాలురకొరకు నిస్సారములగు గద్యగ్రంథము లసంఖ్యాకములు పుట్టగొడుగుల వలె బయలుదేరుచున్నవి. దీని యుత్పత్తికి ప్రకృతమునందున్న విద్యావిధానము కారణము.

గద్యవాఙ్మయము వృద్ధినొందుటకు పత్రికలు నుపకరించుచున్నవి. రచనాభిమానమును, శైలిని పాడుచేయుటకును అవియే యుపకరించుచున్నవి.

శబ్దతత్త్వమును, తత్ప్రయోగౌచిత్యమును భావప్రకటనసౌకర్యములను తెలియక గణయతిప్రాసబంధముల దగిలియుండుటయే పరమావధిగ చూచుకొని పనికిమాలిన పదములను పేర్చి సులభముగ పద్యములను రచించుట నేటివారికి పరిపాటి యయినది. గద్యరచన పద్యరచనమువలె సులభమయినది కాదు. ఉద్దిష్టార్థము నెచ్చుతగ్గులులేక స్పష్టముగ తెలియవచ్చునట్లు, ఉచితములగు పదముల నేర్చి, యౌచిత్యానురోధముగ కూర్పవలసి యుండును. వాక్యములు నాతిదీర్ఘములుగను, శైలి సరళముగను ఉండవలెను. అనావశ్యకమయినను వ్యర్థపదములతో పెంచుటయు ఆవశ్యకమయినను విషయమునే త్రుంచుటయు గద్యము ప్రయోజనమును పాడుచేయును. చక్కని గద్యరచన యలవడుటకు కేవలపాండిత్యము సాధనము కా[దు] శబ్దార్థముల శక్తి చక్కగా తెలిసియుండవలె[ను] విషయపరిజ్ఞానము, మంచిఅభ్యాసము కావలెను.

నేటికాలపు పత్రికలును, గ్రంథములును స్ఫు[రింప]చుచున్న గద్యవాఙ్మయమున నొప్పిదమగునున్నది యత్యల్పము. పద్యవాఙ్మయమున [కం]టె నల్పతరము. కాని పద్యవాఙ్మయము వి[షయ]మున చింతింపబనిలేదు. పద్యవాఙ్మయము మానసి[కా]నందమును గూర్చుటకే అధికముగ నుపయోగించును అందుకు జాలిన పూర్వగ్రంథము లనేకము గలవు. పూర్వముగాని నేడుగాని లేకున్నది సద్యముగు గద్యవాఙ్మయము. శరీరమునకు సౌ[ఖ్య]మును గూర్చు జ్ఞానమును ప్రజలకు పంచిపెట్టకదియే ప్రధానసాధనము. దానికి సంప్రాప్తమం[దు] ముద్దశకే యిపుడు చింతిలవలసియుండునది. శ[రీర]సౌఖ్యము గుదురనపుడు మానసికానందము దే[ని]కలుగ జాలదు.

ఇట్టియదనున 'ప్రబుద్ధాంధ్ర' యందు ప[ద్య]వాఙ్మయమును నిషేధించి, గద్యవాఙ్మయమున[కు] ప్రాధాన్య మొసగి తదభివృద్ధికి మార్గముదీని తత్సంపాదకుల నెంత యభినందించినను చాల[దు]. కాని పద్యవాఙ్మయనిషేధముతోడనే వారి బాధ్య[త] తీరిపోవునది కాదు. గద్యరచనములయందు ఆదర్శప్రాయములగు మేలివానినే వారు ప్రకటించు[చుండ]వలెను. అటులయిననే వారి పత్రిక 'చిక్రో[డ]సికతాన్యాయము ననుసరించి వాఙ్మయమునకు, ప్ర[జ]లకు నొకింతయైన మేలుకూర్చునది కాగలదు, త[న] పేరును సార్థకపరుచుకొనునదియు కాగలదు.

నూతనగుణసంపన్నమై యాంధ్రలోకమున నవ[త]రించుచున్న 'ప్రబుద్ధాంధ్ర' కాంధ్రలోకము సహృ[ద]యతతో స్వాగతము చెప్పి తత్సంపాదకులకు విశేషముగ ప్రోత్సాహము గలిగించదగును, పత్రిక ద్వారమున స్వయముగ ప్రబుద్ధము కాదగును.

జాగ్రత్తపడవలసిన ఘట్టాలు

సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు

"బారెడు పొద్దెక్కిందప్పుడే. వూరందరూ పాచీ పనీ చేసుకున్నారు: గాని మా కింకా కోడే కుయ్యలేదూ"

"..........................."

"మొగుడాదు నాలుగ్ఘళ్ళరాత్రివేళే లేచిపోయినా, చద్దన్నాలవేళదాకా గదిలోనుంచి యివతలికే రాకపోతే యింకెలాగా వేగడం?"

"..........................."

"లేవడానికి తొందర అక్కర్లేదు; గాని లేచిన వెంటనే కాఫీ కాచుకోడానికి మాత్రం పరుగూ. ముందు కుంపట్లో నిప్పు పడేసే తరవాత మొగం కడుక్కోవడం. ఛీ! గేదీ తాగుతుంది కుడితి"

"..........................."

"రెక్కల్లో సత్తువ వుంది కదా చెయ్యక యేం చేస్తుందని దిలాసా. అత్తముండలు బతికి వుండవలసిన రోజులు కావివి"

"..........................."

"వాగివాగి అదే వూరుకుంటుందని మొండితనం కూడానూ. సిగ్గూ బిడియమూ, భయమూ భక్తీ లేని వాళ్ళ నెన్నంటే మాత్రం యేం లాభమూ?"

"..........................."

"రెండుఝాళ్ళ పొద్దెక్కేదాకా పడుకుంటే నాకు మాత్రం సాగదా యేమిటి?......కాని "నీకూడా సిగ్గులేదా" అని చివరికి నాకే గడ్డి పెడతారు లోకులు. మంచయినా చెడ్డయినా యజమానులకే గాని మధ్యనత్రగాయ పీనుగులకేం వుందీ?"

"..........................."

"వొకటీరెండూ కాదు, పదిహేడేళ్ళు వెలిగించాను కజ్జాకోరు అత్తగారి దగ్గిర కాపరం. కిక్కురుమని యెరగనెప్పుడూనూ. తూర్పు తెల్లవారుతోందనగా మొగం కడుక్కొని చీపురుకట్ట పుచ్చుకుంటే ఝాం పొద్దెక్కేదాకా వొళ్ళే తుడుపూ. ఆకాలంలో యిలా అయితే యేం కాపరం చేశామే"

"..........................."

"మనలాగే వైదీకంలో వున్న వాళ్ళ పిల్లని చూడమని యెన్ని విధాల పోరినా, యిదేదో మంచి సంప్రదాయం అని మురిసిపోయారు; గాని నా మాట విన్నారా? ఏది యెలాగయినా యీ మాల కూడేమీ యెరక్కుండా చివరికి ఆ మహారాజు బాగానే దాటారు; గాని యిద్దరివంతూ నాపాల బడింది"

"..........................."

"దానిల్లు వల్లకాడుగానూ, ఈ కొంపలో గాజులమలారం దింపడం యెప్పుడేనా తగులడిందా? ఇంకో రెండు జతలు బంగారపువే యేడవరాదూ? ఏంలోటూ?"

"..........................."

"రామరామా! ఖాకలంతా వుల్లిపాయలపాట్టే. నేను తుడవలేనుబాబూ నానా పెంటలూనూ"

"..........................."

"రోజూ నాచేత గోమూత్రం తాగించాలని—నన్నేడిపించే పీనుగులు పుచ్చి పురుగులోడిపోరూ? మళ్ళీజన్మలో మాలమాదిగల్లో పుట్టరూ? దేవుడు లేడూ?"

"..........................."

"వాకట్లో తుక్కుంటే వాడు గింజుకుంటాడు. పోని నానాగడ్డీ పెరట్లో వెయ్యవద్దని బుద్ధి చెబుతాడా అవతలివాళ్ళకీ?"

"..........................."

"ముసిముసి నవ్వులు నవ్వుతూ—అవన్నీ దొంగవేషాలు. నాకు తెలవదూ? ఇంటికి వచ్చాటప్పటికి తప్పుతూ తారుతూ యెదట నుంచుంటే యిక వొళ్ళు తెలిస్తేనా ఆవాజమ్మకీ?"

"............................"

"మేం యెరగమమ్మా యీ సానిటక్కులూ. వాకట్లో మొగాడి కెదురుగా నుంచుని—ఛీ! తలుచుకుంటేనే ప్రాణం చచ్చిపోతోంది"

"............................"

"సంసారిపీనుగులే యిలాగ నడమంత్రపు వేషాలు వేస్తే యిక భోగంవాళ్ళెందుకూ అడుక్కోవాలిగాని"

"............................"

"అమ్మయ్యా, రామయ్యతండ్రీ! నడుం పడిపోయిందోయి నాయనా! అరవైయేళ్ళకే ముద్దని మూలపడేస్తావా మహారాజా!"

"............................"

"ఇదీ వొక దారే. మూడు యజ్ఞాలు చేసింది రామసోదెమ్మ. చచ్చేముందు నాలుగుమాసాలు మంచంపట్టి—అవి కిరస్తాని నీళ్ళు, అది మాల కూడా, అవి యీసడింపులా—మహాప్రభో! పగ వాళ్ళకేనా వొద్దు అలాంటిది. కిందపడేసిదాకా వొకళ్ళచేత చాకిరీ చేయించుకొనే యోగంమాత్రం నాకు కలిగించకుసుమా తండ్రీ!"

౨

"పాడుమొహం. మంచం దిగాటప్పటికి తయారూ దిష్టిపిడతలాగ ఇంతకంటే నల్లపిల్లి మొహంనయం"

"............................"

"నేను చీకటితోటే లేవకపోతే తన పుట్టెం మునిగిందీ! యేచిన్నకథో యే నవలో చదువుకుంటూనో, కులాసాగా కబుర్లు చెప్పుకుంటూనో మేము రాత్రి వొంటిగంటదాకా మేలుకొంటాం గనక నాకు తెల్లవారగట్ల గాఢనిద్ర పట్టిపోతుంది. నేను పెందరాడే లేవనందుకు వారికిలేని బాధ తనకెందుకూ?"

"............................"

"ఎవర్నో ఆడిపోసుకుంటూ కూచోడమేకనక తన కెప్పుడూ నిద్రే పట్టదు. తన కర్మం, నాకేం కళ్ళనిండా నిద్రపోకుండా యిదవడానికీ?"

"............................"

"చాకిరీ చేసుకుంటేగాని సాగనివాళ్ళూ, తన లాంటి దరిద్రగొట్టుపీనుగులూ లేస్తారు తెల్లవారకుండానూ. నా కర్మం యేం కాలిందీ?"

"............................"

"తెల్లవారకుండా లేస్తుందని గోదావరికి వెళ్ళి స్నానం చెయ్యడమా, రామా కృష్ణా అనుకొంటూ కూచోడమా? ఎంతసేపూ యెవర్నో దెప్పడమూ, చూసి వోర్చలేకపోవడమూ—యెప్పుడూ వంకర బుద్ధే. ఛీ! పాకీదీ బయలుదేరుతుంది చీకటితోటే చీపురు పుచ్చుకొని"

"............................"

"మానమనా, అభిమాన మనా? బోలెడుజీతం పుచ్చుకొనే దాసీపీనుగుండగా తన కెందుకూ ఆ పుణికింతాలూ? తను చేస్తే నేనుకూడా చెయ్యక పోతానా? చెయ్యకపోతే సోరంటాలు పెట్టవచ్చు గదా—మొగం నేలబెట్టి యీడిపిస్తానుగాని వాకలి తుడుస్తానేం నేనూ?"

"............................"

"కాఫీకోసం నేను కుంపటి అంటించాటప్పటికి లబోలబో అని మొత్తుకుంటుంది గదా అదేం పుట్టుకో గాని. నేను చేసుకొంటూన్నందుకూ, పుచ్చుకుంటూన్నందుకూ గింజుకోకపోతే తనకా యోగం లేనందుకు యేడవరాదూ?"

"............................"

"మామయ్యగారెప్పుడేనా నోరుచేసుకు అడిగినా కాఫీ యిచ్చి యెరగదీ యిల్లాలు. యెంతసేపూ యేకారంరాసిన అటుకులో యిన్ని మొగాన కొట్టి చెంబెడు మంచినీళ్ళు తాగమనేది. సరసం యెరిగి వుంటేనా?"

"............................"

"వోమాటు ఆ విసిరికొట్టడం చూసి నేను నోటిదగ్గర పెట్టుకోపోతూవున్న కాఫీ పట్టుకువెళ్ళి

యిచ్చాటప్పటికి పాపం బ్రహ్మానందపడుతూ పుచ్చుకొన్నారు కాని యెంత రగడ పెంచిందీ ఆవేళ? మరిచిపోతానా?"

"................................."

"నిజంగా చచ్చే సుఖపడ్డారాయన. ఆయన నవ్వుతూ మాట చెప్పవస్తే ధుమధుమ లాడుతూ అందుకొనే దీవిడ. ఆపాడు మొఖమ్మీద నవ్వే కనపడదమ్మా అదేం పాపమోగాని"

"................................."

"మ్మావుల్లిపాయల పులుసుకోసం గోల పెట్టవద్దని యెన్ని మాట్లేనా గడ్డి పెట్టారు మామయ్యగారు. వింటేనా? ఇంతకీ: తను వండాలా పెట్టాలా? నల్లరాయి నయం యింతకంటేను"

"................................."

"మేము నాటకానికేనా సినిమాకేనా వెడితే కళ్లల్లో నిప్పులు పోసుకుంటుంది. వీధిభాగోతాలూ, బొమ్మలాటలూ అయితే తను పరిగెత్తవచ్చు"

"................................."

"కొడుకు విస్తట్లో కాస్తమిగడ నేస్తే నేకళ్లు చిమచిమ లాడిపోతాయి. ఇక నేను కాఫీ పుచ్చుకుంటే కళ్లల్లో కారం చల్లుకోడం ఆశ్చర్యమా?"

"................................."

"గోచీపెట్టి బట్ట కట్టుకుంటే "కోమటిపద్ధతులు మేం యెరగం బాబూ" అంటూ గుర్రాలక్కలాగ మొగం ముడుచుకుంటుంది. గూడ కట్టు కట్టుకుంటే "భోగం పీనుగు" లంటూ వూళ్లో వాళ్లని కూడా దీవిస్తుంది. నూర్లూ, నూటయాభైలూ పోసి కొనుక్కొన్న దక్షిణాది చీరలూ, బనారసు చీరలూ కట్టుకొంటూ మడికచ్చా పోసుకోనా?"

"................................."

"శిఖ చుట్టుకుంటే వోర్చలేదు కదా? జారుముడి వేసుకుంటే చూడలేదు కదా? తల్లో పువ్వులు ముడుచుకుంటే గుడ్లు మిటకరించుకుంటుంది కదా? యిక యీ దెయ్యాన్ని నేను పెద్ద చేస్తానేం?"

"................................."

"కొడుకు చెయ్యమన్న కూర యెప్పుడూ చెయదు కదా? నేను మడికట్టుకొని చద్దన్నాల పొయిల నిప్పు వెయ్యనిరోజు వారికి యేకాదశే కదా?"

"................................."

"కొడుకునే అన్ని విధాల పీడించే తల్లిపీనుగ కోడలికి "అత్తయ్యగా" రవుతుందా?"

"................................."

"మెడలో రుద్రాక్షతావళం వేసుకుంటే వస్తుందా యేమిటి యెత్తుకుపోవడానికి విమానం నన్నూ నాలాంటివాళ్లనీ తిట్టే తిట్లు లెక్కపెట్టడానికా జపం చేసుకోడానికా యేమిటి ఆ పూసలు?"

"................................."

"ఈపాటికి నీళ్లు మరిగిపోతాయి. ఈరాకాసి యేడుపుకి విరగడ అంటూ లేదు. యేడవనీ. హాయిగా కాఫీ పుచ్చుకొని నిన్న చేసిన ఖర్చులు పద్దు రాసుకోకుండా ఈ దిక్కుమాలిన గొడవ యేమిటి నాకూ? ఇంకా రైతులికి రాసిన వుత్తరాలికి నకళ్లు కూడా రాయాలి. బాబోయ్! అప్పుడే ఆరున్నర అయిపోయింది. వచ్చేశారో వచ్చేస్తున్నారో? పొడిబట్టలు కట్టుకొని, క్రాపింగు దువ్వుకొనేటప్పటికి కాఫీకప్పు నోటి కందించేదానికి నాకీవేళ యింత బద్ధకం వచ్చిందేమిటమ్మా!

3

"ఇంత చెమట పట్టిందేం యివాళ?"

"ఫాల్గునమాసం జొరబడింది, ఆశ్చర్యమా యేమిటి? కాకపోయినా వేడివేడి కాఫీ పుచ్చుకొన్నది మొదలు తిరగడమే ఆయె. ఇక ఆరడానికవకాశం యేదీ?"

"చొక్కా తీసెయ్యండి విసురుతాను"

"వుండేగానే బాగుంటుంది"

"అయితే కందువా—నేను తియ్యగూడదూ!"

"నేను తియ్యకపోతేగా!"

"చూస్తూ నుంచోనా నేను?"

"నువ్వు కలడువా జాగ్రత్తని వచ్చేదాకా పూగుకుంటూ కూర్చోనా నేను?"

"బాగానే వుంది"

"ఇంకేం మరి?"

".. .... "

"కొంచెం నింపాదిగా"

".. .... "

"ఇంకో కొంచెం"

"ఏం?"

"అంతగట్టిగా విసరితే నీకు చేతులు లాగుతాయి. పైగా నీకు చెమటపడుతుంది నాకు నువ్వూ, నీకు నేనూ—"

"వూరుకోండీ"

"తప్పేం? అసలందరం చెప్పవలసినవస్తే అందులోనే వుంది"

"అవ్వ"

"పోనీ—చూడూ. పాలమూరునుంచి రామదీక్షితులు మామగారు వచ్చారు"

"ఏరీ?"

"బజారు పని చూసుకొని పదింటికి వస్తారు"

"భోజనం యిక్కడేనా?"

"ఆహా!"

"అయితే, వంట అయిపోయినట్లుంది. అరిటికాయ పప్పులో వేసింది కాబోలు, బాగుంటుందా?"

"బంగాళాదుంపలు వేయించు నువ్వు"

"..... ... ."

"వెళ్లు మరీ"

"వాళ్లు కాస్త ఆరనిస్తారా?"

"ఆయనికి పొద్దు—అసలు కాఫీ పుచ్చుకోకుండా బయలుదేరరు గాని ఆయన—"

"ఇంకేం! కాకపోయినా పల్లెటూరివారికి పదిగంట లోక ఆలస్యం కాదులెండి"

"మీగడ యేమేనా వుందేమో"

"సారి. మీకే వుంచదూ మీఅమ్మ"

"దాని గుణం అది మానదు. ఏంచెయ్యం?"

".... . ... "

"అప్పుడే అందుకుంది చూశారా? ఈగోడ పక్కని నక్కిందండీ మీరు యింట్లోకి రావడం చూసి. మీరూ నేనూ యింట్లో వుంటే పొంచుండి వింటుందండీ వొక్కమాటు చీవాట్లు—"

"వూరుకో. నామాట విను"

"నేనూరుకోను. నన్నలా తిడుతూవుంటే—"

"ఇప్పటిదాకా వున్న మంచంతా యేమైపోయింది?"

"మంచి, మంచిగడ్డ లూనూ మంచివాళ్లకి మంచిగాని మంకు పీనుగులికీనా? ముక్కుకి మసిరాసుకొని అలాగ—అలాగ మీదకి వస్తూవుంటే—ఏం? ఎంతా? ఏమనుకోవాలి? నీకుందా భయం? నీకుందా సిగ్గు?"

"అమ్మా!"

"అమ్మా బొమ్మానూ. అలాకొచ్చిపోతూవుంటే చచ్చిపెద్దమ్మలాగ వూరుకుని నాకోసం యేడుస్తావేమిట్రా సిగ్గు బుగ్గగానూ నువ్వు వెంగళప్పవు కామిట్రా?"

"నీసిగ్గు చిమడాలి నీబుద్ధి బూడిదకావాలి. నువ్వు ఆడదానివే! నువ్వు తల్లివే! దేవుడులాంటి కొడుకు నిలా తల్లేమనిషి—"

"నువ్వు పెళ్ళానివే! నిక్షేపంలాంటి నాకొడుక్కి మందులుపోసి, వాడిబుద్ధి పిరికిసి, నామాట వినకుండాచేసి—"

"నిమాట యేం వినడం లేదమ్మా నేనూ?"

"ఏం విన్నావు నాయనా! నన్నేం చెప్పనిచ్చావు నాయనా? దాన్ని అణచగలిగేవా? దానికి భయభక్తులు చెప్పగలిగేవా!"

"నువ్వణిగేవా నేనణగడానికి? నీకు భయభక్తులున్నాయా నాకుండడానికి? నోరులేనిదాన్ని చసి—"

"నీకే నోరులేకపోతా? నీకే వాయిలేకపోతా? రాకాసిలాగ అలామీద పడుతున్నావు—"

"నీకంటేనా? నీకళ్లకి నేను రాకాసిలా వున్నానా? దెయ్యపుకళ్లు. పిశాచపున్నోరు. ఛీ!"

"వూరుకోవూ?"

"పెళ్లాం పీనుగుని గడ్డం పట్టుకొని బతిమాలుకుంటావుట్రా నీబదుకు—"

"పోనీ నువ్వువూరుకో అమ్మా"

"దాన్ని లొంగదీయ లేవుగాని నన్నాజ్ఞపెట్టవస్తావా! పెళ్లాం పీనుగమాటవిని తల్లిని లోకువచేస్తావా?"

"నువ్వే లోకువ? నువ్వే తీసికట్టు! నీతో సరిగ్గా మొగాడైనా జవాబు చెప్పగలడా?"

"నువ్వు నంగనాచివా? నువ్వు—"

"మొగుణ్ణే యేగేసి తెగనరికేవు కొడుకులెక్కా నీకు?"

"మొగుణ్ణి వాజమ్మనిచేసి కూచోపెట్టావు. నీకు అత్తగారు లెక్కా యిక?"

"అమ్మా! రామదీక్షితులుగారు వచ్చారు. మన యింటికి వచ్చేవేళ అయింది. నా మర్యాదా తక్కనివ్వవూ?"

"రామదీక్షితులు వస్తే రానియ్యి నాకేం భయమా? తేరతిళ్లు తినడానికి వచ్చేవాళ్లని లక్ష్యపెడతానేం నేనూ?"

"తేరతిండి కోసం వస్తున్నారా ఆయన? వూరుకుంటారేమండీ?"

"వూరుకోకపోతే వురిపెట్టుకోమను. లేకపోతే నువ్వుపెట్టు. నీకడ్డేం? నిన్నెవళ్లేం చెయ్యగలరూ? ఇదివరకే కుక్కనిచేశావు. వురిపెడితేమాత్రం నీకు సాగదూ?"

"అమ్మా! నన్నేమన్నా సంతోషమే; గాని యింటికి వచ్చిన పెద్దమనిషి—"

"పెద్దమనిషా? యెలాంటి పెద్దమనిషి? నెలకి నాలుగురోజులు నెత్తిమీద కూచునే వాడు పెద్దమనిషంటే యేమిటి?"

"అయ్యో! అయ్యో! ఈ మాటలు బాబుగారు వింటే యింకేమన్నా వుందా? మర్యాదా నిలుస్తుందా? నలుగురిలోనూ తల యెత్తుకోగలమా?"

"నీకేవుంది మహామర్యాద. నీకేవుంది గౌరవం. నీకే పట్టింది యింటి పరువంతానూ?"

"దానికేమి, నీకేపట్టింది. నిజమే. అయితే అపరువు తక్కించుకోడం యిలాగేనా?"

"ఇలాగేనా అంటే మరెలాగ? నేను పప్పుకూరా, చారూ చేసివుంచితే మళ్ళీ తను బంగాళా దుంపలు వేయించడానికి సిద్ధపడుతుందా? నేను కొంత వడ్డనా, అది కొంతవడ్డనానా?"

"వారియింటికి వెడితే నన్ను మనుగుడుపు పెళ్లికొడుకుని చూసినట్లు చూస్తారు. దిక్కుమాలిన పప్పుకూరా ఆయనకి వడ్డించడం?"

"పల్లెటూరివాళ్లకి అంతకంటే యెక్కువ వస్తుందేం? కాకపోయినా, రెండోమనిషి వడ్డనలోకి వస్తే నా మర్యాదా యేదింక?"

"పోనీ బంగాళా దుంపలు నువ్వు వేయిస్తావా మరీ?"

"వేయించవద్దూ మరీ నీ పెళ్లయాక? ఇవాళ కన్ను తెరిచిన పీనుగువు, నువ్వు చెబితే నా మడి తగులడిపోయినా సరే, నానిష్ఠ గంగలో కలిసినా సరే యిక చేతుల్లు కట్టుకొని చెయ్యకద్దూ?"

"అదండీ యేడుపూ? మీరు చెప్పిందిచేస్తే యిక తన పెత్తనం యేదీ అని. చూశారా?"

"చూడ్డం యెందుకూ? చూసేం చెయ్యగలవే నువ్వు? నీ వల్ల యేమవుతుందే?"

"యేమవుతుందా? యేం చెయ్యగలనా?—"

"వూరుకో నువ్వు. అమ్మా!"

"ఏం?"

"నీహద్దులో నువ్వుంటావా, మాటతక్కుతుంది. లేకపోతే లోకంతో పాటే, తెల్సిందా?"

"ఏమిట్రా తెలిసేది?"

"వీధిలో పడితే పోయేదేమీ లేదు. గాని అయినా యెందుకని చూస్తున్నాను. నువ్వు నీ[illegible]హాతేమిటో, నీహాయీ [illegible] ఆలోచించుకోడం లేదు. నీకు [illegible]చకపోతే యెవర్నైనా అడుగు

నువ్వు దానికి అత్తగారి నంటే చుట్టరికం లోనే నీ అత్తరికం గాని వ్యవహారంలో కాదు నాన్న బతికి వున్నంతకాలమూ నువ్వేమన్నా చెల్లింది. నీ పెత్తనం సాగింది.

"ఇప్పుడు మాత్రం యెందుకు సాగదూ?"

"ఎందుకు సాగదూ అంటే సాగనివ్వను కనక. ఇక నువ్వే తప్పించుకోవాలి. నీమర్యాదా, మా మర్యాదా కూడా నిలవాలంటే నువ్వీ పద్ధతి కట్టి పెట్టాలి. వీధిలోకి వెళ్లి వ్యవహారం చేసుకొనే వాణ్ణి నేను. నాకష్టసుఖాలను బట్టి, నావీలు చాళ్లను బట్టి యింటోవాళ్లు మసులుకోవాలి నీ కది యిష్టం లేకపోతే యిక నీకు వున్న గోడు గూడా నిలవదు"

"నిలవక యేం చేస్తుంది?"

"గంగలో కలుస్తుంది. అడిగేదేమిటి?"

"నన్ను గంగలో కలుపుతావుట్రా?"

"ఇక పెద్దరాలు మానెయ్యి. ఏమంటావు? నా చెప్పుచేతల్లో వుంటావా వుండవా?"

"పెళ్లాంపీనుగు చెప్పినట్లల్లా తగులడతావుట్రా?"

"నాయింటో నా పెళ్ళానికుండే స్థానం వేరూ, నీకుండే స్థానం వేరూనూ? మీ రెవళ్ల స్థానంలో వాళ్ళుంటే నాస్థానం నాకు తక్కుతుంది. నాస్థానాన్ని నేను నిలుపుకోవా లంటే యిక మొగ మాటం కట్టిపెట్టవలసి వస్తుంది."

"నన్ను మనోవర్తి పీనుగులా వుండమంటావా?"

"నీకు చాకిరీ అక్కర్లేదు. కంగారక్కర్లేదు. పెట్టినకాడికి భోజనం చెయ్యి. రామాకృష్ణా అం టూకూచో. కావలసింది చెప్పి చేయించుకో. ఇక నీ రాణీగారికి సాగినట్లు సాక్కపోతే—"

"నా రాణీ తనం నాడే కూలిపోయింది"

"ఇంకేం మరీ? దేనికేనా హద్దుంది. ఆ సంగతి తెలుసుకోకపోతే చిక్కు వస్తుంది"

"..............................."

"ఏమంటావమ్మా?"

"నేను బతికి వున్నంతకాలమూ పెత్తనం నాది కాని మరొకళ్లది కాదు. నన్ను వొకళ్లేమీ చెయ్య లేరు. అయినవాళ్ళూ కానివాళ్ళూ నాయింటో పెత్తనం చేస్తూవుంటే నేను చూడలేను"

"అది బాగా నిశ్చయించుకొన్న మాటేనా?"

"ఏమయితే నీకేం?"

"నేనడిగే దానికి జవాబు చెప్పాలి"

"నేను చెప్పను. నన్ను నిలవబెట్టి అడగడానికి నీకేం అధికారం వుంది?"

"నాసంగతి నీకు బాగా తెలుసు. నేను మాటంటే తిరగను సుమా"

"నా సంగతీ నీకు తెలుసు. అన్నమాట నేనూ తిరగనూ"

"తొందర పడకండీ"

"దూరంగా వుండు. ఏమమ్మా? అంతేనా?"

"ఆహా!"

"సరే—"

"వొద్దు సుమండీ, నన్ను చంపుకుతిన్నట్టే. నేను చచ్చినట్టు పడివుంటాను. అల్లరి చెయ్యకండి"

"ముందు చేతులు వదులు. మాట్లాడకు. ఈపూటతో వంటలు వేరూ—"

"అయ్యో, అయ్యో! నా మాట వినరూ?"

"వెళ్లి తొరగా మడికట్టుకుంటావా లేదా?"

"అంతపట్టుబడితే యెలాగండీ? నామాట కాస్త—"

"నోరెత్తవద్దు"

"నే నేం చేతునమ్మా?"

"నే నేం చేతునమ్మా యేమిటి యింకానూ? నసాళం అంటేదాకా తిర్రెపెట్టావు, యేమీ యెరగ నట్లు నటిస్తున్నావు. ఎంతదానవే నీ మొగం మండా. చలితేలులాగ యెంతపని చేయించావే నీవాళ్లు మండిపోనూ. పెళ్ళాం పీనుగు మాట విని యింతపని చేస్తావుట్రా? వోరి చెవలవాజమ్మా నువ్వికా సంసారం చెయ్యగలవుట్రా? నా పెత్తనం తప్పించి యిక నువ్వు ముందుకు వస్తావుట్రా?"

ప్రాచీనకాలపు జనాభాలెఖ్ఖలు

మారేమండ రామారావుగారు ఎమ్. ఏ. బి. ఇడి

ఆధునికకాలమున బదిసంవత్సరముల కొకసారి ప్రభుత్వమువారు జనాభాలెఖ్ఖలను వేయించుట యెల్లరకును విదితమే. దీనివలన రాష్ట్రమున కార్థికముగను రాజకీయముగను బెక్కులాభములు గలుగ గలవు. ఈ యాచారమును పాశ్చాత్యులీ దేశమున ప్రవేశపెట్టలేదనియు, భారతదేశమ్మున ప్రాచీనకాలము నుండియు నిట్టి యాచార ముండిన దనియు ననేకప్రమాణములవలన దెలియుచున్నది.

చంద్రగుప్తమౌర్యుని కాలమున మన దేశమున కేతెంచి యిచ్చటి పరిస్థితులను గమనించిన మెగాస్థనీస్ అను యవనదేశీయు డాకాలపు ప్రభుత్వ విధానమును వర్ణించుచు "...మూడవతరగతికి జెందిన యుద్యోగులు గొందరు గలరు. వీరికి వర్ణమత వివక్షత లేక జనులలో గలుగు జననమరణములను విచారించు టొక ముఖ్యకర్తవ్యము." అని వ్రాసినాడు. కౌటిల్యుని యర్థశాస్త్రమునం దీవిషయమును గూర్చి విశేషాంశములు గలవు.

నేడు జనాభాను దీయు నియోగము తాత్కాలికముగ నిర్మింపబడి యనతికాలమున, కార్యమయిన వెంటనే యుపసంహరింపబడుచున్నది. చంద్రగుప్తునికాలమునం దిట్టి నియోగ మొకటి శాశ్వతముగ నెలకొల్పబడియుండి యెల్లకాలమును పనిచేయుచుండెడిది. మఱియొక విశేషము. ఈ నియోగము కేవలమును జనసంఖ్యనేగాక జనుల యాదాయవ్యయములను, దేశమునందలి గృహారామక్షేత్రాదికములను, రాష్ట్రీయాదాయమును గూడ లెఖ్ఖించుచుండినది. సమాహర్తయనునత డీనియోగమునకు ప్రధానాధికారి. దేశమంతయు నాల్గు విభాగములుగ జేయబడెను. ఒక్కొక విభాగమునకు స్థానికుడను నొక యుద్యోగి యుండెను. ఇందలి గ్రామములలో నైదింటి కొక గోపుడను నధికారి యుండెను. ఈ యుద్యోగుల కార్యములను బరీక్షించుటకై, ప్రదేష్ట (Inspectors) లుండిరి. వీరందరునుగాక సమాహర్త ప్రత్యక్షనియమమున గొందరు చారు లుండిరి. ఇతరోద్యోగులతో జోక్యము లేక వీరును విశేషములను గ్రహించుచుండిరి. గోపు లనెడి గ్రామాధికారులను, గ్రామములలోని నాలుగు వర్ణముల వారి సంఖ్యను గన్గొనుట; వృత్తులనుబట్టి కర్షకులు, గోపాలకులు, వర్తకులు, పారిశ్రామికులు, నని వారిని విభజించుట: ప్రతియింటను గల స్త్రీపురుషబాలవృద్ధుల సంఖ్యను శీలమును, కుటుంబాదాయవ్యయములను లిఖించుట; పశువులను లెఖ్ఖించుట, పన్ను నిచ్చెడి భూములను, ఈయని వానిని దెలిసికొనుట, గ్రామమునుండి వసూలు చేయబడు బంగారము, సుంకములు మున్నగువాని పరిమితిని నిర్ణయించుట—మొదలగునవి కర్తవ్యములు. సమాహర్తచే నియమింపబడిన చారులు గూడ స్వతంత్రముగ నీయంశములను గూర్చి విచారించుచుండిరి. అదిగాక, వీరలు గ్రామములలో రాకపోకలు చేయువారి సంఖ్య, అందులకు గారణములు, అనుమానింపదగిన ప్రవర్తన గలవారు—మున్నగు విషయములను గూడ చూచుచుండిరి. గృహస్థులవలెను, తాపసులవలెను, చోరులవలెను మారువేషములు ధరించి వీరు తమ ధర్మమును నెరవేర్చుచుండిరి.

రాష్ట్రమునకువలె రాజధానికి గూడ నిట్టిదే యొక నియోగ ముండెడిది. అందు ప్రధానాధికారి నాగరకుడు. నగరము నాల్గుగ విభజింపబడి, యొక్కొక విభాగమున కొక్కొక స్థానికుడు నియమింపబడెను. ఈతనికి లోబడి యిరువది ముప్పది యిండ్లను గూర్చి విచారించు నధికారము గల గోపు లుండిరి. ఈరాజధానిశాఖోద్యోగులకును రాష్ట్రీయోద్యోగులకును విధు లొక్కటిగనే

యుండినవి. గణనాసౌకర్యమునకై, సత్రములు మున్నగు ధర్మసంస్థల యధికారులు దైనందినికాగ తానాగతులను గూర్చియు, గృహయజమానులు రాకపోకలు చేయు బంధువులను గూర్చియు, జనాభానియోగము వారికి దెలియజేయవలెనని శాసింపబడెను.

జనసంఖ్యనుగూర్చియేగాక ఇతర విషయములను గూడ నీనియోగమునందలి యుద్యోగులు విచారించుచుండిరి. గ్రామములయొక్క సరిహద్దులను నిర్ణయించి, మెరకపల్లమువంతున భూములను విభజించి గురుతులను వేయుట, అడవులు, తోటలు, దేవాలయములు, యాత్రాస్థలములు, సత్రములు, నీటివసతులు, బాటలు, శ్మశానములు, గడ్డిమైదానములు మున్నగువానిని వివరించుట, వారికి గర్తవ్యములు.

ఈ జనాభా నియోగమువలన రాష్ట్రమునకు గొన్ని లాభములు గలుగుచుండినవి. ప్రజల గుణశీలములున్ను, ప్రవర్తనయు గనిపెట్టబడుటచే, రాజద్రోహాది ప్రమాణములను గమనించుట సులభమయ్యెను. ప్రజల యాస్తిని గూర్చియు, భూమిని గూర్చియు విశేషములు దెలియుటచే, పన్నులను విధించునెడ సౌకర్యము గల్గెడిది. అదియునుగాక నీనియోగము నివేదికలనుండి రాజును బరిపాలకవర్గమును, దేశముయొక్కయు ప్రజలయొక్కయు గష్టనిష్ఠురముల నెప్పటికప్పుడే దెలిసికొని యథోచితముగ ప్రవర్తింప నవకాశము లేర్పడినవి. ప్రాచీనభారతీయపరిపాలనావిధాన మిట్టి చక్కని కట్టుబాటులకు లోనై యుండినది.

ఈ మాట నిజం

చింతా దీక్షితులుగారు బి. ఏ. ఎల్. టి

మొన్ననే వచ్చాడు.

నన్నయభట్టు రాజమహేంద్రవరం వచ్చాడు. ఎంతమాత్రమూ సందేహం లేదు. ఈ నాకళ్ళకి దృష్టిగుణము దోషించ లేదు. ఈ నాత్వక్కుకు స్పర్శగుణం నశించలేదు, ఈ నాచెవులకు శ్రవణశక్తి మందగించలేదు మొన్ననే వచ్చాడు నన్నయ్యభట్టు రాజమహేంద్రవరం. నే నాయన్ని చూచాను. నేనాయన్ని తాకాను. నేనాయన్ని విన్నాను. ఎంతమాత్రమూ సందేహంలేదు, ఈ మాట నిజం.

గోదావరి ఒడ్డున ఒకనాడు ఊసుపోక తిరుగుతున్నాను. గోదావరప్పుడు వరదలలో ఉంది. సాయంకాలము. గోదావరిలో తేలి కొట్టుకుపోతున్న కలపను పట్టుకొని పట్టుకొని అలిసి తెప్పలు బుజాలమీద పెట్టుకొని జాలరు లింటికి పోయారు. వరదలలో కొట్టుకుపోయే పెద్ద మ్రాకులమీదవాలి పురుగులను తింటూ, నదీగర్భం మీద సవారిచేసిన కాకులు గూళ్లకి పరుగెత్తుకు పోయాయి. భక్తితో పళ్ళూ పసుపూ కుంకుం సాగరసహధర్మచారిణి కర్పించడానికి వచ్చినభక్తులు ఇంటిముఖము పట్టారు. విహారార్థమువచ్చి వినోదముగా గోదావరిని కొంతసేపుచూచి ప్రజలు ఇండ్లకు వెళ్ళారు. గోదావరి హోరున ప్రవహిస్తోంది. ఆ హోరువింటూ నేను గట్టున నిలబడ్డాను. వెన్నెల గోదావరిమీద పండుకొన్నది.

రాత్రి ఎంతపొద్దు పోయిందో తెలియదు. వెన్నెలతో పెనవేసుకొని ప్రవహించే గోదావరినిచూస్తూ పరధ్యానముగా ఎంతసేపు నిల్చబడ్డానో నేనక్కడ. తెలివితెచ్చుకొని ఇటూ అటూ చూచాను. ఎక్కడా మనష్యులు దృగ్గోచరము కాలేదు. జంతువులైనా కానరాలేదు. మార్కండేయుని అలయప్ర

తలుపు సందులోనుంచి దీపకాంతి బయటికివచ్చి నాతోపాటు గోదావరీ వైభవాన్ని ఆనందిస్తోంది. చెట్లాకు అల్లాడడంలేదు. వాయువువీచడం లేదు. ఆకాశాన్ని మబ్బులు లేవు. నీలాంబరము మీద చంద్రుడు పడుకొని నవ్వుకొంటున్నాడు. గోదావరి హోరున ప్రవహిస్తోంది.

దూరాన గోదావరి వంతెన నల్లగా కనిపిస్తోంది యాభైఆరు కాళ్ల తోకలిబండేలాగ. ప్రవహించె గోదావరి పైని ఆడుకొనే చిన్నికెరటాలకు మాణిక్యశోభ వచ్చింది. ఊరు నిశ్శబ్దముగా ఉన్నది. పగలుచూచిన గోదావరిని రాత్రికలలు గంటున్నారు ఇళ్లలోమనుష్యులు. నిద్రను ధిక్కరించి నేనొక్కడనే గోదావరిని చూస్తున్నాను. గోదావరి హోరున ప్రవహిస్తోంది.

ఇది నేను రాజమహేంద్రవరములో నన్నయ్యభట్టును చూచిన సమయము. మొన్న మొన్న నన్నయ్యభట్టును ఈ కళ్లతో చూచిన సమయము. నారాయణభట్టుతో కలిసి భారతాంధ్రీకరణ ముపక్రమించి కొంతవరకు సాగించిన నన్నయ్యభట్టును చూచిన సమయము.

రాజరాజనరేంద్రుడు మహావైభవముతో రాజ్యముచేసిన రాజమహేంద్రవరము తొమ్మిదిశతాబ్దములు దాటినపిమ్మట ఏలాగున ఉన్నదో చూడడానికి వచ్చాడు కాబోలు ఆ తేజోమూర్తి. పూర్వాపరిచితస్థలములను చూచుకొ వచ్చినాడు కాబోలు ఆదికవి. తన్ను పోషించిన మహారాజుతో తాను విహరించిన పుణ్యస్థలములు నేడెట్లున్నవో చూడ వచ్చాడు కాబోలు ఆ బ్రాహ్మణుడు. సార్వభౌముని వైభవముతో పెనవేసుకొని విజృంభించిన తన వైభవానికి ఆకరమైన రాజధానిని దర్శింపవచ్చాడు కాబోలు ఆంధ్రకవితాపిత. మదపుటేనుగుల ఘీంకారాలతో, రణహయముల హేషలతో, రథనేముల శబ్దములతో వీరహుంకారాలతో మారుమ్రోగే ఘంటాపథములను తిరుగ చూడ మనసుపుట్టి అవతరించాడు కాబోలు ఈ దేశాభిమాని. వేదఘోషలతో, వీరఘోషలతో, పండితవాదములతో కవివాక్కులతో, వనితల గానముతో కలకలలాడే తనపురరాజము నేడెట్లున్నదో చూచుకో వచ్చినాడు కాబోలు రాజరాజు కులబ్రాహ్మణుడు. తన కాలపు స్త్రీ పురుషులవలెనే, వారిసంతతివారైన నేటి స్త్రీ పురుషులుకూడా, సాహసవంతులున్నూ, అభిమానవంతులున్నూ, ధర్మతత్పరులున్నూ, దేశాభిమానులున్నూ దైవభీతికలవారున్నూ అయి ఉన్నారో లేదో పరిశీలింపవచ్చి ఉంటాడు నన్నయ్యభట్టు. కొసట బీసలే చదివి గాథల త్రవ్వే తెనుంగువారికై తాను విరచించిన భారతము ఎంతవరకూ వారిని సంస్కరించిందీ తెలుసుకోడానికి వచ్చి ఉంటాడు ఆ మహాకవి. తాను క్రుంకులిడిన గౌతమి, తానుపూజించిన ఈశ్వరుడు, తాను విహరించిన ఉద్యానములు, తాను వాదించిన సభలు, తానుమెట్టిన రాచనగరు, నేడు ఎటిస్థితిలో నున్నవో చూడదలచి వచ్చి ఉంటాడు వాగనుశాసనుడు. తాను పాలించిన కవిత్వము, తానుశాసించిన వాక్కు ఎట్లా వృద్ధిజెంది శాఖోపశాఖలైనవో పరికింప నుత్సహించి వచ్చి ఉంటాడు ఈ కవిచక్రవర్తి.

గోదావరి హోరున ప్రవహిస్తోంది. చంద్రుణ్ణి చిన్న మేఘశకలము కప్పింది. చిరుగాలి వీవ మొదలు పెట్టింది. ఎందువల్లనో గోదావరి హోరు హెచ్చించినట్లు తోచింది, ఎందువల్లనో అని అటుచూచాను. గోదావరీ గర్భాన్ని చీల్చుకొని ఒక తేజస్సు బయటికి వస్తూన్నట్లు కనిపించింది. ఆశ్చర్యమువేసింది. గోదావరిమీదపడ్డ వెన్నలంతా ఒకచోట పోగుపడ్డట్లయింది. ఆ తేజస్సు నన్ను సమీపించుచున్నట్లయింది. కంటిమీద రెప్పపడలేదు. చెవులకు శ్రవణశక్తి అతిశయించింది. హృదయము వేగముగా కొట్టుకోవడం ప్రారంభించింది. ఆ తేజస్సు గట్టుమీదకు వచ్చింది. పరకాయించి చూచాను. నేను పొరపాటు పడలేదుకద. తేజస్సనుకొన్నది నా సమీపాన్ని తేజస్సులాగ లేదు. ఒక పురుషరూపములాగ ఉన్నది. ఆ పురుషుడు వర్చస్వి, ఉన్నత

దేహుఁడు ; విశాలవక్షుఁడు. సన్న జాజి పూలదండలాగ యజ్ఞోపవీతం ప్రకాశిస్తోంది. ఆ పురుషుడు గోదావరివైపు తిరిగి నమస్కరించాడు. రాజమహేంద్రవరపు కోటవైపు తిరిగాడు. చేతులు జోడించాడు. అతని పెదవులనుండి వెలువడి యీ శ్లోకము వినిపించింది.

“శ్రీవాణీగిరిజా శ్చిరాయదధతో వక్షోముఖాంగేషుయే । లోకానాం స్థితి మావహ న్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవామ్ । తే వేదత్రయమూర్తయ స్త్రీపురుషాస్సంపూజితా వస్సురై । ర్భూయాసుః పురుషోత్తమాంబుజభవ శ్రీకంధరా శ్శ్రేయసే॥

శ్లోకము ముగిసింది. ఎవరుమీరని అడగాలనుకొన్నాను. ఈ సంకల్పము ప్రశ్నయై బయటకు రాకముందే ఆ పురుషుడు నన్నయ్యభట్టనే భావము నా మనస్సుకు కలిగింది. నేనడగ దలచుకొన్న ప్రశ్నకు జవాబు ప్రశ్న బయటికి రాకముందే నా హృదయానికి తాకింది.

ఆ పురుషుడు వెనుదిరిగి చూచాడు. తన వెనక రమ్మని చేతితో సంజ్ఞ చేశాడు. ఆకాశాన్ని చిన్న చిన్న మేఘాలు అలము కొంటున్నవి. తుంపర పడుతోంది. గోదావరి హోరున ప్రవహిస్తోంది.

పురుషుడు ముందునడుస్తున్నాడు. ఆశ్చర్యము, భయము, వింత ముప్పిరిగొనగా ఆయనవెంట నేను నడిచి వెళ్లుతున్నాను.

పరమపదించిన మహాకవి ఒకడు పాంచభౌతిక దేహముతో దర్శనమిస్తే ఎలాగ ఉంటుంది? పరమపదించిన తొమ్మిదివందలసంవత్సరములకు ఈ దర్శనమైనప్పుడో? నా సంతోషాన్ని, దాని ఛాయనే పొందుచున్న నా అపనమ్మకాన్ని, నా అదృష్టాన్ని దాని ఛాయనే పొందుచున్న నా సందేహాన్ని, ఇది స్వప్నస్థితి కాదనే నాధైర్యాన్ని దానిఛాయనే పొందుచున్న నా వివేచనాశక్తిని నేను వర్ణించదలచుకోలేను. మీరే ఊహించుకొండి

ఊరంతటికీ ఎత్తైన ఒక మెట్టపై నిలబడ్డాడు నన్నయ్యభట్టు. అతని వెనక నేను నిలబడ్డాను.

అతడు నాలుగువైపులా కలయచూచాడు. తన రాజమహేంద్రవరమును పరిశీలించి చూచాడు. అతని దృష్టికి గోదావరిమీద వంతెన తగిలింది. అతని భావము నా మనస్సుకు గోచరించింది. ధర్మసంస్థాపనముకోసము శ్రీరాముడు సముద్రాన్ని బంధించాడు. ఎట్టి సత్కార్యము నపేక్షించి ఈ గోదావరి ఈకాలపువా రిట్లు బంధించారు? అతడు ఒకమారు కళ్లు మూసికొన్నాడు. తనకాలపు రాజమహేంద్రవరమును తలచుకొంటున్నాడు కాబోలు. లేకుంటే ఆకాలము నా హృదయములో ఎట్లా ప్రతిఫలిస్తుంది. ఆకాలపు తెలుగువారి అభిమానము; ఆత్మగౌరవము, ఆకాలపు గంటముయొక్క సూటి, దృఢత్వము; ఆకాలపువాక్కుయొక్క కండ, సార్థకత్వము; ఆకాలపుసత్యము, ధర్మము— ఇవన్నీ నామనస్సులో పరుగులు వారేయి. తత్క్షణమే ఈకాలపు తెలుగువారి చచ్చు, నిష్ప్రయోజకత్వము, ఈకాలపు చీటకలముల డాబు, దుర్బలత్వము, ఈకాలపు వాక్కుయొక్క పేలవత్వము పిరికితనము—ఇవి గోచరించాయి. సిగ్గుపడ్డాను. ఎంత తీసికట్టులోనున్నా నేటికాలపు ఆంధ్రత్వము అంతహీనస్థితిలో లేదని చెప్పడానికి పూనుకొని నన్నయ్యభట్టు నుద్దేశించి అన్నాను. “ఆదికవీ, మీకాలమున భారతము ప్రారంభమైనది. మాకాలమున భారతము పూర్తియైనది. మీకాలమున వ్యక్తిస్వాతంత్ర్యములేదు. నేడు అది మాసొమ్ము. మానవుని సుఖములను పెంపొందజేసే వాహనములు, కాలమును జయించే వాహనములు మాకు కొత్తలు......” నేను పూర్తిచెయ్యక మునుపే నన్నయ్యభట్టు నాచెయ్యిపట్టుకొని నడిపించుకుపోయాడు. నానోటికి తాళముపడ్డది. కాని నాప్రశ్నలకు అతని సమాధానంమాత్రం నా హృదయానికి తట్టింది. అది ఇది. మురికికాలవలో బతికే పురుగు తలయెత్తి సూర్యుణ్ణి చూచి ధిక్కరిస్తోందా అని.

నన్నయ్యభట్టుగారి కరస్పర్శకు నాకు కొత్తశక్తి

వచ్చింది. భయము పోయింది. ఏవిధముగా తీసుకువెళ్ళాడో తెలియదు. ఎక్కడికి తీసుకొనివెళ్ళాడో తెలియదు. కాని కొంతసేపైన పిమ్మట గ్రహించాను మేము భూమిమీద లేమని. భూగర్భములో ఉన్నామని. రాజరాజనరేంద్రుడి నగరుకింద భూగర్భములో ఒక విశాలమైన గదిలోమే మున్నాము. ఎక్కడినుంచి వచ్చిపడుతోందో వెన్నెలకాంతి జ్ఞాపకము చాలదు కాని గదిలో మాత్రము వెల్తురు ఉన్నది. నన్నయ్యభట్టు ఒకమూలకు నన్ను తీసుకువెళ్ళాడు. అక్కడ తాటాకుల పుస్తకాలరాసులు కనబడ్డవి. రాగిరేకుల కుప్పలు కనపడ్డవి. ఇంతకాలమూ పాడవకుండా ఆ తాటాకు లెట్లా నిలిచాయో? ఇంతకాలమూ చిలుముపట్టి చెడకుండా ఆ రాగిరేకు లట్లా ఏవిధముగా నున్నవో! ఇవి చూచినప్పుడు నా కొక ప్రశ్న తోచింది. నన్నయ్యభట్టే కనిపించినప్పుడు అడగకుండా ఎట్లా ఉండడం? భారతము నిజముగా రెండు పర్వాలున్నూ మూడవపర్వములో కొంతభాగమున్నూ మాత్రమే నా నన్నయ్యభట్టు రాస్త? అరణ్యపర్వము వ్రాసేటప్పుడు పిచ్చిపట్టి చనిపోయినమాట వాస్తవమేనా? సారంగధరుడు రాజరాజు కుమారుడేనా? నా ప్రశ్నలకు జవాబుకాబోలు— ఒకరాగిరేకు తీసి నన్నయభట్టు నాకిచ్చినాడు. నేను దానిని జాగ్రత్తగా కండువాలోచుట్టి చంకను పెట్టినాను. లోకములోని ప్రవాదములు తప్పనిన్నీ రాగిరేకులోని విషయములు సత్యనిరూపణచేస్తవని ఊహించాను. ఆంధ్రులు అదృష్టవంతులని తలపోశాను.

అక్కడ ఎంతసేపున్నానో తెలియదు. ఎట్టిశక్తి అసమయమున నన్నయభట్టు నాకు ప్రసాదించాడో తెలియదు. కాని నన్నయభట్టు ప్రోత్సాహముమీద, నన్నయ్యభట్టు సహాయముతో ఆ తాళపత్రగ్రంథములలో విషయాలు తెలుసుకొన్నాను. రాగిరేకులవృత్తాంతము గ్రహించాను. ఆకాలపు తెలుగుభాషతో నాకు పరిచయములేదు. ఆకాలపు ఆచారవ్యవహారాలు నాకు తెలియవు. ఆకాలపు రాజ్యములవృత్తాంతములూ, ఆకాలపురాజుల మర్యాదలూ, ఆకాలపుప్రజల పరిస్థితులూ నాకు తెలియవు. కాని సర్వమూ నేను గ్రహించాను. నన్నయ్య నాకు ప్రసాదించిన శక్తిగాక ఇందుకింకేమి కారణముంటుంది?

ఉదయము కాబోతోందికాబోలు. రాత్రి నాలుగోజాము కాబోలు. గోదావరి హోరున ప్రవహిస్తోంది. ఆహోరు నాకు అస్పష్టముగా వినిపిస్తూనేఉంది.

ఎట్లా బయటికివచ్చామో తెలియదు. గోదావరి గట్టుమీద ఉన్నాము. వెన్నెల తగ్గుతోంది. చంద్రుడు అస్తమించబోతున్నాడు. గోదావరి హోరున ప్రవహిస్తోంది.

“చూడు” అన్నాడు నన్నయ్యభట్టు.

చూచాను. గోదావరిమీదికి దృష్టినిగిడించాను. కనురెప్ప వాలనియ్యకుండా చూచాను. ఒక పెద్ద మంట కనిపించింది. బంగారపుమంట. ఆమంటలో తైక్ష్ణ్యములేదు. ఆమంటలో తీవ్రత లేదు. ఆ మంటలో చలవ ఉన్నది. ఆమంటలో సుఖము ఉన్నది.

కల్మషాన్ని దహించే మంట అది.
ప్రేమను పురిగొల్పే మంట అది.
శత్రుత్వాన్ని జయించే మంట అది.
సత్యాన్ని స్థాపించే మంట అది.
ధర్మాన్ని స్థాపించే మంట అది.

ఎందరు మహాపురుషులో ఆ మంటలో ప్రవేశిస్తున్నారు. దివ్యశరీరములు పొందుతున్నారు.

ఎందరు తల్లులో ఆమంటలో ప్రవేశిస్తున్నారు. మహాలక్ష్ములౌతున్నారు.

ఎంతటిమంట! లోకాన్నంతని ఆవరించినదామంట. నవనాగరీకాన్ని దహించి పవిత్రము చేసే మంట అది.

ఈ మంటను బుద్ధుడు అశోకుడు ప్రజ్వలింపచేస్తున్నారు. శంకరుడు పోషిస్తున్నాడు. అగ్బరు

వృద్ధిపొందిస్తున్నాడు. మహాత్ములా మంటను లోకమంతా వ్యాపింపచేస్తున్నారు.

నన్నయ్యభట్టు నాకు చెప్పదలుచుకొన్న సందేశము నా హృదయానికి తట్టింది. ఆసందేశము నన్నయ్యభట్టు విజ్ఞానానికి వారసులైన తెలుగువారి నుద్దేశించింది. ఆసందేశమిది ,,కల్మషాన్ని శత్రుత్వాన్ని దహించి ప్రేమను పురిగొల్పి సంకెళ్లను పడత్రెంచే ఈమంటలో ఒక విస్ఫులింగ గౌరవము సంపాదించుకోడానికి, శాశ్వతమైన సుఖప్రేమైన జీవనానికోసము మీచిన్న బ్రతుకులు బలికాకూడదా? ఇంతటితరుణ మెన్నడువస్తుంది?’’

మంట మాయమైనది. కళ్లునులుపుకొని ప్రక్కను చూచాను. నన్నయ్యభట్టులేడు. అంతటా చూచాను. ఎక్కడాలేడు. ఆవిశాలనేత్రములూ, ఆ ఆజాను బాహువులూ, ఆ సాత్త్విక తేజస్సూ, మనస్సులో జారిపోకుండా నిలుపుకొంటూ, చంకనున్న రాగిరేకు భద్రముగా పట్టుకొని దిక్కుమొగముతో ఇంటికి వెళ్లాను. గోదావరి హోరున ప్రవహిస్తూనే ఉన్నది. జరిగిన సర్వమూ గోదావరిచూస్తూనేఉంది. నేను చెప్పినసంగతుల యదార్థమూ గోదావరికే తెలుసును. నన్నయ్యభట్టు రాజమహేంద్రవరం వచ్చాడు. ఈ మాట నిజం.’’

*   *   *   *

*   *   *   *

*   *   *   *

పై విషయములున్న కాగితాలు నాకు చిత్రాంగి మేడప్రక్కను దొరికినవి. వ్రాసినవారెవ్వరో తెలియదు. చివర వ్రాలులేదు. వ్రాసినవాడు తనస్వప్న వృత్తాంతమే వ్రాశాడో, స్వకపోల కల్పిత విషయమే వ్రాశాడో, యదార్థమే వ్రాశాడో తెలియదు. యదార్థమే అయితే అతడు తెలిసికొన్న కొత్తవిషయాలు అతనివద్దనున్న రాగిరేకూ ఆంధ్ర చరిత్రకు ఉపయోగకారులుకావచ్చు. ఇంతకీ అతడు చూచేడనుకొన్న వ్యక్తి నన్నయభట్టే అయితేను.

శ్రీరంగరాజు చరిత్ర

టేకుమళ్ల కామేశ్వరరావుగారు బి. ఏ. బి. ఇడి.

శ్రీరంగరాజు చరిత్ర లేక సోనాభాయి పరిణయమను నవలను నరహరి గోపాలకృష్ణమసెట్టి 1872 లో ప్రకటించేడు. ఈనవల అయిదు ఉల్లాసాల గ్రంథం. డెమ్మీసైజున ౨౨ పుటల పుస్తకం. దీనికి రెండు ఉపోద్ఘాతా లున్నాయి; ఒకటి తెలుగున, ఒకటి యింగ్లీషున.

గోపాలకృష్ణమసెట్టిని గురించి మన కేమీ తెలియదు. గ్రంథంలోని ఉపోద్ఘాతాన్ని బట్టి యితను కర్నూలు నివాసస్థుడని మాత్రం తెలుస్తూంది. ఇతని జీవితచరిత్ర సేకరించడానికి నేను కొంత ప్రయత్నం చేసేను. కాని లాభించలేను. ఇంతలో శ్రీ మున్నంగి లక్ష్మీనరసింహాశర్మగారు తాము రాయలసీమ కవుల చరిత్రలు సేకరిస్తున్నామని చెప్పి ఆంధ్రపత్రికలో ప్రకటించేరు. నరహరి గోపాలకృష్ణమసెట్టి చరిత్రకూడా సేకరించవలసిందని నేను వారినికోరేను. అలాగే చేస్తామని వారు నాకు వాగ్దానం చేసేరు.

గోపాలకృష్ణమసెట్టి యింకా యేమైనా యితరపుస్తకాలు రాసేడో లేదో మనకు తెలియదు. ఈపుస్తకం మాత్రం అప్పుడు రాజప్రతినిధిగా వుండిన లార్డుమేయోకు అంకిత మిచ్చేడు. శ్రీరంగరాజు చరిత్ర “హిందువుల యాచారము తెలుపునట్టి నవీన ప్రబంధము’’ని గ్రంథకర్త చెబుతున్నాడు.

ఈనవల రచనకు గల కారణం ఉపోద్ఘా

తంలో యిలా చెప్పబడింది. "పది నెలలనాడు లార్డుమేయోగారు బంగాళీల యాచారంబులు తెలుపు ప్రబంధము గావించు వానికి బహుమానంబు చేయబడునని ప్రచురము చేసిరి. అది నేను చదివి నప్పుడు తెలుగుదేశమువారి యాచారంబులు తెలుపునట్టి ప్రబంధం బొకటి రచియించుట తెలుగువారి కుపయుక్తం బగునని తలంచి నా నేర్పు కొలంది ని ప్రబంధంబు చెప్పబూనితిని." పై వాక్యాల వల్ల యీ గ్రంథరచనలో గ్రంథకర్త ఉద్దేశం సాంఘికమని తెలుస్తూంది. అంతేకాదు, తెలుగులో ఆచారవ్యవహారాలు తెలిపే వచనప్రబంధం అంతకు మునుపు లేదనీ యిదే మొదటిదని కూడా తెలుస్తూంది.

౫౦. వీరేశలింగకవి రాజశేఖర చరిత్రను 1878 లో ప్రకటించేడు. శ్రీరంగరాజు చరిత్ర 1872 లో ప్రకటించబడింది. అంటే రాజశేఖర చరిత్రకు ఆరేళ్లముందు శ్రీరంగరాజు చరిత్ర ప్రకటించ బడిందన్నమాట. కాని వీరేశలింగకవి తన స్వీయచరిత్ర రెండో భాగంలో ౨౩౨ వ పుటలో "తెలుగులో మొదటి వచనప్రబంధమును నేనే చేసితిని" అని రాసేడు. (వచనప్రబంధమంటే యిక్కడ నవల అని అర్థం) ఈమోస్తరుగా రాయడానికి కారణం వీరేశలింగకవి శ్రీరంగరాజు చరిత్రను గురించి యెరగక పోయేనా వుండాలి. లేక యిది ప్రశస్తమయిన గ్రంథం కాదని ఉద్దేశించి దీని సంగతి చెప్పక తను రచించిన రాజశేఖర చరిత్రే మొదటి వచనప్రబంధమని చెప్పి వుండాలి.

వీరేశలింగకవికి శ్రీరంగరాజు చరిత్రను తెలియదా అన్న సంగతి మొదట చూద్దాం.

శ్రీరంగరాజు చరిత్రను నేను వీరేశలింగగ్రంథాలయం లోంచే తీసుకు వచ్చేను. ఇది వీరేశలింగకవి సేకరించిన గ్రంథమే కాని మరెవ్వరూ సేకరించినది కాదని గ్రంథాలయ కార్యదర్శులయిన శ్రీ అడవి శంకరరావుగారు చెబుతున్నారు. శ్రీరంగరాజు చరిత్రను వీరేశలింగకవి పూర్తిగా యెరిగి వున్నాడు అని అనడానికి యింతకంటె ప్రబలమైన కారణ మింకొకటి వుంది. అదేదంటే, శ్రీరంగరాజు చరిత్రలోని కొంత వస్తువుని వీరేశలింగకవి తన రాజశేఖర చరిత్రలో వుపయోగించేడు. శ్రీరంగరాజు చరిత్రలోని భాగం—

"..... వొకనాడు మంచి యెండను మార్గాయాసముచే మిక్కిలి డస్సి, నీరుపట్టువేడ దపించుచు బాటను బండుకొనియె—అది చేలను గోడతకోయుచున్న కొందఱు మాలలు చూచి—యెవరో బడలిక చేత నేలం బడిరని యతనికి వచ్చి నీరిచ్చుటకుం దగినవారు కామింజేసి మఱి యెవరి నయినను దగు కులమువారిని బిలుచుకొని వత్తుమని చేతనున్న నీ రియ్యకయె మరలి పోయిరి. అజులము జూచి పుచ్చుకొందమా యని—యతని కాసక్తి యుండియు—పాడు వర్ణాచారపు బంధములంజేసి ముట్టం జేతులాడక యతండు పొందిన మనోవేదన యేమని చెప్పుదు—

౨౭. ఇట్లు పరితపించుచుండంగాం గొందఱు కాఁపువారు తమ తెచ్చుకొన్న సంకటియు నీరును దీసికొని యతనికి వచ్చిరి గాని యతండు క్షత్రియుండగుట యెఱింగి నీరిచ్చుటకు వెనుకముందు చూచుచుండిరి. రాజు దప్పిచే వర్ణాచారంబులకు సయితము జంకక నీరు తెమ్మని సైగచేసె—పుచ్చుకొమ్మని యొకండు నీటిబుఱ్ఱ యియ్యంబోయె రాకొమరుండు హస్తంబు సాంచె నంతలో మఱియొక కాపు తటుకున దుత్తను గుంజుకొని, యెన్ని పాపములు చేసితిమో, యీ పాడుకులంబున బుట్టితిమి. వీరు బ్రాహ్మణులో క్షత్రియులో వీరి కేడ నయిన శూద్రులు నీరిత్తురే; వీరు తాపంబున కోర్వలేక నీరు త్రావెదమని చెప్పెదరుగాని, మనము పిల్లలు గలవారము. మనకేల యీ పాపంబు—వేగం బోయి చల్లం దెమ్మని యొకరిని గ్రామంబునకు బంపె.

వా—యేపుణ్యాత్ముండు గల్పించెనో యీవర్ణాశ్రమధర్మంబులు—ప్రాణంబులు పోవుచున్నను—వాని

బంధంబులు పోకపోయె. ఆత్తరిని రాకొమరుని చిత్తం బేమిగా తల్లడిల్లుచుండెనో యాపరమాత్మునికె కాని యొరుల కెఱుకయె? ఆబంధంబులు తెంపవలెనని యుద్యుక్తుం డయినం గాని—వాని తెంచుట యసాధ్యంబయ్యెఁగా! వానిం గల్పించిన వాని మహిమ యేమని చెప్పవచ్చు.

—అ. ఇట్లు నిరుపట్టురూపమున నున్న యమునితో జీవంబు పోరాడుచుండఁగా వెనుకఁ జిక్కిన చెలికాఁడు వేగంబున వచ్చి తీర్థమిచ్చి ప్రాణంబులు దక్కించె—”

(శ్రీరంగరాజు చరిత్ర, పు 22, 23)

పైభాగం రాజశేఖర చరిత్రలో యీ కింది మోస్తరుగా రాయబడింది. “......మార్గమునకు కొంచెము దూరములో దక్షిణపు దిక్కున మూగి యున్న గుంపులోనుండి “శుద్ధిచేయుట్కకు మజ్జిగ” యని కేకలువేయుచు కొందఱు పరుగెత్తుకొని వచ్చుచుండిరి. రాజశేఖరుడుగారు వాండ్రను జూచి యాసందడి యేమని యడుగఁగా, వారిలో నొక గొల్లవాడు ‘రాచకొమారు డొకఁడు వడగొట్టి యారావిచెట్టు కింద పడిపోయినాఁ’డని చెప్పెను.

రాజ:—మీ రాతని గొంతుకలోఁ గొంచెము నీళ్లు పోయలేక పోయినారా?

గొల్ల:—మొట్టమొదట మేము నీళ్లియ్యఁ బోఁగా, శూద్రులము కాబట్టి మాచేతి నీళ్లు త్రాగనని యీరాజు పుచ్చుకొన్నాఁడు కాఁడు. తరువాత దేహమునకు తాళలేక మాచేతి నీళ్లు త్రాగుట కొప్పుకొన్నాఁడు. కాని మా వారిలో పెద్దవాఁడు వచ్చిశూద్రుఁడు రాజునోటిలో నీళ్లుపోసిన పాపము వచ్చునని చెప్పి, నీళ్లు శుద్ధిచేయుటకై మజ్జిగ నిమిత్తము మమ్ముఁ బంపినాడు. మాపల్లె యిక్కడికి పావుక్రోసు దూరమున నున్నది. మీరు బ్రాహ్మణులుగాఁ గనబడుచున్నారు. మీవద్ద నేమయిన మంచితీర్థ మున్నయెడల, వేగిరము పోయి యాతని గొంతుకలో నాలుగు చుక్కలు పోసి పుణ్యము కట్టుకొండి.

ఆ మాటలు విని రాజశేఖరుడుగారు రుక్మిణి చేతిలోనున్న మంచినీళ్ళచెంబును పుచ్చుకొని, చెట్టు దగ్గఱకు పరుగెత్తిపోయి గుంపులో నుండి త్రోవ చేసికొని ముందుకు నడచి గుంపునడుమను చెట్టునీడను కటికనేలను పరుండి చేతితో నోరుజూపి నీళ్ల నిమిత్తము సైగచేయుచున్న యొక మనుష్యుని చూచిరి. ఆ మూఁకలలో నొకఁడు నీళ్ళముంతను జేతిలోఁ బట్టుకొని ‘ఈ రాజు నిష్కారణముగా జచ్చిపోవుచున్నాడు; ఏ దోషము వచ్చినను సరే నీళ్ళుపోసి బ్రతికించెద’నని చేరువకుఁ బోవుచుండెను. అప్పుడొక ముసలివాఁడడ్డము వచ్చి వాని చేయి పట్టుకొని నిలిపి, ‘ఈ వరకుఁ బూర్వజన్మములో మనమెన్నియో పాపములను జేయుట చేతనే మనకిప్పుడీ శూద్రజన్మము వచ్చినది: ఇప్పుడీ రాజును జాతిభ్రష్టునిజేసి యీ పాపము సహితము కట్టుకోవలెనా? నా మాటవిని నీళ్లు పోయవలద’ని నివారించుచుండెను. ఇంతలో రాజు కన్నులు తేలగిలవైచి, చేయి నోటివద్ద కెత్తఁబోయి వడకించుచు క్రిందఁ బడవైచెను. అప్పుడు రాజశేఖరుడుగారు వెంటనే పోయి మంచినీళ్ళతో ముందుగా నెండుకొని పోవుచున్న పెదవులను దడుప చప్పరింప నారంభించెను. అంతట రాజశేఖరుడుగారు తనచేతిలోని యుదకముతో మొగమును దడిపి మఱికొంచెము నీరు లోపలికిఁ బోయఁగా త్రాగి కన్నులు విప్పిచూచి రెండవప్రక్కకు తిరిగి మఱికొంతసేపునకు సేదదేఱి, ఆ రాజు తన జీవములను నిలిపినందులకై రాజశేఖరుఁడుగారికి కృతజ్ఞతతో బహునమస్కారములు చేసి లేచి కూరుచుండెను. ఇంతలో పల్లెకుబోయిన వారు మజ్జిగయు, కొన్ని పండ్లను దీసికొనివచ్చి యిచ్చిరి. ఆ రాజు కొన్ని పండ్లను లోపలికిఁ బుచ్చుకొని మజ్జిగత్రాగి స్వస్థపడెను.” (రాజశేఖరచరిత్ర, పు. 110, 112) రాజశేఖరచరిత్రకు మూలగ్రంథమైన ‘వేక్‌ఫీల్డ్ మతగురువు’లో పైభాగం లేదు. ఇది శ్రీరంగరాజు చరిత్రలోంచి తీసుకోబడినదే.

వీరేశలింగ కవి నవలకు వచనప్రబంధమని వాడేడు. అంతకుపూర్వమే గోపాలకృష్ణమసెట్టి నవలకు వచనప్రబంధమని పేరుపెట్టేడు.

గోపాల కృష్ణమసెట్టి తనకథ నాలుగువందల యేళ్లకిందట జరిగినట్టుగా రాసేడు. వీరేశలింగ కవి తనకథ రెండువందలయేళ్ల కిందట జరిగినట్టుగా రాసేడు.

నవల కళాప్రధాన గ్రంథం. నవలలో ఆచారవిమర్శవుండడం సమాజంకాదు. కాని గోపాలకృష్ణమసెట్టి తననవలలో ఆచారాలు విమర్శించేడు. అసలు పుస్తకమే "హిందువుల యాచారములు తెలుపునట్టి నవీనప్రబంధ" మన్నాడు. వీరేశలింగ కవి రాజశేఖరచరిత్రలో ఆచారవిమర్శచేసేడు. గ్రంథంలో లేనటువంటి ఈ అంశాన్ని రాజశేఖరచరిత్రలో చేర్చేడు. నవలకళలో ఆచారవిమర్శను చేర్చడమనేది వీరేశలింగకవి గోపాలకృష్ణమసెట్టిని చూసి నేర్చుకున్నదనే నా ఉద్దేశం.

ఇంక రెండోసంగతి. శ్రీరంగరాజు చరిత్ర గొప్ప గ్రంథం కాదు కాబట్టి వీరేశలింగకవి దాని మాటయెత్తక తనురాసినదే మొట్టమొదటి నవల అని చెప్పేడు అన్న సంగతి చూద్దాం.

శ్రీరంగరాజు చరిత్ర అసమగ్రరచన కాదు. గోపాలకృష్ణమసెట్టి యీ నవలలో ఆచారాలను చక్కగా విమర్శించేడు. కథాకల్పన నేర్పుగా చేసేడు. శైలిలో కొత్తమార్గం తొక్కేడు. అందుచేత యిది అల్పమైన రచనకాదు. వీరేశలింగ కవి గణించతగని గ్రంథంకాదు. ఒకవేళ శ్రీరంగరాజు చరిత్ర అసమగ్రరచన అయినా అదే మొట్టమొదటి సాంఘికనవల అవడంవల్ల దాని తర్వాత రాయబడ్డ మరొకపుస్తకాన్ని మొట్టమొదటి నవల అని చెప్పకూడదు. వీరేశలింగకవి తనదే మొట్టమొదటి నవల అని చెప్పడం తప్పని చెప్పక తప్పదు.

గోపాలకృష్ణమసెట్టి తన నవలను గురించి యీ మోస్తరుగా చెప్పుచున్నాడు. "ఇది కేవలము కల్పితంబు కథానాయకుండు—మహాకులీనుడై యుండవలయునని యీ దేశంబున మున్ను దొరతనముచేసిన విద్యానగరరాజు వంశము వారిలో శ్రీరంగరాజను పేరు గైకొంటిఁగాని యిందుచెప్పిన చరితము యథార్థముగా జరిగిన కథయని యెంచఁగూడదు. ఇందుఁజెప్పిన యాచారములు మాత్రము యథార్థముగా నాచరింపఁబడునవి. ఈ కథ ౨౦౦ సంవత్సరములనాడు జరిగినట్లుగా చెప్పఁబడియెగాని యప్పటియాచారములకు నిప్పటి యాచారములకును లేశంబుగాని భేదంబు లేమింజేసి యిందుదహరింపబడిన యాచారంబులన్ని యిపుడాచరింప బడుచున్నవని యెఱుంగునది—కేవల గద్యాత్మకములయిన తెనుఁగుప్రబంధములు—విశేషము లేమింజేసి యిది తెనుఁగువిద్యార్థులకు సయితి ముపయోగించునని తలఁచెద."

శ్రీరంగరాజు చరిత్ర కేవలం వచనప్రబంధమనే చెప్పవచ్చు. మనము సాధారణంగా చదివే పద్యప్రబంధాలకీ దీనికీ వుండే భేదం ఒక్క వచనమే. ఈ వచనప్రబంధంలో ప్రబంధనియమాలన్నీ పాటించబడ్డాయి. ప్రబంధంలో వుండవలసిన యిరవైరెండు వర్ణనలు యించుమించుగా దీంట్లో కనబడుతున్నాయి.

కథాసంగ్రహం :—

మొదటి ఉల్లాసం :— విద్యానగరాన్ని ఒకరాజు పాలిస్తున్నాడు. అతనికి శారదఅనే వేశ్యవుంది. ఆ వేశ్యకు కృష్ణుడనే కొడుకు వున్నాడు. కొన్నాళ్లకు ఆ రాజుయొక్క పట్టపుదేవి కుమారుణ్ణి కంటుంది. శిశువుయొక్క భారసాలకు శారద వస్తుంది. రాజుయొక్క రాణులచేత శారద పరిభవించబడుతుంది. అందరిమీద కసితీర్చుకుంటానని శపథంచేసి వెళ్లిపోతుంది. శిశువుకు శ్రీరంగరాజని పేరు పెడతారు.

శ్రీరంగరాజు పెద్దవాడవుతాడు. కృష్ణుడుకూడా పెద్దవాడవుతాడు. ఇద్దరూ కలిసి ఒకమారు వేటకు వెళ్లారు. నౌకర్లంతా కృష్ణుణ్ణికూడా శ్రీరంగరాజుతో సమంగా గౌరవిస్తారు. అదిచూసి శ్రీరంగరాజు కోపించి కోటకువెళ్లిపోయి శారదను, కృష్ణుణ్ణి

కోటనుంచి పంపించి వెయ్యమని తండ్రితో చెప్తాడు. తండ్రి తటపటాయిస్తూవుండగా అతను రామయ్య అను చెలికాడితో కూడా దేశాంతరం వెళిపోతాడు.

రెండవ ఉల్లాసం:—ఒక పల్లెటూళ్ళో శ్రీరంగరాజు ఒక బ్రాహ్మడితో పట్నవాసు పల్లెటూరి నివాసం గురించి మాట్లాడతాడు. అటుతర్వాత వర్ణాశ్రమాలను గురించి ప్రసంగిస్తాడు.

మూడవ ఉల్లాసం: రాజు తనకొడుకు కోసం సేవకుల్ని వెతకపంపుతాడు. శారద కోట విడిచి వెళిపోతుంది. రాజుకు ఆకాశరామన్న ఉత్తరాలు వస్తాయి

నాలుగవ ఉల్లాసం:—శ్రీరంగరాజు సంగమేశ్వరం నుంచి వేటకు బయలుదేరుతాడు. అక్కడతనికీ రామయ్యకూ విపత్తు సంభవిస్తుంది. అటు తర్వాత వాళ్ళిద్దరూ దోవతప్పిపోయి శ్రీశైలం దగ్గిరవున్న చంద్రగుప్త చేరుకుంటారు. చంద్రగుప్తిలో రాజు సోనాభాయి అను ఒక లంబాడీ కన్యను చూసి ప్రేమిస్తాడు. సోనాభాయి తల్లి, రామయ్య కూడా ఆ సంబంధం నుంచి రాజును తప్పించచూస్తారు. రాజుమట్టుకు లొంగడు. ఆ తర్వాతరాజుకు తెలుస్తుంది. సోనాభాయి నిజంగా లంబాడీకన్య కాదని రాచకన్యే అని. ఇలాగుండగా—ఇంతకుముందు సోనాభాయిని భీమానాయకుడనేవాడు పెళ్లి చేసుకోప్రయత్నిస్తాడు కాని సోనాభాయితల్లిఆసంబంధానికిష్టపడక తనువున్న స్థలంనుంచి చంద్రగుప్తికి వచ్చేస్తుంది. భీమానాయకుడు కొండవీటిరాజుదగ్గరికెళ్లి సోనాభాయిని వివాహం చేసుకోమని రాజుతో చెప్ప, జంగిడు మల్లమ్మ అనేదాన్ని సోనాభాయిని వెదకబంపుతాడు. మల్లమ్మ సోనాభాయిసంగతి తెలుసుకొని భీమానాయకుడి దగ్గతికి వస్తుంది ఆతర్వాత భీమానాయకుడు సోనాభాయిని యెత్తుకువస్తాడు. సోనాభాయితల్లి యీ సంగతి శ్రీరంగరాజుకు తెలియజేసి వెళ్ళిపోతుంది.

అయిదవఉల్లాసం:—శ్రీరంగరాజుకూడా కొండవీడు చేరుతాడు. అక్కడ అందరూ అనేకమోస్తర్లగా ప్రయత్నం చేస్తారు కొండవీటిరాజు సోనాభాయిని వివాహమాడకుండా చెయ్యడానికి. చివరికి కొండవీటిరాజుతల్లి సోనాభాయిని రహస్యంగా కోటఅవతలికి పంపేస్తుంది. అప్పుడు వారంతా కలిసి విద్యానగరం వెళిపోతారు. అక్కడ సోనాభాయితల్లి సోనాభాయిచరిత్ర చెబుతుంది. రంగనాయికి (సోనాభాయి) రంగరాజుయొక్క మేనత్తకూతురే అన్నసంగతి తెలుస్తుంది. కొండవీటిరాజుకు రంగనాయికి పినతండ్రి కూతురన్న సంగతికూడా తెలుస్తుంది. శ్రీరంగరాజు రంగనాయికిని వివాహమాడతాడు. కృష్ణుడికి ఒక పరగణా యిస్తాడు. శ్రీరంగరాజు చాలాకాలం సుఖంగా రాజ్యం పరిపాలన చేస్తాడు.

ఈ కథావ్యూహంవంటి కథలు మనవిజ్ఞానంలోనూ సాంప్రదాయికవిజ్ఞానంలోనూ చాలా వున్నాయి. పాశ్చాత్య వాఙ్మయంలో యిటువంటి వ్యూహాలుకల నవలలు వున్నాయి. ఈ నవలలో సాంప్రదాయిక విజ్ఞానంలోని గంగాగౌరులపాట కొంతమట్టుకు వుపయోగించబడింది.

ఈ నవలలో మెచ్చుకోతగినది కథాకల్పన. అంతకంటే విశేషమైన సంగతి మరొకటివుంది; అదేమంటే శైలి ఈపుస్తకం చాలాసులభశైలిలో రచించబడింది. ఆకాలంయొక్క శైలీసాంప్రదాయాలు యిందులో కనబడవు. ఇదే యీరచయిత యొక్క ప్రజ్ఞను పూర్తిగా తెలియజేస్తూంది. వచనశైలి ప్రబంధాలలోని వచనంలాగవుంది. విరతి సంజ్ఞలు యెక్కడా వాడుక చెయ్యబడలేదు.

ఈ నవలలోని వర్ణనలు రచయిత యొక్క సూక్ష్మపరిశీలనను తెలియజేస్తున్నాయి. ఈరచయిత యొక్క సాంఘిక పరిశీలనను గురించి వేరే చెప్పక్కర్లేదు. వేశ్యజాతి, ప్రసవం, నామకరణోత్సవం, వివాహాలు, వర్ణవిభజన, గ్రహశాంతులు, శకునాలు

మొదలైనవాటిని గురించి చక్కగా విమర్శించేడు. అక్కడక్కడ రాజకీయమైనవాటినికూడా కొంత కొంత విమర్శించేడు.

శ్రీరంగరాజు చరిత్ర తెలుగులోని మొదటి సాంఘికనవల అని చెప్పవచ్చు. ప్రథమప్రయత్న మవడంచేత దీంట్లో కొన్నిలోట్లు వున్నాయి. కాని రచయితయొక్క అపూర్వప్రజ్ఞ పుస్తకమంతటా విశదమౌతూనేవుంది.

ఉత్తరరామచరితము*

— డాక్టర్. చిలుకూరి నారాయణరావుగారు ఎమ్. ఎ., పి. ఎచ్. డి. ఎల్. టి

భవభూతి రచించిన ఉత్తరరామచరితనాటకమును ఇంతవరకు చాలామంది తెనిగించినారు. ఇప్పుడు తిరిగి మ. రా. రా. జయంతి రామయ్యపంతులు గారున్ను తెనుగు చేసినారు. శ్రీ రామయ్యపంతులు గారిని ఆంధ్రదేశమున తెలియనివారుండరు. వీరు ప్రెసిడెన్సీమేజిస్ట్రేటు పని చేసి విశ్రాంతి వేతనము పుచ్చుకొంటున్నారు. లెజిస్లేటివ్ ఎసెంబ్లీలో కొంతకాలము మెంబరుగా ఉండిరి. ఆంధ్ర మద్రాసువిశ్వవిద్యాలయాలలో సెనేటు మెంబరుగాను, తెనుగుపాఠ్యపుస్తక నిర్ణాయక సభలలోను, తెనుగు పరీక్షకవర్గ సభలలోను, అధ్యక్షులుగాను ఉండిరి. ఆంధ్రసాహిత్యపరిషత్తును స్థాపించిన వారిలో వీరు ముఖ్యులు; పరిషత్తు భారమంతా నిరంతరముగా వీరే వహిస్తున్నారు. ప్రారంభవిద్య నుంచి విశ్వవిద్యాలయవిద్యవరకు విద్యార్థులకు బోధకము గ్రాంధికభాషామూలముగానే జరుగవలె నని సభలలో తీర్మానములు చేయించిన్ని, మహజర్లు పంపించిన్ని, రాజులతోను మంత్రులతోను చెప్పిన్ని, ఎన్నో విధాల నిద్రాహారాలు లేక కష్టపడినారు. ఆంధ్రవిశ్వవిద్యాలయములో అధ్యాపకాంధ్రభాషాపండితవర్గమును ఏర్పాటుచెయడానికి నియమింపబడ్డ సభలో వీరు ఎక్సుఫర్టు సభ్యులు. పరిషత్తు పక్షమున గొప్ప నిఘంటువు వ్రాయించవలె నని, తామున్ను ఆకార్యములో పాల్గొంటూ, కృషిచేస్తున్నారు. నేటికి వీరికి 70 సంవత్సరముల వయస్సయినా, గ్రాంధికభాషాదేవీ సాక్షాత్కారము కోసము ఇంకా గొప్ప తపస్సు చేస్తున్నారు. కాని, ఆదేవి వీరి కిప్పటికిన్ని సాక్షాత్కరించలేదు. “వత్సా, నేను నిత్యకళ్యాణిని, నిత్యయౌవనను, అజరామరను, నన్ను కనుక్కోవలె నని ఉంటే, నీవు వెతుకుతూ ఉన్న దిక్కున నీకు సంపూర్ణముగా కనబడను; జీవించి ఉన్న వారి నాలుకలమీద నిత్యతాండవము చేస్తూ, అనేకవిధాల లోకాలకు ఆనందము కలుగజేస్తూ ఉంటాను. నేను గీర్వాణిని కాను; గీర్వాణి స్వర్గములో ఉన్నది; ఆమె అంశతో భూలోకములో అవతరించినాను; జీవలోకములో నన్ను శీఘ్రముగా తెలుసుకోగలవు; చెవి ఒగ్గి వింటే, కళ్లు తెరచి చూస్తే, నాస్వరూపము నీకు బోధపడుతుంది, అట్లు చెయకపోతే నీ శ్రమ అంతా వ్యర్థము” అని ఘంటాఘోషముగా పలుకుతూ ఉన్నా, శుష్కధ్యానాసక్తులకు వలె, ఈ సత్యవాణి వీరికి హృదయగతము కాలేదు. నలభై యేండ్ల వయస్సుయేసరికి మానవుల అభిప్రాయాలు స్థిరము లయిపోత వనిన్ని, ఆట్టి వారితో

---

* మ. రా. రా. జయంతి రామయ్యపంతులు బి. ఎ., బి. యల్., గారి ఆంధ్రానువాదము. సరస్వతీ పవర్ ముద్రాక్షరశాలలో ముద్రితము, 1831.

వాదించి వారి అభిప్రాయాలు మార్చడము సాధ్యము కాదనిన్ని మన సత్యశాస్త్రజ్ఞులంటారు. అంతకు రెండింతలు వయస్సు కలిగిన వీరి వ్యావహారిక భాషా వైముఖ్యము గడ్డకట్టుకొనిపోయి ఉంటుంది. వీరితో వాదించడమువల్ల కార్యము లేదని తెలిసినా, ఇటూ అటూ ఊగుతూ ఉన్న ఇతరుల కయినా పనికి వస్తుం దని ఈ వ్యాసము వ్రాయడానికి పూనుకొన్నాము.

శ్రీ రామయ్యపంతులుగారింత వరకున్ను కావ్యము లేవిన్ని వ్రాయలేదు. గ్రంథాలకు పీఠికలున్ను, పత్రికలకు వ్యాసములున్ను, అనేకములు వ్రాసినారు. ముక్తే (క్తీ?) శ్వరశతక మొకటి వ్రాసినారు శాసనములను కొన్నిటిని పరిశోధించి ప్రకటించినారు. వీరు ప్రయత్నించి వ్రాసిన పెద్ద గ్రంథాలలో ఈ ఆంధ్రీకృతోత్తరరామచరితనాటకము మనకు తెలిసినంతమట్టుకు మొదటిది. ఈ ఆంధ్రీకరణవిధానమును తా మీక్రింది రీతిగా పీఠికలో చెప్పుకొన్నారు.

"(1) ఆంధ్రభాషాసంప్రదాయములఁ బాటింప నా శక్తికొలఁది యత్నించినాఁడను" ఉపోద్ఘాతము i. ప. 5, 6.

(2) "పలుకుబడి వేఱు పదపరిపాటు వేఱు, రీతులును వేఱ యన్వయరీతి వేఱు భాష భాషకు నను మాట భావమందుఁ జేర్చి సంస్కృతమును దెల్గు సేయవలయు" అవతారిక, ప. ౮.

(3) "తెలుగున నెపుట్టె నీకృతి తొలుత ననెడు భావ మాత్మఁ దోఁచెడు భంగిన్, జెలఁగిన యనువాదము, సరసుల కింపొఁ, గాక యున్న శోభింప దిలన్." అవతారిక, ప. ౯.

(4) "దీటుగ సంస్కృతంబునకుఁ దెల్గొనరించెడు వారు మూలమున్,
దాఁటక, భావమున్ రసము తప్పక వచ్చెడు నట్టు లెంతయున్
దేటగ వేఱు మాటలను దెల్పినఁ బొల్పగుఁ గాక యొట్టులో
మాటకు మాటఁ బెట్టి యొక మాడ్కిని మాటిన మెత్తురే బుధుల్,"

అవతారిక. ప. ౭.

ఇట్లు తా మేర్పాటు చేసుకొన్న నియమాలను శ్రీరామయ్యపంతులుగారెంతవరకు తమ అనువాదములో పాటించినారో విచారింతము.

I

ఆంధ్రభాషాసంప్రదాయము

ఆంధ్రభాషాసంప్రదాయ మంటే పంతులుగారి అభిప్రాయము గ్రాంధికాంధ్రభాషాసంప్రదాయమని అనుకొంటాను. గ్రాంధిక, వ్యావహారిక భాషాసంప్రదాయములు రెండున్ను ఆంధ్రభాషాసంప్రదాయమే అంటే మాకు కొంత సంతోషమే. కాని, గ్రాంధిక, వ్యావహారిక భాషాసంప్రదాయాలు రెండున్ను ఒక్కటే రచనలో అతకవని మాత్రము మా అభిప్రాయము. వ్రాస్తే తమ పాండిత్య మంతా చూపి, సమస్తాంధ్రగ్రంథములను పరిశీలించి గ్రాంధికసంప్రదాయమును నిర్ణయించుకొని, దానిని తప్పకుండా వ్రాయవలెను లేదా, కేవల నిత్యవ్యావహారిక భాషలో నయినా వ్రాయవలెను. సహజముగా వచ్చే వ్యవహారభాష తప్పనుకొని, గ్రాంధికసంప్రదాయము తెలియక గ్రంథరచనకు దిగేవారు (అ) కృతక రూపాల నయినా సృష్టిస్తారు, లేదా, (ఆ) వ్యవహారభాషను వ్రాసి అది గ్రాంధిక భాష అని తమ్ము మోసగించుకొని ఇతరులను కూడా మోసగిస్తారు. వ్యావహారికభాషావిముఖులై, దానిమీద కత్తికట్టిన వారు కాబట్టి పంతులుగారీ రెండు పనులనున్ను చేసినారు.

(అ) కృతకభాష

(1) "మహాశ్వేతావృత్తాంత మిందునకు దృష్టాంతము". (ఉపోద్ఘాతము. పు. iv)

"నీపుట్టువు, చిట్టచివర కిందువ కైనదా?" (పు. ౩౮.)

అందు, ఇందు, ఎందు, ల మీద 'నకా' సూత్రము ప్రకారము నగాగమము రా దనిన్ని, ప్రాతభాషలో 'అందులకు, ఇందులకు, ఎందులకు' అని రూపా లుంట వనిన్ని అర్వాచీనగ్రంథాల లోను వ్యవహారములోను అందుకు, ఇందుకు, ఎందుకు, అని ఉంట వనిన్ని చిరకాలమునుంచిన్ని మేము ఘోషిస్తూ ఉన్నా, మేము చెప్పినాము గదా అని కాబోలు ఈనాటి గ్రంథకర్తలు నగాగమమును తప్పకుండా చేస్తూ ఉంటారు. రామయ్యపంతులుగారు 'ఇందు' మీద నగాగమమును చేసి 7వ పుటలో 'లేచి ముందుకు నడచి' అని ముందుకుఅని ప్రయోగించినారు. 'ముందునకు' అని వ్రాయలేదు. ఇందుకు చాలా సంతోష మయినది.

(2) "నిన్నిచటకుఁ బిలిచికొని రాలేదు"— పు. 6.

'ఇచటకు' అనే రూపము కృతకము. ఏఆధునిక మహానుభావుడు మొదట వాడినాడో కాని, రామయ్యపంతులవా రంతటి వారికి కూడా ఈ రూపము ప్రమాణ మయినది.

(3) "తోరపుఁ-బూజల్ సలిపెదు నిద్దె"— పు. 10.

"పూర్ణగర్భ నిద్దె కటికనై త్రోయఁగా నెంచినాఁడే"—పు. 26.

"సికడకవనార్థము వచ్చి రిద్దె యువనిపాలా"— పు. 26.

"కనుపట్టుచు నున్నది యిద్దె—పు. 130.

'ఇది' మీద ఎత్వము చేర్చ వస్తునిర్దేశము చేయు డానికి 'ఇదె' అని కవులు వాడితే, 'ఇదె' కి రూపాంతరము 'ఇద్దె' అన్నది కాబట్టి, రామయ్య పంతులుగారు దానికి కూడా ఎత్వము చేర్చి 'ఇద్దె' అని వాడినారు. వీరు పాటించిన ఆంధ్రభాషాసంప్రదాయ మిద్దే.

(4) "క్రొత్తగా సారిపచ్చిన కూర్మి సతుల గలసి"—పు. 11.

'సారె' అని గ్రంథములు, వ్యవహారము. శబ్దరత్నాకరములో 'సారె', ఈఅర్థములో 'సారి' లేదు. పంతులుగారు వ్యుత్పత్తి నూహించి 'సారి' అనే రూపమును కల్పించి ఉంటారు. 'కోరిక' మొదలయినవి అసాధువులు, 'కోరికి' 'కోరిక' అని ఉండవలె నని పండితులవల్ల విని ఈమార్పు చేసి ఉంటారు.

(5) "జనకజావిరహం బిపు డబ్బినట్టులన్"— పు. 17.

"మే ల్రతనము లట్టులన్"— పు. 31.

"కుసుమము లట్టులన్"—పు. 90.

"ఇటులనే చిరకాల ముండు..."—పు. 158

"అట్టులన్, ఇట్టులన్" అనేవి "అట్లా ఇట్లా" అనే వ్యావహారికరూపాలకు ఇప్పటివారు కల్పించిన కృతకరూపాలు. గ్రంథాలలో ఉంటే చూపించవచ్చును, వ్యవహారములో లేవు. 70_వ పుటలో "అటులే కానిమ్ము" అని పంతులుగారే ప్రయోగించినారు. పద్యములో కుదరక 'అట్టులన్, ఇట్టులన్" అని కల్పించుకోవలసివచ్చినది.

(6) "కొలువు విడిచి నగపతి లోపలకు నరిగె"— పు. 4.

"లోపల, వలపల, దాపల," మొదలయినవి ఔపవిభక్తికము లని నిఘంటునిర్మాత లయిన పంతులుగారికి తెలియక కాదు. ఆధునికపండితకృతకసంప్రదాయానికి వీరు కూడా లోబడవలసి వచ్చినది.

(7) "అయ్యని యొక్కయు రాక్షసుల యొక్కయు"—పు. 17.

దీనికి ప్రమాణప్రయోగము పురాణము శాస్త్రాల "ఆయొక్కానున్ను, ఈయొక్కానున్నున్ను" గ్రంథాలలో 'యొక్క' కనబడదు.

(8) "రామనృపచంద్రముఁడై"— కృతిసమర్పణము.

చంద్రమశ్శబ్దము తత్సమ మైనప్పుడు 'చంద్రమసుఁడు' అని కాని 'చంద్రమ' అని కాని లక్షణము ప్రకారము కావచ్చును. కాని, 'చంద్ర

ముఁడు' అని కావడానికి శాస్త్రము గాని, ప్రయోగము కాని లేదు. వ్యవహారములో తత్సమముగా దానికి రూపము లేదు.

(9) "కావ్యంపు గుణగణంబు తప్పె"—అవతారిక.

షష్ఠీసమాసములో ముపర్ణానికి పుంపులు రావచ్చునా? వస్తే, వైకల్పికముగా వస్తవా, నిత్యముగా వస్తవా? ప్రయోగాలు? 'గుణగణంపుఁ దప్పె' అని ఎందుకు వ్రాయలేదు?

(10) 'మాబోఁటులు'—అవతారిక.

'మముఁబోనివారు, మముఁబోంట్లు' అని గ్రాంథిక కారకము. షష్ఠీ కారకమునకు ప్రయోగ మున్నదా?

(11) 'పాదపమల్ తగు నర్ఘ్య మీవుతన్... శైత్యవనానిల మల్ల వీవుతన్"—పు. ౬౪.

'చు, చ్చు' అంతమం దుండే ధాతువు లన్నిటి మీదను ఇట్టి ఆశీరర్థరూపాలు వస్తవా? వస్తే, 'తేవుతన్, క్రోవుతన్, చావుతన్, మోవుతన్' మొదలయిన రూపాలు కూడా సాధువులు కావలెను గదా. ప్రమాణము?

(12) "ఈశైలము మాల్యవంత మను క్ష్మాధర రాజము చుమ్మి"—పు. 17.

"అవి యెల్ల మాటలు కావు చుమ్మి"—పు. 69.

"సంప్రార్థనార్థకా దిత్" అని చదువుకొన్నాము కాని 'ఇత్' అని లేదు.

'ఇతు'కు ప్రమాణ మేమో?

(13) "పగమపవిత్రుఁగాఁ దనను భావన సేయును"—పు. 88.

'తన్ను'కు రూపాంతరముగా పంతులుగారు ప్రయోగిస్తే, వారిమీద ప్రమాణబుద్ధి గలవారు 'నన్ను, నిన్ను'లకు 'నసను, నినను' అని ప్రయోగించవచ్చును గదా.

(14) "చిఱునలుక"—పు. 106.

'చిఱు, కుఱు, కడు, నడు, నిడు శబ్దంబుల' మొ. చిన్నయసూరి.

'చిట్టలుక' అని కావలసి ఉండె. 'చిఱు' మీద ద్విరుక్తటకారము రాకుండా ప్రయోగాలున్న వేమో!

(15) "ఈబలము నాను, కట్టలుక కొక్కకబళ మౌఁగాత మిపుడు"—పు. 110.

'కావుతన్' మీద అచ్చు వస్తే మాదేశము రావడము సుప్రసిద్ధము.

'కాతన్' మీద కూడా వస్తుందా? ఉదాహరణము?

(16) "ఈవీరుని నన్ను వలెనే చూతురు గాక"—పు. 127.

"నన్నుంబోలె" అని గ్రంథాలు. 'వలె' ప్రయోగించి నప్పు డేమి కారక ముంటుందో?

(17) "క్రొత్తది పోలె"—పు. 85.

క్రొత్తదియు పోలె, క్రొత్తదియుం బోలె, అనే రూపాలను గ్రంథాలలో చూచినాము. కేవల ప్రథమారూపముమీద కూడా 'పోలె' ను ప్రయోగించవచ్చునా?

(18) "ననుఁ జాలని వాఁడు"—పు. 115.

'నాకుఁ జాలని వాఁడు' అని మేము చూచిన కారకము. ద్వితీయా కారకము కూడా ఉంటుందా?

(19) "గ్రామము నంత నొక్కచోఁ జేర్చి"—అవతారిక vi

'అంతఞ్' అంటే 'అప్పుడు, ఆతరువాత' అని అర్థము. ఆరూపమును 'అంతటిని, సమస్తమును' అనే అర్థములో వాడవచ్చునా?

(20) "మఱి మఱి చెప్పు మనిరి"—పు. 6.

'మరీమరీ' అనే వ్యావహారికరూపానికి ఇది గ్రాంథికీకరణము.

(21) "విద్య మతిమాలిన దానికి నంట దేమి"—పు. 31.

'ఏమిన్ని' అనే వ్యావహారికరూపానికి వచ్చిన పాటిది.

(22) "వత్స కాంతానువృత్తిచాతుర్యము కూడ నేర్చెను"—పు. 59.

"తలఁచినప్పుడ వత్సలఁ గలయ వలయు (161). 'వత్స' సంస్కృతములో పుంలింగశబ్దము, అకారాంతము. ఇక్కడ మహద్వాచకముగా వాడినారు. శాస్త్రము ప్రకారము తెనుగులో దీనికి ప్రథమైకవచనరూపము 'వత్సుఁడు' కావలెను. 'వత్స' అనడానికి శాస్త్ర మొప్పుకోదు. వ్యవహార రూప మంటే ఆక్షేపణే లేదు.

(23) (పాములు) "బుస్సలు కొట్టుచు"—పు.39. 'బుస' కు 'బుస్స' అని రూపాంతర మున్నదా?

(24) "పరదేశిని గాన నడుగుచున్నాను" (2) "కాన నా రెండు శాంతించుఁగాక యిపుడు 101,— 'కాన' కళయే అని ప్రభాకరశాస్త్రిగారి బసవపురాణపీఠిక. దీనినిగురించి పంతులుగారు నిర్ధారణ చేసినారా? ఎట్లు? (సశేషము)

సుస్వాగతం

కొడవటిగంటి కుటుంబరావుగారు

ఇద్దరు కుర్రవాళ్లు విద్యార్థిదశలో ఎంతో అన్యోన్యంగా ఒకటే ప్రాణంగా ఉన్నప్పటికీ—ఉన్నంత మాత్రాన—తదనంతరం కూడా అవిధంగానే ఉంటారని భావించ నవసరం లేదు. వారట్లా ఉండాలని ప్రయత్నం చెయ్యటంకూడా ఒక్కొకసారి విరసానికి కారణ మవుతుంది. ఇక అందులో ఒకడి కోసరం మరొకడు పన్నెండు గంటలు ప్రయాణం చేసి, మూడు రైళ్లు మారి, చివర నాలుగైదు మైళ్లూ పదిసంవత్సరాలనించీ మరమ్మత్తన్న మాట ఎరగని రోడ్డుమీద ఊగిసలాడే గుర్రబ్బండిలో ప్రయాణం చేసి సూర్యాస్తమయం అయేసరికి ఒక అయోమయపు పల్లెటూరు చేరట మనే దుందే, నిద్రనష్టం, శరీరకష్టం మొద లయిన వటుంచి, తిండికైతే నేం కూలీలకైతే నేం తంతరాలకైతే నేం, ఏడురూపాయల ఎనిమిదణాల తొమ్మిది పైసలు దండగ సరిగా జోగారావువంటి మనిషి చెయ్యవలసిన పనే! ఒకరకం మనిషి ఏపని తలపెట్టినా చుక్క ఎదు రవుతుంది. జోగా వారకం మనిషి.

రాజమండ్రీ వచ్చేవరకూ అతనికి ప్రయాణం వల్లేరుమీద బండినడక లాగే ఉంది. తరవాత కొంతకాలం వరకూ రైలెటు పోతున్నది, ఇది ఏదేశం, మనుష్యు లెట్లా ఉంటారు, ఊళ్లెట్లా ఉంటై అనే ఆలోచనలు వచ్చినై, కాని ఏలూరు రాకమునుపే వాటిని గురించి ఆలోచనలు మానేశాడు. తెనాలిలో రైలు మారిన తరవాత అంతా ఒకటిగానే ఉంది. బొందెతో పరలోకానికి వెళ్లితే ఇట్లాగే ఉంటుంది కదా అనుకున్నాడు.

అనుకోకుండా, అసందర్భంగా ఒక్క ఇల్లన్నా లేని చోట అతని ప్రయాణ మంత మయింది. బండివాడు దిగ మన్నాడు. జోగారావు కిది చాలా అన్యాయంగా కనపడ్డది. ఇతరబళ్లు కూడా అక్కడే ఆగి ఉండటం చూసి కొల్లూరు మునిసిపాలిటీవాళ్లు బళ్లను ఊరికి మైలులోపలికి రానివ్వటం లేదేమో ననుకున్నాడు. అతను బండీవాడికి పక్కనున్న బయలు చూపించి "ఇదేనా కొల్లూరు?" అన్నాడు. అవు నన్నాడు బండివాడు. అయితే బండి దిగ నన్నాడు జోగారావు. దానిమీదట బండీవాడు కొంతసేపు మొహాన ఆశ్చర్యరసం ఒప్పించి, తురకం తెలుగు కలగలుపుతో స్వాగతం ఒకటి వినపడీ వినపడకుండా చెప్పి, చివరకు "మీ రెవ రింటికి పోతారండీ?" అని అడిగాడు.

"డాక్టరు సుబ్రహ్మణ్యంగా రింటికి" అన్నాడు జోగారావు.

"ఏది? కొత్త డాక్టరుగారింటికా?"

"నిస్సందేహంగా"

"గోపాలంగారబ్బాయిగారు?"

"అలాగే విన్నాను నేను కూడా!" జోగారావు నిట్టూర్పు విడిచాడు.

"అంటే పొట్టి సుబ్బరమణ్ణంగారు కాదంటండీ!"

"నే కాదన్నానా?"

బండీవాడు తృప్తిపడి "పదం డయితే!" అన్నాడు. లక్షణం చూస్తే వాడికి తప్పింటికి పోవటం నామోషీగా కనపడ్డది.

కొల్లూరు మునిసిపాలిటీని తొందరపడి నిందించినందుకు జోగారావు నొచ్చుకున్నాడు. బండి యాభై గజాల దూరం పోయి ఆగింది. కాని తప్పు అంతా జోగారావుది కాదు. కొల్లూరు నడివీధి పొలిమేరలా గుండటం కొంతవరకు కొల్లూరు తప్పనే చెప్పాలిసుంటుంది. ఒక్క నిట్టూర్పు విడిచి జోగారావు తోలుపెట్టె తీసుకుని బండి దిగాడు. అతని కష్టాలు గట్టెక్కినై. భయాలు పరారయినై.

(నిజంగా కొల్లూ రుందా? ఉంటే తను పోతున్నది సరిఅయిన మార్గమేనా? రైలు వాళ్లు పొరపాటు పడలేదు కద? ఇదింకో కొల్లూరు కాదు కద? బండీవాడికి దారి సరిగా తెలుసునా? అప్పుడే సాయంత్రం ఆరుగంట లయిందే? రాబోతున్న చీకట్లో తన గతే మవుతుంది—ఇది కొల్లూరు కాకపోతే? మొదలయిన భయా లన్నీ అంతరించినై. ఇది కొల్లూరు కావటమే కాకుండా ఈ కనపడుతున్న అరుగుల ఇల్లు సుబ్రహ్మణ్యంగారిదే. ఇక దాని యిష్టం వచ్చినప్పుడు రా వచ్చునని జోగారావు చీకటి కనుజ్ఞ యిచ్చాడు.)

భయం పోగానే దాని స్థానంలో ఆశ్చర్యం వచ్చింది. సుబ్రహ్మణ్యం ఈసంవత్సరంలో ఏమైనా మారాడా? తన్ను చూడగానే ఏమంటాడో? తన్ను మళ్లీ త్వరగా పోనిస్తాడా? జోగారావు మొహాన ఒక విధమైన చిరునవ్వు మొలకెత్తింది.

అతను కావాలని రెండు నిమిషాలాలస్యం చేశాడు తలుపు తట్టడానికి. లోపల సుబ్రహ్మణ్ణం ఏం చేస్తుంటాడు? తనీరోజు వస్తాడని అతనికి తెలుసు. బండీ చప్పుడు విని గ్రహించే ఉండాలి. దొంగ! బయటికి రాడు!

చివరకు జోగారావు అరుగుల మధ్య ఉన్న రెండు మెట్లు ఎక్కి మెల్లిగా తలుపు తట్టాడు. జవాబు లేదు. మళ్లీ తట్టి చెవులు రిక్కించి విన్నాడు. చడీ చప్పుడూ లేదు. కొంచెం గట్టిగా తట్టి "సుబ్రహ్మణ్యం!" అని పిలిచాడు. లోపల ఎక్కడో కొద్ది అలికిడి. తరవాత కొద్ది సేపటికి "ఎవరు, నాయనా?"—స్త్రీ కంఠం. అతని తల్లేమో?

"సుబ్రహ్మణ్యం ఉన్నాడాండి?"

"లేదు నాయనా!" ఈ సారి మాట తలుపు వెనక నించే వచ్చింది. వెంటనే తలుపు తెరుచుకుంది. యాభై ఏళ్లు దాటిన వితంతువు మొహం బయటికి పెట్టి అతన్ని చూసి సంబోధన మార్చి, "పొద్దునే తెల్లటూరు వెళ్లాడండీ! ఈపూటే వస్తాడో, రేపే వస్తాడో?" అనుకుంటూ తలుపు మూసి వెళ్లి పోయింది.

జోగారావు మొహాన చిరునవ్వు నిశ్శేషంగా మాయమైంది. దీని అర్థమేమిటి? తను రాసిన ఉత్తరం ఏమయింది? వాల్తేరు నించి ఇచ్చిన తంతి ఏమైంది? ఈ చీకటి అప్పుడే వచ్చి పడ్డదేం?

౨

కొల్లూరు గ్రామస్థులు ఈకష్టసమయంలో జోగారావు నాముకో లేదా అని అనుమానం రావచ్చు. ఆదుకోన్నారు. అవితంతువు తలుపు మూసి పోయిన అయిదు నిమిషాలకు ఒక ముసలాయన నిర్మానుష్యమైన వీధివెంట పోతూ అతన్ని చూసి ఆగి "ఎవరది?" అన్నాడు. ఆమనిషి కనపడేవరకూ కొల్లూరువాళ్లు దీపాలు పెట్టిన తరవాత బయటికి రారేమో నని సందేహిస్తున్న జోగారావు

ఆఊళ్లో కనీసం ఒక్కడైనా ధైర్యస్థుడున్నందుకు సంతోషించి, ఆయన తన కేదైనా సహాయం చేస్తాడని ఒక వాక్యంలో తన గత్యం చెప్పి రెండో వాక్యంలో క్లుప్తంగా తన ప్రయాణాన్ని గురించి ప్రారంభించాడు. కాని ఎందువల్లో అతను మాట్లాడటం పూర్తి కాకపూర్వమే ముసలాయన సాగిపోయినాడు. ఇంకో పదునాయనా ఈవిధంగానే చేశాడు. జోగారావు ఇటువంటి అవమానాలు రెండు సార్లకు మించి భరించే స్వభావం కలవాడు కాడు. అందుచేత తరవాత తన్నాదుకో వచ్చిన వాళ్లతో నోటికొచ్చిన అబద్ధాలన్నీ ఆడి సాగనంపాడు.

ఒక చెంపనించి నిస్పృహ అతని మనస్సు నావరిస్తున్నది. ఆశలో నిరాశ—కాదు, నిరాశలో ఆశను గురించి ఒక మహాకవి పాడనే పాడాడు. జోగారావు కూడా ఈ కారుమబ్బులోనించి వస్తున్న మెరుపును చూశాడు. తీరా ఇంకో గంటలో సుబ్రహ్మణ్యం రానే రావచ్చును. లేదా గుర్రబ్బండీ ఎక్కి పోతే స్టేషనూ దానిలో బెంచీ ఉండనే ఉంది రాత్రి గడపటానికి.

వీధివెంట ఒక బండి మెల్లిగా రావటం మొదలుపెట్టింది. జోగారావాబండి కడ్డం తగిలి ఒక అరగంట ఉండి రైలుకు బండి కడతావా అని అడిగాడు. బండీవాడు రానన్నాడు. ఆరోజుల్లో కొల్లూరు రోడ్డుమీద వేమూరు కొల్లూరు నవీన దొంగల సమాజంవాళ్లు జోరుగా పనిచేస్తున్నారు. జోగారావు నిస్పృహ పరిపూర్ణమైంది. కవిగాడు పప్పులో కాలేశాడనుకున్నాడు జోగారావు. కాని రవి గాననిచో కవి గాంచు నన్న వాళ్లు పొరపాటు పడలేదు. ఆ కటిక చీకట్లో ఆచుక్కల నల్లని కాంతిలో వీధి చివర ఒక తెల్లని ఆకారం కనిపించింది. ఆ ఆకారం మెల్లిగా సమీపించి తనకు మూడు గజాల్లో ఆగే వరకూ ఆమనిషి స్త్రీ అని జోగారావు గ్రహించలేదు. కేవలం స్త్రీ కూడా కాదు, పదమూడు పద్నాలు గేళ్ల పిల్ల!

ఆమె అతని వంక ఒక్క క్షణం చూసి మెల్లిగా గడపమెట్లెక్కి తలుపు తెరిచి లోపలికి వెళ్లింది.

లోపల మాటలు వినపడ్డై.

"ఏమిటే అమ్మాయి! అట్లా మీద కొస్తావు? సూతకం మయిలదానివి! మడికట్టుకుని ఏడిస్తిని కదా! మీబస్తీ వేషాలూ మీరూను!"

తరవాత చిన్న గొంతు.

"అది కాదమ్మా! బయట కూర్చున్న దెవరే?"

"ఏమోనే? నే చూడ లేదు. ముందవతలికి పోదూ, తల్లీ!"

"అందుకే కాదే ఇవాళ అన్నయ్యకు టెలిగ్రాం రాలా? ఆయ నేమో?"

"......"

"కనుక్కోనా?"

"నీ కెందుకు పోనీవే!"

కొంచెం సేపు నిశ్శబ్దం.

"కనుక్కుంటానే!"

"అట్లాగే? పోవే!"

"అయ్యో తల్లీ!"

లాంతర తీసుకుని ఆపిల్ల బయటివచ్చింది. జోగారావు గుండె దడదడ లాడటం మొదలుపెట్టింది.

"మీ దేవూ రండీ?"

జోగారావు చెప్పాడు.

"మీరేనా టెలిగ్రాం ఇచ్చింది?"

"అవును"

"లోపలికి రండి. మీ టెలిగ్రాం వచ్చినప్పుడు మాఅన్నయ్య ఊళ్లో లేడు. ఎవరిచేతనో చదివిస్తే సరిగా చదవ లేదు. పాపం, మీరు వచ్చే సమయానికి ఊళ్లో లేకుండా వెళ్లాడు.

జోగారావు అరుగుమీదినించి పాతుకుపోయినట్టు మెల్లిగా లేచి చేతి పెట్టె తీసుకుని లోపలికి వెళ్లాడు. ఆపిల్ల దేవతలాగ రాకపోతే తన గతి ఏమై ఉండును? అతని కింకా ముళ్లమీద ఉన్నట్టే ఉంది. సుబ్రహ్మణ్యం వస్తే కాని ఆస్థితి అంతరించదు.

ఆపిల్ల లోపలికి వెళ్లి తల్లితో చెప్పింది. ఆవిడ ఒక చెంబుతో నీళ్లిచ్చి "కాళ్లు కడుక్కొని చాప వేసుకు కూర్చోండి, నాయనా!" అంది, మళ్లీ సంబోధన మార్చి.

అతను చాప వేసుకుని కూర్చున్నాడు. ఆపిల్ల వెళ్లి వంటఇంట్లోనే ఒదిగింది. తల్లీ కూతుళ్లు ఏదో చిన్న గొంతుతో మాట్లాడటం మొదలుపెట్టారు. అతనికి ప్రతిమాటా వినపడుతున్నది. కొంత సేపయిన తరవాత అతనికి చిత్ర మయిన ఆలోచన వచ్చింది. అత నాపిల్లను చూసి కొద్ది నిమిషాలయిందో లేదో అప్పుడే ఆమెను గురించి ఎంత తెలుసును!

ఆమె పేరు జానకి. సుబ్రహ్మణ్యం చెల్లెలు. వితంతువు. మొగుడు పోయి అప్పుడే నాలుగేళ్లయింది. పెళ్లయి యెంతకాల మయిందో? తెలివి కలది. నేర్పరి. కొంత కాలం బస్తీలో పెరిగింది. "జానకి వదనంబు చంద్రబింబంబు" అనుకున్నాడు జోగారావు. అతని కకస్మాత్తుగా కవిత్వం అబ్బింది.

3

"మడి గట్టుకో, నాయనా, వంటయింది" అన్నది ముసలావిడ.

తలుపు తెరుచుకుని సుబ్రహ్మణ్యం ప్రవేశించాడు. జోగారావు కొంచెతనానికి ఉలక్కుండా పలక్కుండా కూర్చున్నాడు.

సుబ్రహ్మణ్యం స్నేహితుణ్ణి చూసి ఎక్కువ సంతోషం కనపరచ లేదు.

"ఎప్పు డొచ్చావు?" అప్రశ్నలో ఎందు కొచ్చావన్న ధ్వని వినపడ్డది జోగారావుకు.

"ఒక గంటయింది" అన్నాడు జోగారావు. అతను స్నేహితుడి ప్రశ్నలో ఉన్న ధ్వనికి కూడా సమాధానం ఇచ్చాడు-అబద్ధం మాత్రం ఆడాడు. "బెజవాడలో మాబంధువు లున్నారు. అంత దాకా వచ్చి నప్పుడు నిన్ను కూడా చూడా లనిపించింది." (జోగారావు బెజవాడలో దిగ లేదు.)

సుబ్రహ్మణ్యం మొహం కొంచెం తెరిపిచ్చింది.

"రెండు రోజు లుంటావా?" (ఎప్పుడు పోతావని ధ్వని)

"ఉండను. రేపు సాయంకాల మయినా పోక తప్పదు."

సుబ్రహ్మణ్యం మొహం మరింత తెరిపిచ్చింది.

"అబ్బాయి! వంటయింది. లేవండి" అన్నది తల్లి లోపలినించి.

భోజనం చేస్తూ జోగారావు "నా ఉత్తరం అందిందా?" అన్నాడు.

"ఏం ఉత్తరం? అంద లేదోయి!"

"దాన్లోనే నిలా రాబోతా నని రాశాను. అందకేమో! ఈ ఊరికి ఉత్తరం చేరకపోయినా నాకాశ్చర్యంగా ఉండదు సుమీ. టైముకు మాత్రం ఊళ్లో లేకుండా పోయావు." సావిట్లో నించి సంభాషణ అంతా వింటున్న జానకి జోగారావును చూసి జాలిపడ్డది. జోగారావు రాసిన ఉత్తరం రావటం సుబ్రహ్మణ్యం విసుక్కోవటం జానకి అప్పుడే మరవ లేదు.

భోజనా లయిన తరవాత స్నేహితు లిద్దరూ చల్లగాలికి వాకిట్లో అరుగుమీద కూర్చున్నారు. కొంత సేపు ఎవరిలోకంలో వా రున్నారు. జోగారావు లోపల తల్లీ కూతుళ్లకు జరుగుతున్న సంభాషణ వింటున్నాడు.

"అన్నానికి రావే అమ్మాయి" అంటున్నది తల్లి.

"నీ ప్రాక్టీసెట్లా ఉంది?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అలా అలా ఉంది!..."

"నాకు ఆక లవుతున్న దే!" అంటున్నది జానకి.

"నేను రమ్మంటూనే ఉంటిని గాదుటే?"

"నీకేం లే! మీనాన్నగారి ప్రాక్టీసంతా నీదేగా? నాబోటి వాడికి..." సుబ్రహ్మణ్యం.

ఇంతలో జానకి మాట చెవిన పడేటప్పటికి సుబ్రహ్మణం అంటున్నది వినటం మానేశాడు జోగారావు.

"ఎక్కడో మైలుదూరం వెళ్లి విస్తరి పారెయ్యాలమ్మా. అక్కడ పాములు—"

"మీ నాన్నగారి ప్రాక్టీ సెట్లా ఉంది?"

"బాగానే ఉంది."

"అంత ఒళ్ళు బరువేమే!"— తల్లి.

"పాములే! పోనీ ఈ మూల పెట్టి రేపొద్దున—" జానకి.

"ఈ పల్లెటూళ్లో ఏం డబ్బొస్తుంది? బస్తీ చేరతాను." జోగారావు విసుక్కునే మనిషి కాదు. కాని సుబ్రహ్మణ్యం కాస్సేపు కట్టిపెడితే బాగుండునని పించింది దతనికి.

"చాల్చాల్లే. నేర్చుకు పోతున్నావు. నేనిప్పాట ఇల్లు కడుక్కోవద్దా ఏమిటి?"—తల్లి.

"పోనీ నాకంత ఆకలిగా లేదు."—జానకి.

"అసలదీ ఉన్న సంగతి. అన్నైద్దూ డేమ్మంది సున్నాడో చరచరా ఆకలే లేదు. తింటావా? నన్ను కూర్చోమన్నావా?"

"నువ్వు కూర్చో!"

"బక్కపేగు మాడనీ!"

జోగారావు పరధ్యానంగా ఉండటం గమనించాడు సుబ్రహ్మణ్యం.

"చంద్రోదయం అయింది కాలవల వైపు పోదాం రావోయి. చాలా బాగుంటుంది." అన్నాడు సుబ్రహ్మణ్యం. జోగారావు మాట్లాడకుండా లేచాడు.

జోగారావుకు కొల్లూర్కు రావటం నిరుత్సాహకర మైంది. అయినా దీనిలో కూడా ఒకటి రెండు విశేషాలు లేకపోలేదు. మొదటిది జానకి. రెండోది కాలవలు. అంతకు పూర్వం జోగారావు కాలవలు చూడ లేదు. కొన్ని వందల సార్లు సముద్రం మీద చంద్రోదయం చూసిన వాడికి కాలవలు ఆశ్చర్యం కలిగించటం చిత్రమే. కాని అసంభవం కాదు. మొదటినించీ చదువుకున్న పట్టణవాసపు ఆడపిల్లల మధ్య తిరిగిన వాడికి పల్లెటూరి వితంతువును చూడగానే గుండె ఎగిరి పడటం కూడా అటువంటిదే!

ఇద్దరూ ఇల్లు చేరేటప్పటికి పదకొండు గంటల యింది. జానకి ఒక మూల చాపమీద పడుకుని నిద్రపోతున్నది. అన్నం లేకుండా? పల్లెటూరివాళ్ళెంత క్రూరంగా ఉంటారు పిల్లల విషయంలో కూడా! జానకి చాపకు ఇవతలగా మంచం వేసుకున్నాడు సుబ్రహ్మణ్యం. అతని పక్కన జోగారావు మరో మంచంమీద పడుకున్నాడు.

జోగారావు చాలా సేపు మంచి నిద్ర పోయినాడు కాని తెల్లవారుఝామున అతనికి కలవచ్చింది. ఆకల్లో జానకీ తనూ కలిసి చదువుకున్నారు. తనేమో అచ్చంగా జానకి మొగుడల్లే ఉన్న ఒక పెద్దమనిషికి రెండో పెళ్లి చెయ్యాలని ప్రయత్నం చెస్తుండగా ముసలావిడ వచ్చి "అమ్మాయి! అమ్మాయి! నేను కాలవకు పోతున్నా తలుపేసుకోవే" అంటోంది. జోగారావుకు మెలుకువ వచ్చింది. అతని కళ్లు తెరిచేటప్పటికి అంతా ప్రశాంతంగా ఉంది. ముసలావిడ జానకి తన కేక విన్నదీ లేందీ కూడా గమనించకుండా కాలవకు బయలుదేరి పోయింది. సుబ్రహ్మణ్యం జానకీ నిద్రపోతున్నారు. జోగారావు జానకి వంక నిర్ఘాంతపోయి చూశాడు. అదేం నిద్ర! జోగారావు కళ్లకు జానకి నిద్రపోతున్న మనిషల్లే లేదు. చాలా సేపు బాధపడి చివరకెట్లాగో బాధ నివారణ అయినట్టుంది. ఆఖరు నిద్రేమో? రాత్రి జానకి అన్నం తిన లేదు. శోష వచ్చిందేమో? ఆమె వంక అతను ఆయిదు నిమిషాలు నిదానించి చూశాడు. ఏమీ చలనం లేదు. ఊపిరి పీలుస్తున్న లక్షణాలైనా లేవు. జోగారావు కంగారు పడటం మొదలుపెట్టాడు. నాలుగు చుక్కలు గొంతులో నీళ్ళయినా పోస్తే—తనిప్పుడేం చెయ్యాలి? దీపం పెద్దది చేసి జానకిని బాగా చూడవచ్చును కాని వెలుగుకు సుబ్రహ్మణ్యం లేచి ప్రశ్నలు వేస్తే సమాధానం చెప్పటం కష్టం. ఇంతకూ ఆ పిల్ల జీవించి ఉన్నదీ లేందీ చూడటం ఎట్లా?

జోగారావు మెల్లిగా పక్క దిగి జానకి వైపు-రెండడుగులు వేసి దబదబా తిరిగి వచ్చి పక్క

మీద గాఢనిద్రలో ఉన్నట్టు పడుకున్నాడు. అంత భయం వేసింది. ముచ్చెమటలు పోసినై. సూర్యుణ్ణి సమీపించబోయిన సంపాతి కథయింది. ఎందు కంత భయం? మూడు నిమిషా లుండి జోగారావు మళ్ళీ లేచాడు. ఎంతో కష్టంమీద జానకిని సమీపించాడు. అతని గుండెలు కొట్టుకోటం పద్ధతి చూస్తే వాటి బతుకు నిమిషాలమీద ఉన్నట్టు కనపడ్డది. అయినా సరే! మెల్లిగా వంగి జానకి ముక్కు దగ్గిర వేలు పెట్టాడు. అమ్మయ్య! ఊపిరాడుతూనే ఉంది. ఫరవా లేదు.

"జోగారావు!"

జోగారా వదిలిపడి లేచి నిలుచుని వెనక్కు తిరిగి చూశాడు. సుబ్రహ్మణ్యం పక్కమీద శిలావిగ్రహ మల్లే లేచి కూర్చుని ఉన్నాడు.

"ఏమిటో యది!"

జోగారావు మాట్లాడ లేదు. ఏముంది మాట్లాడటానికి? నీ చెల్లెలు జీవించి ఉందో లేదో చూస్తున్నా ననటం కన్న అనేకరెట్లు అనకపోవటమే మంచిది.

జోగారావు మౌనం సుబ్రహ్మణ్యానికి గట్టిగా మాట్లాడటానికి అవకాశ మిచ్చింది. సుబ్రహ్మణ్యం మాట్లాడాడు కూడాను. ఉపన్యాసం, చదువుకున్న అజ్ఞానులతో ప్రారంభమై, ఇంట తిని ఇంటి వాసాలు లెక్కపెట్టటం దగ్గిర తారట్లాడి, బహిరంగ మైన నీతిలో కొట్టుకుని కాస్సేపు ఈదులాడి, జోగారావు ఇష్టం వచ్చినప్పుడు వచ్చిన దారి పట్టగలందులకు పాస్‌పోర్టుతో అంత మయింది.

ఈఅల్లరిలో జానకి లేచి కూర్చున్నది.

సుబ్రహ్మణ్యం వికారంగా నవ్వుతూ, "ఏమే, అమ్మాయి నిన్నా దొరగారు తాకాడా? ఎందుకంటే, గాని మంచివాడ్ని అట్లా ఉంచి వారు మైలపడ్డందుకు స్నానం చెయ్యవలసి ఉంటుంది!" అన్నాడు.

జానకి చప్పున కథపట్టు అందుకోలేకపోయింది. మెకోసం తన్ను పొద్దుగరుట నించీ దొంగనిద్ర పోతూ గమనించిం దంతా సుబ్రహ్మణ్యం చెప్పకొచ్చాడు. జానకి నిరాంతపోయి నిజ మేన అన్నట్టు జోగారావు వంక చూసింది.

సుబ్రహ్మణ్యం కోసం జోగారావు ఖోరీ చేసుకోదలచక పోయినా జానకికోసం నిజం చెప్పేశాడు ఆమె నవ్వినా సరే నని.

"నమ్మతావా?" అన్నాడు జోగారావు చిఃరకు సుబ్రహ్మణ్యంతో.

సుబ్రహ్మణ్యం ఒక్క క్షణకాలం కలవరపడి "అయితే నువ్వు రాత్రి భోంచెయ్య లేదా?" అన్నాడు చెల్లెలితో.

"చేశాను—"

చెల్లెలి కష్టం వచ్చి సుబ్రహ్మణ్యం మాట్లాడబోయినాడు కాని జానకి అతని కా అవకాశం ఇవ్వకుండానే జోగారావు వైపు తిరిగి, "మీమాట నేను నమ్మాను. మీరు నాకు చూపించిన దయ—జాలి- మరవను. కాని మీకిది ఉండదగిన చోటు కాదు. మాఅన్నయ్యకు మీరు రాసిన ఉత్తరం అందింది. అదీకాక నిన్న మాఅన్నయ్య ఊరికి పోవటాని క్కూడా కారణం ఏమిలేదు, మీరు వస్తారేమో నని భయం తప్పితే. ఆయన అవస్థ చూసి నేను మీరిట్లా ఉంటా రని—ఇంకో విధ మైన మనిషేమో నని కూడా అనుకున్నాను. వెంటనే వెళ్లిపోండి!" అన్నది.

*   *   *   *

రైలులో జోగారావు మనస్సుతో పెద్ద ఘర్షణ పెట్టుకున్నాడు.

"నా కా జానకి కావాలి" అన్నాడు జోగారావు.

తీర్పు మనస్సు చేతులోనే ఉంది.

"ఓరి జోగులూ! మెరుపు మెరిసి పోవలిసిందే ఆకాశాన అట్టే ఉండ మంటే ఎలా ఉంటుంది?" అన్నది మనస్సు నిర్దయగా.

వేదికలు—పత్రికలు

కవులు

అక్టోబరు చివరి వారమున విశాఖపట్టణమున కవితా సమితివారు జరిపిన ఆంధ్రకవుల ఛాయాచిత్రప్రదర్శనము తెరుచుచు మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తమ యుపన్యాసమున కవుల నిట్లు కీర్తించినారు.

"జాతీయజీవితమున సమగ్రముగ ఆవరించెవారు కవులు. కవిసృష్టి పరిపూర్ణమైనది. మీకును నాకును తెలియని రహస్యము లెన్నో కవికి తెలుసును. తూలిక చూపలేని భావభంగిమలు విన్యాసములు, కంఠము కనుబరుపలేని సున్నితములైన నాదపు ఒరపులు, ఒద్దికలు కవి సృష్టియందు సహజములయిన రంగులతో పడగెత్తి నాట్య మాడగలవు. అందువల్లనే పరమేశ్వరుని సృష్టికి పరమావధి కవి. సాహిత్యమే ప్రథమగణ్య మయిన కళ. తలచెనా కవి నీటిలో నిప్పు నూడగలడు. అగ్నిలో చందన శైత్యమును గిలకొట్టగలడు. దుఃఖవారాశిని స్వర్గధామము కాలయింపగలడు. గగనకుసుమమును మణగగొట్టి దానికి తావి కల్పింపగలడు. ఈయకటావికటపు భీభత్ససృష్టిని మధురాతిమధురమైన యొక పాటగా దిద్ది మురళి మ్రోయించగలడు. అణువు అణువు అతిశ్రావ్యమైన పాటలో తీయని తేటగా హత్తుకొనిపోవును. అంతటి చతురుడు, అంతటి యుద్దండుడు కవి. శాపానుగ్రహశక్తియుక్తుడు. నిరంకుశుడు. రాజ్యభ్రష్టుని రాజ్యమెక్కించగల నేర్పుకూడ అతని కున్నది. తెనుగువా రెరుగని చరితములా యివి?"

ఆముక్తమాల్యద కర్త...?

నవంబరు 10వ తేదీని విశాఖపట్టణమున ఆంధ్రవిశ్వకళాపరిషత్తుయొక్క తెనుగుసంఘము పక్షమున ఆంధ్రవిశారద శ్రీ తాపీ ధర్మారావునాయడుగారు ఆముక్తమాల్యదాకర్తృత్వమును నిర్ణయించుచు నిట్లు వ్రాసిచ్చినారు.

"......ప్రతి కవికిని ఒక ప్రత్యేకత యుండును. అది వానికి తక్క ఇంకొకనికి చొప్పడదు. మనుచరిత్రమున శైలి ధారాళముగను, మృదువుగను సరళముగను పర్విడుచున్న ఆముక్తమాల్యదయందు కఠినముగ, ప్రవాహము లేక కుంటువడుచు నుండును. కృష్ణదేవరాయలు సమూహము అను అర్థము కూర్చునపుడెల్ల 'కదంబము' అనియే వాడుచుండును. ఇది వీని అభిమానపదము. ఇట్టి భేదములు పదముల యందును, వృత్తముల యెత్తుబడి యందునుగూడ గానవగును. రాయల కందపద్యము అన్ని విధములను ఎన్నికొనదగినది. సరళమైన నడక, చక్కని ఎత్తుబడి, తదనుగుణ్యమైన పదముల కూర్పు, విపులమైన వర్ణన గలిగి తరుచు సగణముతో ప్రారంభమగును. సీసముల తరువాత సాధారణముగా రాయలు ఆటవెలదినే వ్రాయుచుండును. కాని పెద్దన గీతమును వ్రాయును. మనుచరిత్రమున సీసము దళమునకు దళమునకు విరుగుచుండును. రాయల సీసములు ఒక దళమునుండి వేరొక దళమునకు పదములు వచ్చుచుండును. పెద్దన ఊహాప్రపంచమున నున్న వానినే వర్ణించిన, ప్రత్యక్షముగా చూచిన దానినే రాయలు వర్ణించును. భిన్న భిన్న అవసరలలో, భిన్నభిన్న ప్రదేశములందు భూమి, ఆకాశము, పరిసరవస్తుసముదాయము— వీటి రంగు ఎటుల మారుచుండునో రాయలు ప్రత్యేకశ్రద్ధతో కనుగొనును. ఆముక్తమాల్యదలో ఈ వివేచనమే కనపడును. రాయలు భోగశాలి కనుక వివిధ కాలములలో వివిధభక్ష్యములను చేర్కొనెను. ప్రయాణసన్నాహవేళ ఒక వస్తువునైనను మరువక వలయు భోజనసామగ్రిని వర్ణించి చెప్పెను.

సహజముగా రాయలు సంస్కృతకవి అయి యుండుటచే ఆంధ్రమున సులభముగను, సరళముగను, ధారాశుద్ధితో చెప్పలేకపోయెను. ఇట్టి కవిత్వమును పెద్దనవంటి కవిపుంగవుడు వ్రాయడు. వ్రాయ జాలడు. మనుచరిత్రము నందలి ధారాశుద్ధి గల కవిత్వమును చెప్ప నేర్చినవాడు పాండిత్య ప్రకర్షయే యెక్కువగా గన్పడు ఆముక్తమాల్యదను వ్రాయలేడు. ఇంతకన్న మిన్నయగు తార్కాణ మరియొకటి లేదు. రాయలకు సర్వతోముఖపాండిత్యమును ఉపజ్ఞయు గలవు. పండితుడైన జాత్యంధుడు మనుచరిత్రమును వ్రాయగలడు, గాని ప్రత్యక్షముగా చూచిన గాని వ్రాయజాలని వర్ణనలు ఆముక్తమాల్యదయందు గలవు. మనుచరిత్రములోని వర్ణనలు సమయసిద్ధములు. ఆముక్తమాల్యదలోనివి స్వభావసిద్ధములు. ఇన్ని మహత్తర భేదములు ఈ రెండు గ్రంథములకును, ఈ యిరువురు కవులకును గన్పడుచుండగా 'కవితాప్రావీణ్యఫణీశ' అని పేరు గాంచిన వాడును సర్వకాలమును కవితాగోష్ఠినే గోరుచు అష్టదిగ్గజము లనంబరగిన మహా కవులను దన యండ నుంచుకొనినవాడు నగు రాయలకొరకు పెద్దన ఆముక్తమాల్యదను వ్రాసె ననుటకన్న మహాపరాధ మేమి గలదు? వృత్తముల యెన్నిక, పదముల కూర్పు, సాధారణముగా సీసము తరువాత ఆటవెలదియే యుండుట, ప్రత్యక్షవర్ణన, విపులపరిశీలనము, కందపద్యముల నడక మొదలగున వన్నియు ఆముక్తమాల్యద కర్త అల్లసాని పెద్దన కాడనియు, కృష్ణరాయలే అనియు నిరాఘాటముగ చాటుచున్నవి”

కృత్యవిభాగము

నవంబరు మొదటివారమున ఏలూరిలో జరిగిన ఏడవ ఆంధ్రమహిళాసభకు సంబంధించిన ఆహ్వానసంఘమునకు ఉపాధ్యక్షురాలగు చుండూరి రత్నమ్మగారు తమ ప్రారంభోపన్యాసమున 'సంసారనిర్వహణ' మనుశీర్షికలో యిట్లు చెప్పినారు.

“విద్యావిషయములో అసలిప్పటి విద్యాపద్ధతులు పురుషులకును నైతికముగను, ఆర్థికముగను అనర్థదాయకముగ నుండి నిరుద్యోగసమస్యను అధికము చేయుచు సేవకతకు దారి చూపుచుండ స్త్రీలను గూడ ఆదారినే నడిపించుట ఒక గొప్ప లోపము. జీవితయాత్రలో పురుషుడు నిర్వహింప వలసిన పనులు కొన్ని, స్త్రీ బాధ్యతలు కొన్ని గలవు. స్త్రీ పురుషులు ఉభయులు గృహకృత్యముల లోనే యుండుటయు, లేక యివి వదలి వారు లౌక్యవ్యవహారములయందే నిమగ్నులగుటయు సంసారనిర్వహణముల కసంభవము. ఈసమస్యనే జర్మనిదేశపు (ఛాన్సలరు) హిట్లరు ఈమధ్య పరిష్కారము చేసెను. స్త్రీలను గృహనిర్మాణమునకు రాణులుగను, స్త్రీ జనాభ్యుదయమునకు బ్రహ్మాండమగు ఒక శక్తిగను, ఏర్పాటు చేసి పురుషులను లౌక్యవ్యవహారములయందును, రాజ్యాంగనిర్మాణమునందును కర్తలుగా శాసించెను. స్త్రీలను ఉద్యోగ పదవులలో నుండి తప్పించి పురుషుల నిరుద్యోగ సమస్యను పరిష్కరించి ఆర్యసాంప్రదాయముల ననుకరించెను. అంతమాత్రమున స్త్రీ యితరవ్యవహారములలో అడుగు బెట్టగూడదని కాదు. అవసరము వచ్చిన స్త్రీలు పూర్వభారతనారీమణులవలె సకలకార్యకలాపములలో ముందంజ వేసి తమ సహజశక్తిసామర్థ్యములను ప్రకటింపగలరు. అట్లుగాక సమానహక్కుల పేరిట గృహకృత్యములను, సంసారబాధ్యతను ఉపేక్షించి స్త్రీలు పూర్తిగా రాజ్యాంగవ్యవహారములలోను, ఆటపాటలలోను, స్వేచ్ఛావిహారములలోను, తిరుగ నేర్చిన గృహములలోను బయటను ఉభయులకు పోటీ వచ్చును. సంతానమును శరణాలయములకో, బోర్డింగులకో, హోటళ్లకో వప్పజెప్పుట, వంటయిండ్లు వంటలక్కలకు వప్పజెప్పుట, ఉదయం మిత్రగోష్ఠి, సాయంత్రం క్లబ్బులు, ఆటపాటలు, రాత్రిళ్లు సినిమాలు, నాటకాలు, సభలు మొదలగునవి యిప్పటి నాగరికపద్ధతులు. ఇవే మన ఆదర్శములుగా

చాలమంది భావించుచున్నారు. ఈ ఆదర్శములకు అలవాటు పడిన స్త్రీపురుషుల మధ్య అనురాగము దూర మగుచున్నది. పాశ్చాత్యదేశములలో స్త్రీ స్వాతంత్ర్యము పేరిట సంసారములు కూలిపోవు చున్నవి. ఈసాంప్రదాయములు మన విద్యావతు లగు కొందరు సోదరీమణుల హృదయములలో నాటుకొనుటవలన ఆదర్శగృహిణు లని అనిపించు కొనజాలకున్నారు. పాశ్చాత్యదేశములను పీడించు చున్న మహాసంకటము నేడు మన సంఘములో ప్రవేశించుచున్నది. స్త్రీల బాధ్యతే పురుషులకు, పురుషుల బాధ్యత స్త్రీలకు గల దని అందరును తెలిసికొనిన చాలును. ఒకరి కింకొకరు అపకారము చేసిన దేశము కూలిపోవును. కుటుంబములు నశించును. దేశసౌభాగ్య మడుగంటును; గావున మన సంఘమునకు సంబంధించిన వ్యవహారములలోనే మనము నిమగ్నుల మయి మానవకల్యాణమునకును, స్త్రీజనోద్ధరణమునకును మనము కంకణము కట్టుకొని, తక్కిన లౌక్యవ్యవహారములను పురుషులకు వదలి సంఘములో పోటీ వ్యవహారములను అంతరింపజేయుట మన కర్తవ్య మని నా మతవి.”

మారకపు రేటు

వేమవరపు రామదాసుపంతులుగారు 17—11—98 తేదీ ఆంధ్రపత్రికలో రిజర్వుబాంకీని గురించి చక్కని వివరణము లిచ్చుచు మారకపురేటును గురించి యిట్లు తెలుపుచున్నారు.

“...కొంతకాలమువరకు 1 రూపాయి పౌనులో 10 వ వంతుగా అనగా 2 షిల్లింగులకు సమానముగా నుండునట్లు నిర్ణయింపబడెను. ఈసంబంధమునే రేషియో అనియు, ఎక్ఛేంజి అనియు అందురు. ఈసంబంధము తరుచుగా మారుచుండుటవల్ల వర్తకమునకును, పరిశ్రమలకును చిక్కులు కలుగుటయేగాక ముడివస్తువులయొక్కయు, తయారు కాబడిన సామగ్రియొక్కయు ధరలు కూడ తరుచుగా మారు చుండును. ఒక ఉదాహరణము నిచ్చెదను. రూపాయి 2 షిల్లింగులకు సమాన మైనచో 10రూపాయలకు ఇంగ్లాండువారు మనకు 1 పౌను విలువగల సామగ్రిని అమ్మగలరు. ఒక రూపాయి 1½ షిల్లింగులకు అనగా 18 పెన్నులకు సమాన మైనచో 1 పౌను విలువగల సామానులు మనకు రు18—5—4లకు విక్రయింపగలరు. ఒక రూపాయి 1⅓ షిల్లింగులకు అనగా 16 పెన్నులకు సమాన మైనచో ఒక పౌను విలువగల సామానులు మనకు 15—0—0 లకు విక్రయింపగలరు. ఇట్లే మనము ఇంగ్లాండువారికి గాని ఇతరదేశములకు గాని 1 పౌను సామానులు విక్రయించినచో, రూపాయి 2 షిల్లింగులకు సమాన మైనచో 10 రూపాయలును, 1½ షిల్లింగులకు సమాన మైనచో 18—5—4 లును, 1⅓ షిల్లింగులకు సమాన మైనచో రు 15—0—0 లును మనకు లభించును. ఈయుదాహరణమువే రేషియో యెక్కువగా నున్నచో ఇంగ్లీషువారు వారి (తేమ) సరకులను తక్కువ ధరకు అమ్మి మన ముడిపదార్థములను తక్కువ ధరకు కొనగలుగుచున్నారని తెలియగలదు. ఇంగ్లాండువారి పదార్థములు మనకు తక్కువ ధరకు దొరకుట యిండియాప్రజలకే క్షేమ మని యింగ్లీషు వారి వాదము. అట్లువారి సరకులు తక్కువ ధరకు విక్రయించుటచే మన పరిశ్రమల యభివృద్ధికి ఆటంకము కలిగి సర్వకాలము మనము ఇంగ్లీషు మిల్లుల మీద నాధారపడియుండవలె ననియు అందువల్ల ఎక్కువ ఎక్ఛేంజికంటె తక్కువ ఎక్ఛేంజే మనకు లాభ మనియు తక్కువ ఎక్ఛేంజి యుండినచో మన రైతులకు వారి పంటలకు ఎక్కువ ధరలు లభించి లాభకరముగ నుండు ననియు మన వాదన. మరియు ఇండియాదేశములో ఉద్యోగీయులుగా నున్న బ్రిటిషువారికి ఎక్కువ ఎక్ఛేంజి లాభకరము. రూపాయి 2 షిల్లింగులుగా నున్నపుడు వారు 10 రూపాయలు ఇక్కడ బాంకులో కట్టితే వారికి యింగ్లాండులో 1 పౌను వారి బాంకిలెక్కలో జమ కగులును. రూపాయి 18 పెన్నులకు (1½ షిల్లింగుకు) సమానముగ నున్న రోజుల వారు రు 18—5—4

ఇక్కడ బాంకిలో కట్టితే గాని వారికి యింగ్లాండులో 1 పౌను లభించదు. మనము కోరిన ప్రకారము రూపాయి 16 పెన్సులకే (అనగా 1⅓ షిల్లింగులకు) సమాన మయినచో వారు 15 రూపాయలు ఇక్కడ బాంకిలో కట్టిననే గాని వారికి యింగ్లాండులో 1 పౌను వారి లెక్కకు జమ తగలదు.”

తెనుగున తెనుగుదనము

మార్గశిర మాసపు భారతి తన మనవిమాటలతో ఇట్లు మందలించుచున్నది.

“......నాడు నాటికి తెనుగుతల్లి పారతంత్ర్యము బలకొనినది. ఆమెకు స్వరూపమునను, స్వభావమునను మార్పు కలిగినది. గుణములు, రీతులు, వృత్తులు, నడతలు సకలలక్షణములును ‘అక్షరాలా’ సంస్కృతమువే అబ్బినవి. అలంకారములు గూడ సంస్కృతమువే గతి అయినవి. సంస్కృతము చేయి తప్పిన యెడల ఆమె యునికినే సంశయింపవలసినంతవరకును వచ్చినది. సంస్కృతము దాస్యమువలన తెనుగుతల్లి ఇట్లు వీధినాటకమునందలి పాత్రగా తయారయినది......ఇది యంతేయు కనియే ఆమె బ్రతుకు ‘అయోమయ’ మని కొండొక్కరు పరిహసించిరి. ‘తెనుగు కూడ ఒక్క భాష అని చదువవలసిన దేనా?’ అన్నవారును గలరు... ఆంధ్ర, అంధశబ్దములు సమానార్థకము లను కొందరు చరిత్రకారుల సిద్ధాంతము తత్త్వము వారియెడ చరితార్థమై యొప్పినది. వారు వాఙ్మాత్రమున స్వతంత్రులు. కార్యసాధనమున కేవలము పరతంత్రులు. ఇంకను తెనుగుతల్లిని సంస్కృతభాషాదాస్యమునుండి తప్పింపవలయు నని ఒక వంక నే కొందరో బొబ్బ లిడుచున్న యీనాడును ఆమె శరీరము నిలువున సూది మోప నేని తావు లేకుండ సంస్కృతపదార్థమునే “ఇంజెక్టు” చేయుచు మురిసిపోవుచున్నారు కొందరు తెలుగు బిడ్డలు...ఎట్లయిన నేమి? మనము తెలు గనుకొని నది తెనుగు కాక సంస్కృతప్రాయ మయి నిలిచినది. అందు తెనుగుదనము లేదు. ఆ తెనుగు నందుకొనుట కెటు చూచినను సంస్కృతము నాశ్రయ మావశ్యక మైనది... తెనుగు గతి యింతేనా? ఇది యేర్పడిన ప్రశ్న. ఆంధ్రవిశ్వకళాపరిషత్తు దీనికి కార్యరూపమున సమాధాన మీయవలసినది. తెనుగునకు ప్రాధాన్య మీయ వలసినదియు, స్వాతంత్ర్యమును గడించవలసినదియు నగు ఆంధ్రవిశ్వకళాపరిషత్తు జన్మమెత్తి ఆరే డేడు లయినది. తెనుగున కేమి చేసినది? ఎట్టి ప్రాధాన్య మిచ్చినది? స్వాతంత్ర్యసంపాదనమున కయి ఏ పరికరములను కల్పించినది? వీనికి సమాధానము మాట యటుండు గాక, ప్రత్యేకము తెనుగు చదువుటకు గూడ దానికంటె నధికముగ సంస్కృతమును చదువవలె నని శాసించినది. నానాటికి సంస్కృతముతో సంబంధమును తగ్గించి తెనుగునకు స్వతంత్రస్థితిని సమకూర్చుటకు తగిన మార్గము నరయ వలసిన ఆంధ్రవిశ్వకళాపరిషత్తు దానికి మరింత పారతంత్ర్యమును కలిగించు నియమములను శాసించుట అనాలోచితకార్యమే; కాని సంస్కృతమయ మయి యున్న ఆంధ్రమునకు సంస్కృతసాహచర్య మనివార్యమే. సంస్కృతప్రాబల్యమును సాధ్య మైనంత వరకు తగ్గించుచు తెనుగున నూతన ముగ వాఙ్మయమును సృష్టించుటయే దీనికి తరణోపాయము. స్వాతంత్ర్యప్రియులు, విద్యాధికులు నగు తెనుగువారును, తెనుగువారికొరకు పుట్టిన విశ్వకళాపరిషత్తును ఈ యుపాయమునకు రూపము నొసగ వెంటనే దీక్షతో పూనుకోవలెను”

నిలకడమీద నిజము

వెన్నెలకంటి అప్పారావుగారు “స్థానికసంస్థల నెత్తివేయు” డను శీర్షికతో (13–12–33) ఆంధ్రపత్రికలో ఒక వ్యాసము ప్రకటించుచు స్థానిక సంస్థలకు అధికారులే అధ్యక్షు లగుట శ్రేయస్కరమని స్వానుభవముతో ఇట్లు సమర్థించుచున్నారు.

“...ఈ సంస్థల నెత్తివేయుచో దేశమునకు ఏ విధ మయిన ముప్పయినను తటస్థించు నేమో విచారింతము. విద్యాశాలల విచారణకు విద్యాశాఖవా

యుండునట్లే రోడ్ల విచారణ''కు డి. పి. డబ్ల్యూ వారుండవచ్చును. ఆయా శాఖలవారు అన్యాయము చేయకూడదా అని విచారింతము. అనధికారాధ్యక్షులు ఎట్లు ప్రవర్తింపవలసిన దనుటను గురించి రూల్సు లేవు. గవర్న మెంటు ఉద్యోగస్థు లన్ననో అట్లు కాదు. వారికి పైఅధికారు లెంద రేనియు నుందురు. వారు స్వేచ్ఛగా వర్తించుటకు వీలే యుండదు. ఎవరి కైనను అక్రమము జరుగుచో అట్టివారు గౌరవోద్యోగు లగు ప్రెసిడెంట్లవలన న్యాయము పొందుటకన్న ఎట్టి దుర్మార్గు డైనను గవర్న మెంటు ఉద్యోగివలన న్యాయము పొందుట సులభము. రూల్సు ప్రకారము నడచుటకు గవర్న మెంటు ఉద్యోగిని బలవంతపెట్టగలము; గాని అనుద్యోగిని బలవంతపెట్టజాలము. అందువలననే ప్రజ స్థానిక సంస్థల నిర్మూలమునకై ఎదురుచూచుచున్నది. కంట్రాక్టుల విషయమున, డి. పి. డబ్ల్యూ, అధికారులు లంచములు పుచ్చుకొనుచుండవచ్చును; గాని వారు నిర్భయముగ డబ్బు పుచ్చుకొనుటకు గాని, పుచ్చుకొనిన ద్రవ్యమును ఎన్నికలయందు వినియోగించుటకు గాని వీలుండదు. అందువలననే కంట్రాక్టరుల వలన ఇంజనీయర్లు లంచము పుచ్చుకొనినను వారు ప్రజాస్వాతంత్ర్యమునకు భంగకరము లగు పనులు చేయజాలనందున ప్రస్తుతపు ఏర్పాటుకన్నను రోడ్ల మరమ్మతు కంట్రాక్టులు డి. పి. డబ్ల్యూ, వారి పరమొనర్చుటే మే లని జనులు భావించుచున్నారు. అదియును గాక. కొలది రోజులలో రాష్ట్రపాలనయందు పరిపూర్ణస్వాతంత్ర్యము లభింప నున్నది. అట్టి తరి విద్యావిధానాది విషయములయందు వలయు మార్పులు మంత్రులే చేయగలరు. వారి యుత్తరువులు అనధికారులకన్న అధికారులే తృప్తికరముగ నెరవేర్పగల రనుటలో సందియ ముండదు. కనుక మనము సరియైన వారిని శాసనసభలకు పంపగలుగుదు మేని దేశలాభమునకు వలయు పనులన్నియు శాసనసభలయందే జరుగగలవు. ఏతావేదారయినను లంచములు పుచ్చుకొన్నట్లు గాని, అక్రమములు చేసినట్లు గాని తెలియుచో వెంటనే అట్టి వారికి తగు శిక్ష పడునట్లు మనము చేయగలుగుదుము, కాని ఈ స్థానికసంస్థలు పోవుటకు సమ్మతింపనివారు ప్రస్తుతపు శాసనసభల నలంకరించు వారే అయి యున్నారు.''

కవులకూ, వ్యాసకర్తలకూ విన్నపం

ప్రబుద్ధాంధ్రకు ఎవరూ పద్యాలు పంపవద్దు. ప్రస్తుతరాజకీయాలకు సంబంధించినవి వచనంలో నైనా పంపవద్దు. కథలూ, ఏకాంకనాటకాలూ, వ్యాసాలూ, విమర్శలూ, మొదలయినవి తక్కిన ఏ విషయంలో నైనా సరే వచనంలో మాత్రమే కావాలి. సాధ్య మైనంత చిన్నవిగా వుండేవే పంపవలసిం దని మనవి. కర్తలకు వారి రచన పడిన సంచిక మొదలు పన్నెండు సంచికలు పంపుకుంటాం. ఇంతే మేము చెయ్యగల సత్కారం. తరుచు రాసే వారికి ఎప్పుడూ పంపుకుంటాం. విమర్శకోసం పుస్తకాలు పంపేవారు రెండేసి ప్రతులు పంపాలి. వొకటి పత్రికాభాండాగారానికీ, వొకటి విమర్శ చేసే వారికిన్నీ.

ఇట్లు, వ్యవస్థాపకుడు

వ్యాఖ్యానములు

ప్రకటనోద్దేశం

ప్రబుద్ధాంధ్రపత్రికను యథాపూర్వంగా ప్రకటించడానికి మళ్ళీ పూనుకున్నాను.

సరిగ్గా యీ సమయంలో దేశం, డబ్బు లేక చాలా యిబ్బంది పడుతూ వుండడం యెరుగుదును, కాని యీ కారణంచేత యిది మానుకోడానికి వీలు లేదు. నవనాగరికత మనల్ని చాలా ముమ్మరంగా అలుముకొని వుంది. ఏమి టేమిటో అవసరాలు బలిసిపోయి మనకి నిరాడంబరత్వాన్ని, తృప్తిని దూరం చేసేశాయి. అతిసులభ మైన మన జీవనవిధానం అమితధనసాధ్యం అయిపోయింది. అయితే ! కన్ను పొడుచుకున్నా డబ్బు మాత్రం కనపడ్డం లేదు. పంటలు దిగతీసినాయి. ధరలు పడిపోయినాయి, వర్తకం మందగించిపోయింది. రకం తిరగడం లేదు. సంసారాలు ఉల్టా సీదా అయిపోతున్నాయి. దారీ తెన్నూ తోచక దేశీయులు అటమటించిపోతున్నారు.

ఇది యిలా వుండగా, సర్వతోముఖ మైన మన జాతీయవికాసానికి అత్యావశ్యక మైన ఆంధ్రరాష్ట్రం నిర్మింపబడే చిహ్నాలు చూపుమేర దూరంలో యెక్కడా కనపడ్డం లేదు. గంజా మాంధ్రభూభాగాన్ని గురించే మనం తహతహ లాడిపోతూ వుండగా, విశాఖపట్టణం హార్బరూ, ఆమండలమూ మధ్యపరగణాల స్వాధీనం అయిపోయే సూచనలు పొటమరిస్తున్నాయి. ఆంధ్రోద్యమం వుందా లేదా అన్న కొడికి వచ్చింది,

ఇంగ్లీషుమీదనుంచి యిప్పుడిప్పుడే కొంచెం, కొంచెం మళ్ళుతూ వున్న భాషాప్రీతిని మన ఆంధ్రంమీద కేంద్రీకరించకుండా శుష్కరాజకీయప్రచారకులు మరొక పక్కకి లాగేస్తున్నారు. మన వాఙ్మయంలోనే నిక్షిప్తం చేసుకోవలసిన నవీనవిజ్ఞానాన్ని విద్యాధికులై వున్న వారు యింకా పరవాఙ్మయాలనుంచే యెరువు తెచ్చుకుంటూ భావదాస్యాన్ని పెంచుకుంటున్నారు. అనేకప్రలోభనాలనుజయించి అతినిరుత్సాహకరపరిస్థితుల్లో కూడా ద్విగుణితోత్సాహంతో, నిష్కామంగా నవీనాంధ్రవాఙ్మయాన్ని నిర్మిస్తూ వున్న మెరికల్లాంటి యువకులు పైకి వచ్చే మార్గాలు లేక కొందరూ, ఋణదాతల చేతుల్లో యిరుక్కుపోయి కొందరూ నిస్తేజు లైపోతున్నారు.

నాదబ్రహ్మమును నిజమాతృవాఙ్మయశరీరంలో ప్రతిష్ఠించిన త్యాగయ్య మన ముత్తాత అయినా సాటి లేని ఆపైతృకధనం భద్రపరుచుకో లేకపోవడం అలా వుండగా ఆంధ్రేతర్ల వాళ్ళు నోటిపాటలతో అచ్చతెనుగుసీమని ముఖరితం చేసుకుంటూ మనం కూడా రసికుల మని ధన్యవాదాలు చెప్పుకుంటున్నాం. మన చిత్రకారులు ఏ విషయంలోనూ యితర్లకి తీసిపోరు. వొకొక్క సందర్భంలో వారిని కిందికి లాగేస్తారు; కాని ఆంధ్రేతర్ల చిత్రపటాలతో మన గోడలు నిండిపోతున్నాయి. తమ చిత్రాలు పైకి వచ్చే మార్గాలు లేక మనవారు కుంగిపోతున్నారు.

సంఘం విధినిషేధాలు విడిచి విచ్చలవిడిగా సంచరిస్తోంది. చివరికి సనాతనధర్మవాదుల దృష్టితో చూసినా సంఘాన్ని మళ్ళీ నిర్మించవలసిన అగత్యం కనపడుతోంది. సంస్కర్తలు యురపియను సంఘాల ఆదర్శాల్లో పడి, దేశీయుల కొక్కడికక్కడికే సభ్యత కలిగించే ప్రాథమికసంస్కరణాలను విడిచిపెట్టి, కేవలమూ వివాదాస్పదా లైన విషయాలయందే తమ పరిమితశక్తిని ధారపోస్తున్నారు.

పాడి పంటలు సమకూర్చే వ్యవసాయదారులూ, ముడి వస్తువులను భోగ్యపదార్థాలుగా మార్చే పారిశ్రామికులూ, వాటిని దేశం అంతటా సరఫరా చేసే

వ్రతకులూ, ఈ తెగల వారి కందరికీ వెన్నెముకలై వుండి చెమట రూపంగా తమ రక్తాన్ని వోడ్చే కార్మికులూ డబ్బు లేకా, ఐకమత్యం లేకా, స్వాతంత్ర్యం లేకా దిగ్భ్రాంతులై పోయి వున్నారు.

అయితే: అంత కంతకి అతితీవ్రరూపం తాలుస్తూ వున్న నేటి ఆర్థిక సంకటం మన కొక గొప్ప ప్రయోజనం కలిగిస్తోంది. వాస్తవంగా యిదే మన కళ్ళు తెరిచిం దని చెప్పవచ్చు. ధరలు పెరిగి చేతికి డబ్బు పుష్కలంగా వచ్చినంత సేపూ మనకి పాశ్చాత్య వ్యామోహం పెరిగిపోతూనే వచ్చింది. ఇప్పుడో? "ధారావాహిక మైన మన సంప్రదాయం యెట్టిది? మన మిప్పు డెలాంటి స్థితిలో వున్నాము? దీనికి కారణం యేమిటి? ఇది యెలా పరిణమిస్తుంది? మన మిప్పుడు చెయ్యతగ్గ పని యేమిటి?"—ఇలాంటి జటిలసమస్య లెన్నో అడుగడుక్కీ మనకి గతి నిరోధం కలిగిస్తున్నాయి.

వీటి నన్నిటిని పరిష్కరించి యిప్పుడు 'ఇదీ దారి' అని నిర్ధారణ చేసి చూపించగలవా రెవరూ? పండితులు చర్చలు చేసి నిగ్గుతేల్చ వచ్చు. వక్తలు గంభీరోపన్యాసా లిచ్చి ప్రబోధం కలిగించ వచ్చు. అయితే ఈ చర్చలూ, ఈ గంభీరోపన్యాసాలూ స్థానికాలు; గాని సార్వత్రికాలు కావు. తాత్కాలికాలు; గాని సార్వజనీనాలు కావు. ఐకదేశికాలు; గాని సార్వజనీనాలు కావు. సావధికాలు; గాని నిరవధికాలు కావు. పైగా, పచ్చిపాలను పొంగించేవే, గాని పరిణతి కలిగించేవి కావు.

కాగా, పత్రికలే యీ నిర్దిష్టఫలాలు సాధించగల పరికరాలు. పాశ్చాత్యదేశాలలో పత్రికలు నేడు విప్లవాలను కలిగిస్తున్నాయి. శాంతిని నెలకొల్పుతున్నాయి. రాజుల్ని పదభ్రష్టుల్ని చేస్తున్నాయి. మానవమాత్రుల్ని దేశాధ్యక్షపీఠాలు యెక్కిస్తున్నాయి. నిజంగా పత్రికలకు యెంతటి శక్తివుందో అవి సోదాహరణంగా ప్రకటపరుస్తున్నాయి.

ఈ సంగతులు బాగా గుర్తించి ఆ దేశాలవారు పత్రికల్ని ఈశ్వరుణ్ణి కంటే హెచ్చుగా పూజిస్తున్నారు.

మన దేశంలో కూడా పత్రికలు చాలా మార్పులు తెచ్చిపెడుతున్నాయి. ప్రజలలో కొత్త భావాలనూ, కొత్త రుచులనూ, కొత్త వాంఛలనూ, కొత్త సిద్ధాంతాలనూ, కొత్త సంకల్పాలనూ, వ్యక్తపరుస్తున్నాయి. ఇరవై ముప్ఫయి సంవత్సరాలుగా ఆంధ్ర పత్రికలు అతిజడస్థితిలో మన సంఘంలో కలిగించిన పరిణతి ఇప్పుడు అతిస్ఫుటంగా కనపడుతూనే వుంది.

సంపాదకుడు ఎలాంటి పరిస్థితుల్లోనూ కూడా తన స్వాతంత్ర్యాన్ని అమ్ముకోకుండా నిలవగలిగితే, తన అంతరాత్మని చంపుకోకుండా వుండగలిగితే, తన ధర్మాన్ని విడిచిపెట్టకుండా పని చెయ్యగలిగితే, తన సాధననుంచి విచ్యుతుడు కాకుండా ఆగగలిగితే, తన ప్రాప్యంనుంచి తప్పిపోకుండా నడవగలిగితే, నిజంగా పత్రికాప్రచారం కంటే దేశసేవ లేదు. పత్రికాప్రచారం కంటే మానవసేవ లేదు. పత్రికాప్రచారం కంటే ఈశ్వరసేవ కూడా లేదు.

కనకనే ఈ క్లిష్టసమయంలో నేను ప్రబుద్ధాంధ్రను ప్రారంభిస్తున్నాను.

నా దృష్టిలో రాజకీయాలకు ప్రాధాన్యం లేదు. ఆంధ్రుడు సర్వథా ఆంధ్రుడు కాగలిగినప్పుడే రాజకీయాలలో విజయం సాధించగలడు. మున్ముందు ఆంధ్రచరిత్ర సుపరిష్కృతం అయి, ఆంధ్రశిల్పాలు ఉత్తేజితాలయి, ఆంధ్రలలితకళలు గురుపీఠం అధిష్ఠించి, ఆంధ్రపరిశ్రమలు దేశం అంతటా నిండిపోయి, ఆంధ్రవాఙ్మయం నవీనవిజ్ఞానంతో పరిపూర్ణం అయి, ఆంధ్రసంఘం నూత్నజవసత్వాలతో సంపన్నం అయి—ఇలాగ ఆంధ్రజాతి సర్వతోముఖంగా నూత్నచైతన్యవిలసితం అయితే గాని ఆంధ్రుడికి స్వస్వరూపప్రాప్తి లేదు. అప్పుడు గాని ఆంధ్రదేశం తోటి దేశాలతో సమానప్రతిపత్తిని పడయలేదు. అప్పుడు గాని ఆంధ్రుడు తన రాజకీయప్రాబల్యాన్ని ప్రదర్శించలేడు.

ఇప్పుడు ఆంధ్రుడు కలం పట్టితే యిలాంటి

విజ్ఞానం కలిగించే వాఙ్మయం నిర్మించాలి. నోరు విప్పితే యిలాంటి ఉద్రేకం పుట్టించే ఉపన్యాసం చెయ్యాలి. నడుం కట్టితే యిలాంటి ఫలితం యిచ్చే కార్యక్రమం నెరవేర్చాలి.

ప్రబుద్ధాంధ్రకు ఆంధ్రదేశమే కార్యక్షేత్రం. ఆంధ్రవికాసమే ప్రాప్యం. ఆంధ్రుడు "నే నాంధ్రుణ్ణి నాపూర్వుల రక్తమే నాశరీరంలో ప్రవహిస్తోంది. నాపూర్వుల తేజస్సే నన్ను నిలుపుతోంది. నాపూర్వుల చైతన్యమే నన్ను నడిపిస్తోంది. భరతవర్షానికి నేను ప్రవర్తకుణ్ణి. ప్రపంచకానికి నేను ఆదర్శపురుషుణ్ణి" అని చెప్పుకోగలడమే పరమావధి.

ఆంధ్రోద్యమం

"నన్ను తెలిస్తే నిన్ను తెలుస్తా" నంటుందిట వర్తకుణ్ణి లెక్క. అలాగే "నన్ను బలపరిస్తే మిమ్మల్ని వుద్ధరిస్తా" నంటోంది మనల్ని ఆంధ్రోద్యమం. పాపం వొకప్పుడు అది అలాంటి చిన్నెలు కూడా కనపరిచింది, కాని మన అనుకరణపరాయణత దాన్ని పూర్తిగా—

మనకి ఆంధ్రోద్యమం "నే నాంధ్రుణ్ణి" అన్న అభిజ్ఞానం కలిగించింది. మన నికృష్టస్థితిని పండు వొలిచి చేతిలో పెట్టినట్లు విప్పి చూపించింది. "నే నింతగా కూలిపోయానా?" అన్న అనుతాపం కలిగించింది. "నేను మళ్లీ బాగుపడాలి" అన్న ఆవేదన కలిగించింది. "నాకు ప్రత్యేకరాష్ట్రం అవసరం" అన్న ఆశ పుట్టించింది. "దీన్ని సాధించాలి" అన్న నిశ్చయం కలిగించింది. సంశయాత్ముల్ని లాంగదీసి, యింట గెలిపించి రచ్చ కెక్కించింది. నలుగురి దృష్టి మనమీదకి తిప్పింది. మనల్ని సర్కారు నోటీసులోకి తీసుకువెళ్లింది. "అవు" నని వారిచేత తల వూపించింది. "ఇదే దీక్షగా పని చెయ్యవలసిన సమయం" అని మనకి చిలక్కి చెప్పినట్లు చెప్పింది, కాని యీస్థితిలో కాంగ్రెస్సు వెల్లువ వచ్చి అంతా తుడిచేసింది. పైగా "ఆంధ్రులు బహునాయకత్వంతో కుళ్లిపోతున్నా" రని ముద్ర కూడా వేసేసింది.

మన రాష్ట్రానికి ప్రత్యేకంగా కాంగ్రెస్సు కమిటీ యేర్పడక పూర్వం జరిగిన ఆంధ్రమహాజనసభలు చూడని ఆంధ్రుడి జన్మ వొక జన్మ కాదు. "కాంగ్రెస్సు కూడా అంత వైభవంగా జరుగుతుందా" అనిపించే పవి. వొక విధంగా కాంగ్రెస్సుకంటే మనఆంధ్రమహాసభే వుత్తమంగా వుండేది. ఏమంటే? మన వారు ఎంత కప్పెట్టుకున్నా కాంగ్రెస్సులో భిన్నజాతుల ప్రత్యేకసౌకర్యవాంఛలు అక్కడి వాతావరణాన్ని కలుషపరుస్తూనే వుంటాయి. వెనకటి ఆంధ్రమహాసభల్లో అలాంటి దేమీ వుండేది కాదు. అక్కడ అందరికీ వొకటే దృష్టి. అందరికీ వొకటే ఆవేదన. అందరికీ వొకటే ప్రాప్యం. అందరికీ వొకటే దీక్ష. అందరికీ వొకటే మార్గం. అందరికీ వొక్కటే పరమావధి. అప్పుడు ఆంధ్రరాష్ట్రప్రస్తావానికి ప్రతికూలంగా వుండే వొక రిద్దరు— అంటే న్యాపతి సుబ్బారావుపంతులు, మోచర్ల రామచంద్రరావుపంతులుగార్ల వంటివారు ఏకాకు లైపోయి వురకలు వేసుకు వచ్చే జాతీయవాంఛాప్రవాహాన్ని ప్రతిఘటించి నిలవలేక పక్క పక్కకి వొత్తిగిలి వుండేవారు. ఆ సభామండపాలూ, వాటిలో నిండి వుండే ఆ ఆంధ్రతేజస్సూ చూస్తే ప్రతీవాడికీ ఆంధ్రత్వం పొంగిపోయేది. ప్రతీవాడికీ పూర్వవైభవం కళ్లకి కట్టినట్టు తోచి పారవశ్యం కలిగించేది.

ఆ సభలకి దక్షిణాంధ్రులు వచ్చేవారు. కర్ణాటాంధ్రులు వచ్చేవారు. నైజామాంధ్రులు వచ్చేవారు. బొంబాయి (కోమాటీలు) ఆంధ్రులు వచ్చేవారు. ఇంకా యెక్కడెక్కడో వుండే ఆంధ్రులూ వచ్చేవారు. అందరూ యేదో సభకి వెడుతూ వున్నట్లూ, చర్చలు చేసి తమ తమ పంతాలు నెగ్గించుకోడానికి అస్త్రశస్త్రాలతో తయారై ముందుకి వురుకుతూ వున్నట్లూ కాక ఎక్కడెక్కడో ఎవరెవరితోటో ఏవేవో ఆటలు ఆడుకొని ఆడుకొని అలసి అలసి బిడ్డలు తల్లి అడ్డాల్లో చేరి కమ్మని

పాలు తాగి హాయిగా విశ్రమించడానికి వచ్చేటట్లు వచ్చేవారు. అందరూ యేకవేదికమీద కూచునే వారు. అందరూ యేకబంతిని ఆరగించేవారు. అందరూ యేకవరసని శయనించి సుఖస్వప్నాలు కనేవారు. అందరు సోదరసోదరీమణు లొక్కచోట చేరినపుడు సన్నిధి చేసే తల్లి మందహాస చంద్రికల్లో తేలియాడుతూ అందరూ వొకరి స్థితిగతులు వొకరికి, వొకరి అనుభవాలు వొకరికి, వొకరి ఆవేదనలు వొకరికి చెప్పుకుంటూ, తనువులు దూర మైనా మనస్సులు కలిసే వుంటాయని, వునికి భేదించినా జాతి భిన్నం కాదని నిరూపిస్తూ, ఎన్నడో దూరందూరంగా విసిరేసిన సందర్భాలనూ, కొన్ని శతాబ్దుల దాకా తిరిగి కలుసుకో నివ్వని సన్నివేశాలనూ జయించి మళ్లీ మాతృక్రోడం చేర్చిన ఆంధ్రోద్యమాన్ని చేతు లెత్తి మొక్కుతూ, కంఠా లెత్తి కీర్తిస్తూ ఆనందతాండవం చేస్తూ వుండేవారు.

అలాంటిసమయంలో ప్రోవిన్షియల్ కాంగ్రెస్సు కమిటీ ఝంఝూమారుతం లాగ వచ్చిపడి నవనవలాడుతూ వున్న ఆంధ్రోద్యమలతని నేలబెట్టి కొట్టేసింది. వాస్తవంగా యిప్పటికి కూడా అదే వొక్కవరసని ప్రళయతాండవం చేస్తూనే వుంది; గాని పరప్రత్యయనేయబుద్ధి గల ఆంధ్రు డిది యేమీ తెలిసికోలేకుండా వున్నాడు.

ఇటీవల శ్రీ బొబ్బిలి రాజావారు "మనకి ప్రత్యేకరాష్ట్రం అపాయకరం" అని చెప్పాటప్పటికి కాంగ్రెస్సు వెల్లువలో సుడితిరిగిపోతూ వున్న మనవారు వులిక్కిపడి "యేమి కేమి" టంటూ కాపాలదాకా వెళ్లారు; గాని, మొన్నటి మదరాసు కౌన్సిల్లో ఆంధ్రరాష్ట్రతీర్మానం యేదో విధంగా నెగ్గగానే, మళ్లీ మరొక అప్రస్తుతప్రశంసలో పడిపోయారు.

మొదణ్ణుంచీ యీ విషయం యిలాగే రసాభాసం అయిపోతోంది. ఏమీ యెరగని దేశీయులకి ఆశ పుట్టించి, చిన్న యెత్తున ఆందోళనం సాగించిన మన ప్రముఖులికి సరియైన పరిణతి లేకపోవడం వల్ల కలుగుతూ వున్న చిక్కిది. ఆంధ్రరాష్ట్రతీర్మానం యిదివరకే మదరాసు కౌన్సిల్లో రెండు మాట్లు నెగ్గి వుంది. ఇది మూడో మాటు. అయితే: ఆ రెండు మాట్లూ లేని విశేషం యిప్పు డేం వొరిగిందీ? శ్రీ బొబ్బిలిరాజావారికి పలుకుబడి కల కౌన్సిల్లో మనవారు వారికి వ్యతిరేక మైన తీర్మానం నెగ్గించ గలిగారు. అంతే. కాని దీనివల్ల అధికార్లకి సుముఖత గాని, తొందర గాని కలగలేదు. దేశీయులకి ప్రబోధంగాని చురుకు గాని పుట్టలేదు. బొబ్బిలి రాజావారికి పోయింది కూడా యేమీ లేదు.

అమాయికాంధ్రుడా! ఇంకా యెన్నాళ్లు నీకీ అనుకరణపరాయణతా? ఇంకా యెన్నాళ్లు వొకళ్ల అడుగుల్లో అడుగులు వేస్తావు? దక్షిణభారతదేశాన్నంతా ఆపోశనం పట్టిన వాడవు నువ్వు. మగధదేశంలో సింహనాదం చేసిన వాడవు నువ్వు. మహారాష్ట్రులకి రాజ్యతంత్రం నేర్పిన వాడవు నువ్వు. వొకళ్లు నీకు చెప్పడమా? వొకళ్లమాట విని నీ ఆత్మోద్ధరణప్రయత్నం నువ్వు మానుకోడమా? ధిక్! మేలుకో. సింహావలోకనం చేసుకో. నీ ఆంధ్రోద్యమం మళ్లీ ప్రారంభించి నీ వున్నతిని నువ్వే సాధించుకో.

రథం మళ్లీ కదిలిందా యేమిటి?

అక్కడక్కడ కొత్త గ్రంథాలయాలు నెలకొల్పబడుతూ వున్నట్టూ, పాతవి కూడా మళ్లీ బూజు దులుపుకుంటూ వున్నట్టూ తెలుస్తోంది. ఇదివరకి లేంది కొత్తగా వెలిసిన గ్రామపంచాయితీలు కూడా కొన్ని గ్రంథాలయాలు నెలకొల్పుతున్నాయి. పల్లెటూళ్లలో మళ్లీ నిజమైన చైతన్యం ప్రతిఫలిస్తోంది.

ఇదంతా యేమిటీ అని చూస్తే, మిత్రులు అయ్యంకి వేంకటరమణయ్యగారు విస్ఫారిత మొగంతో మళ్లీ దర్శనం యిస్తున్నారు.

వేంకటరమణయ్యగారంటే గ్రంథాలయోద్యమానికి భౌతికరూపం అని ప్రసిద్ధి. అయితే వారు కూడా ఆంధ్రులే కాదూ? కనకనే పది సంవత్సరాలు వెయ్యని శిక్ష. శిక్ష అనంతరం కూడా వారికి పూర్వస్మృతి నశించకుండా వుండడం మాత్రం గొప్పమాట.

వేంకటరమణయ్యగారికి మేము ప్రశంసాపూర్వకమైన స్వాగతం యిస్తున్నాము. వారి పదవి వారికి సిద్ధంగా వుంది. దాన్ని యెవరూ ఆక్రమించుకోలేదు. అది వారికే తగినది. వారికే భుక్తం అయినది. వారికే స్వాధీనం అయినది కూడానూ.

వెంకటరమణయ్యగారు విడిచిపెట్టడం వల్ల గ్రంథాలయోద్యమం శల్యావశిష్టమైపోయింది. దాన్ని విడిచిపెట్టడంవల్ల వేంకటరమణయ్యగారు— పుష్టిగానే వున్నారు, గాని పది సంవత్సరాల జీవితం వ్యర్థం చేసుకున్నారు. నిజంగా యీపాటికి ఆంధ్రగ్రంథాలయాలు కలకల్లాడుతూ వుండేవి. వేంకటరమణయ్యగారు ప్రతీ యింటోనూ యిలువేల్పయి పూజింపబడుతూ వుండేవారు.

ఇప్పుడైనా మించిపోయింది లేదు. కొత్తగా తయారు చెయ్యడం ఆలస్యం గాని నివురు గప్పిన నిప్పుని రెచ్చగొట్టడం క్షణం. పైగా గ్రంథాలయోద్యమాన్ని దిగతీసినా కాంగ్రెస్సు, వేంకటరమణయ్యగారికి ఆంధ్రుల ముక్తి యెందులో వుందో బోధపరిచి వుంటుంది

గ్రంథాలయోద్యమం నిర్వహించడం కూడా దేశభక్తే అని యిప్పుడు వెంకటరమణయ్యగారికి యెవరూ చెప్ప నక్కర్లేదు. గ్రంథాలయాలు చదువుకున్న వారి బుద్ధికి మారాకు పెట్టిస్తాయి. చదువుకోని వారికి విద్యాతృష్ణా, జ్ఞానాన్ని గురించి ఆవేదనా కలిగిస్తాయి. ఈ ఫలితం కలిగించడం మాటలతో కాదు. ఇది యెలా నిర్వహించాలో వేంకటరమణయ్యగారికి బాగా తెలుసు.

వెంకటరమణయ్యగారు వెనక వూరూరా గ్రంథాలయాలు ప్రతిష్ఠ చేయించడానికి పాటుపడ్డారు. ఇప్పుడు వాటికి జీర్ణోద్ధారం చేయించడానికి పాటుపడాలి. ఇది వారికి కొత్త పని. లేనిచోట్ల ప్రతిష్ఠ చేయించడం వారికి తెలిసిందే.

ఆంధ్రగ్రంథాలయోద్యమంమీద ఇతర్లు కొందరు కొరడాలు విసురుతున్నారు. వారిమీద కోప్పడితే లాభం లేదు. వారు అతిశయోక్తులు పలికి వుంటారు: గాని అసలబద్ధం కాదు. ఇంతకీ: "మీది తప్పు" అని మనం వారిని మాటలతో గాదు యెదిరించడం. చడీచప్పుడూ లేకుండా, మన దగ్గర యే లోపం వుందో దాన్ని సవరించుకుంటే అప్పుడు వారు క్షమాపణం చెప్పుకుంటారు. లేక, వారు కూడా చడీచప్పుడూ లేకుండా దిద్దుకోనేనా దిద్దుకుంటారు.

వేంకటరమణయ్యగారు మళ్లీ యెలాంటి సందర్భాల్లోనూ కూడా స్వధర్మంనుంచి విచ్యుతులు కాకుండా వుంటారని నమ్ముతున్నాం.

పత్రికలు - గ్రంథములు

ఆంధ్రసహకారపత్రిక

ఇది మాసపత్రిక. రెండవసంపుటము నందలి ౧, ౨, ౩, ౪ సంచికలు (౧౯౩౩ వ సంవత్సరము జూలై ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలవి) మా కార్యస్థానము చేరినవి. ఈ పత్రిక ప్రధాన సంపాదకులు వి. వేంకటసుబ్బయ్య బి. ఏ. గారు. సహాయ సంపాదకులు జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి ఎం. ఏ. బి. ఎల్ గారు. తెనుగుకూర్పు యొక్క కార్యక్రమ మంతయు శ్రీ సత్యనారాయణమూర్తి గారివలననే నెరవేర్పబడుచున్నది. మూర్తిగారు వంగభాషనుండి డి. ఎల్. రాయిగారి ప్రఖ్యాత నాటకములను, ఇంకను పెక్కు నవలలను ఆంధ్రీకరించి (ఇవి సరస్వతీ గ్రంథమండలిలో ప్రకటింపబడియున్నవి) మన ఆంధ్రులకు చిరపరిచితులైయున్నారు. ఆంధ్రసహకారపత్రిక సహకారమునకు సంబంధించిన ప్రచురణములలో మిన్నయని చెప్పదగినదిగా నున్నది. అయితే ఈ పత్రికవలన విశేష ప్రయోజనము బడయవలసిన వారు పల్లెటూరివారు, గావున శైలి సులభముగా నుండుట అగత్యము. భావమునకు సరియైన (వాడుక) తెనుగుమాటలు దొరక నపుడే సంస్కృత పదములను వాడుచుండినచో మూర్తిగారు పల్లెటూరి వ్యవసాయదారుల నుద్ధరించుటయే గాక ఆంధ్రవాఙ్మయమునకు గూడ ఎన్నదగిన ఉన్నతి కలిగించినవారగుదురు. సంవత్సరమునకు చందా 3_0_0. విడిపత్రిక 0_4_0 వలయువారు మదరాసు ప్రొవిన్షియల్ కో ఆపరేటివు యూనియన్. రాయపేట, మదరాసు అని వ్రాసికొనవలయును.

తెనుగు ప్రేమ ప్రచారక్

ఇది మాసపత్రిక. మొదటి సంపుటము ౧, ౨, ౩, ౪ సంచికలు మా కార్యస్థానము చేరినవి. ఇది ఆంధ్ర సత్సంగసంఘము వారిచే ప్రకటింపబడు చున్నది. సంపాదకులు వి. రామబ్రహ్మము బి. ఏ గారు. ఆంధ్రదేశమున రాధాస్వామి మత సిద్ధాంతములను వ్యాపింపజేయుట కిది ప్రారంభింపబడినది. ఈమత భక్తులు ఆంధ్రదేశమున 3 వేలకు మించి యున్నారు. ఈ మతము యొక్క సిద్ధాంతములు చిత్తమును సంస్కరించి దేశీయులకు నవజీవితము సంఘటింపజేయజాలునవిగా నున్నవి. స్వదేశీయవస్తువులను వాడుటకు దీక్షబూని యున్నవారు దయాల్బాగు పేరు అనుక్షణము వినుచుందురు. రాధాస్వామి మతమునకు ఆ గ్రామము రాజధాని. ఈ మతము వారే ఆ వస్తువుల నన్నిటిని తయారుచేసి దేశముయొక్క ఆర్థికసంపదను నిలుపుచున్నారు. రాధాస్వామి మతము ఇట్లు పారమార్థికముగను, భౌతికముగను గూడ దేశీయులను సంస్కరించి మహోపకారము చేయు చున్నది. మన ఆంధ్ర భాషలో ఈ పత్రికను ప్రారంభించిన సంపాదకులు రామబ్రహ్మముగారు వాస్తముగా దేశభక్తులలో నుత్తమశ్రేణికి చెంది యున్నారు. వారి సత్కార్యతత్పరతకు మా ప్రశంసను తెలుపుచు పత్రికకు విజయము నాకాంక్షించుచున్నాము. సంవత్సరమునకు చందా 1_4_0. విడి సంచిక 0_2_0. వలయువారు: సంపాదకుల పేర భీమవరము వ్రాసికొనవలెను.

కృపాంభోనిధి

కర్త చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు. 213 పద్యములు గలవు. శ్రీరాజా రామమోహనరాయలు వారి నిర్యాణశత వార్షికోత్స సందర్భమున ప్రకటింపబడినది, వెల తెలియదు. గ్రంథకర్తకు రాజమండ్రి వ్రాసి కొనవలెను.

౧

"తా మంపిన పత్రిక చేరినది. ప్రబుద్ధాంధ్ర చేసిన సేవ ఆంధ్రదేశానికి చిరపరిచితమే. తత్పునర్దర్శనము ఆనందసంధాయక మైనది. జీవము గల తెలుగూ, పరిణతి చెందిన వివేచనమూ, సార మెరుగని ఆంధ్రత్వమూ కల్గు మీ మేలి రచనములు ఆంధ్రజాతికి ప్రబోధమును, ఉజ్జీవమును కల్గించుచు, నూత్న చైతన్యము నొసగు నవ్యశక్తిని కారణభూతాలు కాగలవని విశ్వసించుచున్నాను. వచనరచనావిష్కారణమే నియమముగా పెట్టుకొన్న మీ పత్రిక మేలిమి బంగరు పంట్లను ఫలించు నని విశ్వసింతును"

యన్. వి. సరళాదేవి

౨

"పరిమిత ప్రయోజనము గల పద్య వాఙ్మయమును నిరాకరించి ఆంధ్రజాతీయాభివృద్ధికి తోడ్పడగలది, సామాన్యజనులకు విజ్ఞానము కలిగించుటకు ఉపకరించునదియు అగు కేవల గద్యవాఙ్మయమునే ప్రకటింపబూనుకొని ప్రబుద్ధాంధ్ర పత్రికాముఖమున మీరు చేయగడంగిన ప్రయత్నము మిక్కిలి ప్రశంసాపాత్రము. ఈ మీ మొదటి సంచికయందలి వ్యాసము లన్నియు వివిధ విషయికములై ఆంధ్రుని మనస్సు నాకర్షింపగలవై యున్నవి. 'జాగ్రత్త పడవలసిన ఘట్టాలు' 'సుస్వాగతం' అను కథలు ప్రకృతిసిద్ధములును, అనుభవబద్ధములును అయి మానవహృదయమును సంస్కరింపగలిగి యున్నవి. దీక్షితులుగారి 'ఈమాట నిజం' అను కథ రమణీయమై గద్యకవిత్వ మనిపించుచున్నది. 'శ్రీరంగరాజు చరిత్ర' 'ఉత్తరరామచరితము' అను భాషావిషయిక విమర్శవ్యాసములు ఆంధ్రవాఙ్మయ చరిత్రమునకు మిగుల ఉపకరించును. పత్రికలనుండియు, ఉపన్యాసములనుండియు ఏర్చి కూర్చిన విషయములును, వ్యాఖ్యానములును మీ పత్రికకు అలంకారములు, ఆంధ్రవిజ్ఞానమును పెంపొందించుటకును, ఆంధ్రోద్యమ వికాసమునకును మిక్కిలి ఉపయోగకరములు. ఇట్టి సర్వతోముఖ ప్రయోజనము కల వ్యాసరాజములతో మీరు కలయించిన ప్రబుద్ధాంధ్రకు సర్వదా ఆంధ్రులు కృతజ్ఞులై యుందురుగాక. మీ పత్రికారాజము ఆంధ్రుల యాదర ప్రోత్సాహములకు భాజనమై చిరకాలము వెలయుగాక"

వజ్ఝల వేంకటేశ్వరకవి, బి. ఏ.

౩

"మీరు కొంత కాలము విశ్రమించి యున్న ప్రబుద్ధాంధ్రను మరల మేలుకొలిపినందు కెంతయు సంతోషము. ఈకాలములో, అందును మన దేశములో దేశీయపత్రికలకు ప్రోత్సాహము మిక్కిలి తక్కువ. ఇందుకు దేశీయుల యుపేక్షాభావమే కారణము. అయినను వాఙ్మయమునకును, భాషకును సేవ చేయు తలంపునం గష్టనష్టముల కోర్చి పత్రికానిర్వహణమునకు సమకట్టిన మీకు దైవ మనుకూలించుగాక. ఈకాలమున చిన్నకథలు వ్రాయువారందరుం గూడ ఎట్లో నాయికా నాయకుల యనురాగము వర్ణించుటతోనే సరిపుచ్చుచున్నారు. సంఘధర్మము లెన్నో వర్ణింపవలసినవి లేకపోలేదు; కావున సంఘమునందలి యితరగుణ దోషములను విశదీకరించుచు నీతి జ్ఞానదాయక మగు రీతిని చిన్న కథలు వ్రాయుచున్నచో స్త్రీపురుష పాఠకులందరుం గూడ వాని వలన నుపయోగము నంద గల రని నాయాశయము. కథారచయిత లీవిషయ మాలోచింతురు గాక"

ముల్లాది సూర్యనారాయణశాస్త్రి
(ఆంధ్రయూనివర్సిటీ కాలేజీ పండితులు)

౪

"...మీపత్రిక ప్రథమ సంచికయు చేరినది, మీ పత్రిక నిజముగా అభిరుచికరముగా నున్నది"

తాత కృష్ణమూర్తి బి. ఏ. ఎల్. టి.

౫

"మీ 'ప్రబుద్ధాంధ్ర' పత్రిక తొలి సంచిక (జనవరి ౧౯౩౪ ది) చదివినాను. "ఇప్పుడు మనకి వచన

వాఙ్మయం చాలా అవసరంగా వుంది'' అని మీరు వ్రాసిన సంగతి యెంతో నిజం. అట్టి వాఙ్మయ ప్రచురణమునకే మీపత్రికను మీరు వినియోగింప తలచుట మేలైన పని. తెనుగు జాతీయతను పెంపందించు నంశములను ప్రబోధించుచు మీ పత్రిక ఆచంద్రార్కముగు వెలయుగాక''

కవికొండల వేంకటరావు (బి. ఏ. బి. ఎల్. వకీలు)

౬

"చిరవియోగానంతరమున ప్రియమిత్ర సందర్శనము లాగు "ప్రబుద్ధాంధ్ర'' పునర్దర్శనము హృదయాన్ని నిర్మలానందంతో నింపేసింది. ప్రబుద్ధాంధ్రకు నాహృదయపూర్వక సుస్వాగతము. పూర్వంలాగే ప్రబుద్ధాంధ్రకు శక్తివంచన లేకుండా సేవ చెయ్యడానికి ప్రయత్నిస్తాను. ప్రబుద్ధాంధ్రను ఆమూలాగ్రంగా చదివాను. పద్యాలను నిషేధించడం చాలా మంచి పని చేశారు. భావప్రకటనకు స్వేచ్ఛావకాశములు పద్యరచనములో బహు తక్కువ. ప్రధానము భావమే కాని పద్యమా గద్యమా అన్నది కాదు. అలాగని నేను పద్యరచనను కాదనడం లేదు. మహోన్నతము లైన— ఉత్కృష్టము లైన పరిమితవిషయాలకు మాత్రం కొన్నిటికి పద్యరచనయే అవసరమై వుంటుందని నేను గమనించక పోలేదు. అలాగ కాకుండా సాధారణవిషయాలను కూడా పద్యాలలో రాయడానికి ప్రయత్నించి భావాన్ని కుంటువడచేసుకుంటున్నారు చాలామంది యీరోజుల్లో. పత్రికాధిపతులు సంపాదకులు పద్యవ్యాసనిషేధాన్ని అమలులో పెట్టడంవల్ల విలేఖకవర్గంలో ఉన్న ఈభ్రమ అచిరకాలంలోనే అంతరించి పోగలదని ఆశిస్తున్నాను. రక్తాన్ని ఉడుకెత్తించగల వీరగాథలు, హృదయాన్ని కరగించగల కరుణారసప్రధానము లగు చరిత్రలు, మహోన్నతాశయప్రస్ఫుటము లగు కథలు, మనోహరశృంగారభావపూరితము లగు ఘట్టములు వేనవేలు వచనంలో అతి సులభంగా మృదుమధురశైలిలో వ్రాయబడిన వాటిని నేను స్వయంగా చదివాను. చదవగా విన్నాను కూడాను. జాగ్రత్తగా వ్రాసిన వాట్లలో వచనమే కానియ్యండి రసపుష్టికి ఎన్నడూ లోపం రాదు. మీరిల్లా పద్యాలను నిషేధించడంలో చాలా ధైర్యమైన పనే చేశారు. మీకథ యథాప్రకారంగా ఆంధ్రబ్రాహ్మణ గృహజీవితచిత్రమును చిత్రించుటలో మీ లేఖినికి గల గల ప్రజ్ఞను చాటుతూ హృదయంగమంగా ఉంది. శ్రీ సుబ్బరామయ్యగారు పద్యవ్యాసనిషేధావసరమును చక్కగా నిరూపించినారు. ఊహాప్రపంచంలో చాలాదూరం యిదివరకే విహరించిన అనుభవశాలి దీక్షితులుగారికి— ఎల్లప్పుడూ ఉన్నతపవిత్రాశయముల వేపే దృష్టిసారిస్తూ ఉండే దీక్షితులుగారికి వాగనుశాసనుని దర్శనము దొరికిందంటే ఆశ్చర్యపడవలసిందేమీ లేదు ఇన్నిటికేం గాని నాకు వ్యక్తిపరంగా మీ కథలయందుండే గౌరవంచేత వాటికోసం ఆతురతతో నిరీక్షించే వాణ్ణి ఇదివరకు. ఇకనించి నెలకొక కథ మాకు తప్పకుండా దొరకుతుంది కనక సంతోషము. ఆంధ్రదేశానికి శ్రీవాదవారు అనేక కారణాలచేత గణించరాని ఆస్తి అయిపోయినారు''

కాళూరి వేంకటరామారావు

౭

"సర్వవిధముల మీ పత్రిక హృదయరంజకముగా నున్నది. సర్వంకష మగు వాఙ్మయసేవకు అను వగు మూలసూత్రములతోఁ బత్రికానిర్వహణమునకు మీరు సమకట్టితిరి. అందులకుఁ దగిన యోగ్యత మీయెడలఁ గల దనుటకీ మొదటి పత్రికయే సాక్ష్య మగును. వ్యావహారికభాషావ్యాసములు నాకుఁ జాల అభిరుచి కలిగించినవి. ఇట్టి రచన నాచే నగునా యను సంశయము నాకు మీ కథ కలిగించినది. పనితొందరలచే వచ్చే నెల పత్రికకు వ్యాస మంపఁజాలను; గాని తరువాతి పత్రికలకుఁ దఱచుగఁ బంపఁ బ్రయత్నించెద. నాశక్తి, విశ్రాంతి సామాన్యములు. ఎట్టి వ్యాసములు నన్ను వ్రాయు

మందురు? పద్యముల నిషేధించుటచే నా లేఖినికి నిరాశ కలిగినది''

దూపాటి వేంకటరమణాచార్యులు
(శేషాద్రిరమణకవులు)

౮

"ప్రబుద్ధాంధ్రలో పద్యములు వెయ్యక పోవడముకు కారణము వచనవాఙ్మయమును పోషించడానికే గాని పద్యవాఙ్మయమును తృణీకరించడానికి కాదని సంపాదకులు చెప్పుతున్నారు. వచనముతో పాటు పద్యములు పత్రికలలో వెయ్యడము సంప్రదాయసిద్ధముగా తెలుగులో జరుగుతూ ఉన్నది. నేడు యీ సంప్రదాయానికి విచ్ఛిత్తి కలిగించిన ప్రబుద్ధాంధ్ర సంపాదకుల పని కొందరికి నచ్చక పోవచ్చును, కాని అది ప్రశంసింప తగ్గదే అని నా అభిప్రాయము. ప్రతీకళా, ప్రతీశాస్త్రమూ ప్రత్యేకముగా వృద్ధి చెందవలెనంటే వాటివాటికి ప్రత్యేకముగా పత్రిక ఉండితీరవలెను. వచనవాఙ్మయాభివృద్ధి కొరకేర్పడిన ప్రబుద్ధాంధ్ర నిజాశయమును నెరవేర్చుకో గలుగుతుందని నమ్ముతున్నాను''

చింతా దీక్షితులు బి. ఏ. ఎల్. టి
[గవర్నమెంటు ట్రెయినింగుస్కూలు హెడ్మాష్టరు]

౯

"శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిలుగారు మళ్లా 'ప్రబుద్ధాంధ్ర' ప్రకటిస్తారంటే సంతోషించిన వారిలో నేనొకణ్ణి. వారి పూర్వ ప్రబుద్ధాంధ్రతో నాకు పరిచయం తక్కువయినా ఉన్నంతవరకూ వారి సారస్వత వ్యవసాయం పట్ల చాలా ఆదరమూ, గౌరవమూ ఉండేవి. ఉన్నవి...ఆంధ్రులు ప్రబుద్ధులు కావడానికి చాలా మంది, చాలా విధాల తాపత్రయ పడుతున్నారు. అయితే ఎంతవరకు ప్రబుద్ధులయ్యా రని ప్రశ్నిస్తే "ఖసూచనము" తప్పితే సమాధానం లేదు...లెక్క వేస్తే చూస్తూరోడగా ఇట్టే కవు లయిపోయేవారు ఆంధ్రులలో ఉన్నంతమంది ఇంకే దేశంలోనూ ఉండ రనుకుంటాను. ఏవార్తా పత్రికల్లో చూసినా, ఏ మాస పత్రికల్లో చూసినా అయోమయపు పద్యాలు అనంతంగా వస్తున్నవి. వీటివల్ల ఏమి ప్రయోజనం ఉద్దేశిస్తారో ఆ కవికుమారులు...దేశం తగినంత విజ్ఞానసమృద్ధం కావాలంటే వచనరచన తామరతంపరగా ఉండాలి. పద్యంలో భయపడుతూ, వణకుతూ, ఇరుకుగా కూర్చున్న దివ్యసందేశములు, మహాశయములు వచనంలో హాయిగా, విచ్చలవిడిగా విశాలంగా ఉండి సర్వగమ్యములుగా ఉంటవి...ఈతత్వదృష్టితో శాస్త్రిగారు పద్యాలు తమ పత్రికలో ప్రకటించడం మానినా రనుకుంటాను. అంతే గాని పద్యాలు అనవసరం అని గాని, ఇష్టం లేక గాని ప్రకటించక పోవడం కాదిది. వీరు కూడా పద్యాలు వ్రాస్తారు. పూర్వ ప్రబుద్ధాంధ్రలో పద్యా లుండేవి. దీనికి కూడా సదాంధ్రుల సహకారం అబ్బితే దేశం ప్రబుద్ధం అవుతుం దేమో''

ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి
(స్త్రీ సనాతన విద్యాలయ పండితులు)

౧౦

"మీరు పంపిన ప్రబుద్ధాంధ్ర జనవరి సంచిక చేరినది. ఆమూలాగ్రముగ చదివినాను. మీపత్రిక ఆంధ్రవాఙ్మయమున రానున్న నూతనసృష్టిని వందివలె సూచిస్తున్నది. పద్యవాఙ్మయమును త్రోసివేసి గద్యవాఙ్మయమునే ప్రధానముగా చేసికొనిన మీ పత్రిక శపథము అపురూపమైనది. మీ పత్రిక ఆంధ్రవాఙ్మయ పునరుజ్జీవనమునకు తప్పకుండా తోడ్పడగలదని నేను విశ్వసించుచున్నాను. మీ పత్రిక జయశీలయై వర్ధిల్లుగాక''

గోపరాజు రాజన్న
('లీడరు' సహాయ సంపాదకులు)

౧౧

"మన యాంధ్రవాఙ్మయమున నెన్నదగిన గద్యకృతులు చాలఁ బరిమితముగ నున్నవి. గద్యవాఙ్మయము సర్వసులభ మగుటం జేసి దేశ ప్రబోధమునకది యెంతయు నావశ్యకము. ఇది గద్యయుగము.

గద్య సర్వతోముఖముగ నభివృద్ధి చెందవలసియున్నది...ఇట్టి స్థితిలో శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిలుగారి పద్యబహిష్కార మాంధ్రదేశీయ పత్రికా చరిత్రమున నొక నూతనాధ్యాయమును ప్రారంభించుచున్నది యని నాయాశయము...దేశమున ధనాభావము మిక్కుటముగ నున్నది. అనేక పత్రికలు బుబ్బలోఁ బుట్టి ముఖలో మాడుచున్నవి. ఇట్టి స్థితిలో ధైర్యముతోఁ బ్రబుద్ధాంధ్రను బునరుద్ధరింప సమకట్టిన శ్రీ శాస్త్రిలుగారి ధైర్యము, వాఙ్మయాభిమానము ప్రశంసార్హములు... వాఙ్మయాభిమానులు, విశేషించి స్త్రీలోకమును వారి యుద్యమమునకుఁ దోడ్పడి తమ భాషాభిమానమును వెల్లడింతురు గాక ”

విద్వాన్, బత్తుల కామాక్షమ్మ
(ఆంధ్రయువతీ సంస్కృత కళాశాల, ప్రిన్సిపాల్)

౧౨

“మహాశయా, మీ పత్రికలో పద్యములు ప్రచురింపకపోవడము చాలా విధముల మంచిదే. ప్రస్తుతము ఆంధ్రోద్ధరణమునకు ఉపయుక్తమైన విషయములను గురించి చర్చచేయడము, అత్యావసరమైన పని. అందుకు గద్య ఉపచరించేటట్టు పద్యము ఉపచరించదు. విదేశీయ గద్యరీతులలో కొత్తపుంతలు చాలా ఏర్పడి యున్నవి. అందులో మేలైనవి ఆంధ్రవాఙ్మయమున చేర్చుకొనవలసి యున్నది, ఆంధ్రగద్యశైలి ఏర్పడవలసియున్నది. ఇన్ని పనులు గద్యలో చేయవలసి యున్నది; కావున మీ ఏర్పాటు కాలాను గుణ్యముగా నున్న దని చెప్పవచ్చును ”

శ్రీపాద కామేశ్వరరావు. ఎం. ఏ. ఎల్. టి.
(ట్రెయినింగు కాలేజీ లెక్చరరు. (రిటైర్డు)

౧౩

“రాజమండ్రి కలాభివర్ధని పరిషత్తు పక్షమున ప్రకటింపబడు మాసపత్రిక. రాయల్ సైజు 40 పుటలు. సంవత్సరపు చందా రూపాయి. విడిసంచిక అణానర. సంపాదకులు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. రూపాయి పత్రికకు తెనుగున శ్రీ శాస్త్రిగారే ఆద్యబ్రహ్మలు. తరువాత అట్టి రూపాయి పత్రికలు తెనుగున పదింటికి పైగా వెలసినవి. రెండు మూడు నేడును జీవించి యున్నవి. దాదాపు పది సంవత్సరములకు పూర్వము ప్రబుద్ధాంధ్ర సంపాదకుల అనారోగ్య కారణమున నిలిచిపోయినది. నిలిచి పోవుసరికి దాని చందాదారుల సంఖ్య 2700. నేడు ‘వినోదిని’ని తప్పించినచో అందఱు చందాదారులు గల మాసపత్రిక మఱియొకటి లేదు. అట్టి ప్రబుద్ధాంధ్ర పునరుద్ధరింపబడి తెనుగువారి అదృష్టము అన దగిన రాజమహేంద్రవరపు కీర్తిని విస్తరింపజేయ నుండుట ఎంతయు సంతోషింపదగినది. రచయిత, స్వానుదారుడు ఒక్కడే అయిన సంపాదకునకు నోచి పుట్టిన తెనుగు మాస పత్రికలలో ప్రబుద్ధాంధ్ర యొకటి. జనవరి మాసమున వెలువడిన ఐదవ సంపుటపు తొలి సంచికలో ‘జాగ్రత్తపడవలసిన ఘట్టాలు’ అను సంపాదకులు వ్రాసిన సాంసారిక కథావ్యాసము గొప్ప నీతిని బోధించుచున్నది. ప్రఖ్యాతాంధ్రకథకు లగు శ్రీ చింతా దీక్షితులు గారు వ్రాసిన ‘ఈమాట నిజం’ చమత్కారముగ నున్నది. శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారి ‘సుస్వాగతం’ అను కథావ్యాసమున ప్రతి అక్షరమును పాత్రపోషణగుణసంపన్నమై తెనుగువారి స్వతంత్ర కథావ్యాసములలో అత్యున్నతస్థాన మందజాలి యున్నది. డాక్టరు, చిలుకూరి నారాయణరావుగారు, (ఎం. ఏ) జయంతి రామయ్యపంతులుగారి ఉత్తరరామచరిత్రముపై విమర్శకవ్యాసమును, శ్రీ వేమవల్లి కామేశ్వర రావుగారు, బి. ఏ., 1872 లో ప్రచురింపబడిన నరహరి గోపాలకృష్ణమశెట్టిగారి ‘శ్రీరంగరాజ చరిత్ర’ అను నవల 1878 లో ప్రచురింపబడిన వీరేశలింగము పంతులుగారి రాజశేఖర చరిత్ర రచనకు ఎంతవరకు తోడుపడినదో చూపు పరిశోధక వ్యాసమును, శ్రీ మారేమండ రామారావుగారు

(ఎం. ఏ.) 'ప్రాచీనకాలపు జనాభా లెఖ్ఖలు' అను విజ్ఞాన వ్యాసమును రచించి ఈ సంచిక విలువను పెంచియున్నారు."

ఆంధ్రభూమి [ఫిబ్రవరి 1934]

౧౪

"ఆంధ్రులకు చిరపరిచిత యైన యీ పత్రిక పునరుద్ధరింపబడినది. మునుపటివలెనే రూపాయ చందాతో ప్రారంభ మగుటవలన ఆంధ్రుల యాదరణకు బాత్రము కాగల దనుటలో సందేహము లేదు. శ్రీ చింతా దీక్షితులుగారు, చిలుకూరి నారాయణరావుగారు, వేసమళ్ల కామేశ్వరరావుగారు మొదలగు వారి రచనలు దీనిలో గానిపించుచున్నది. ప్రస్తుతరాజకీయవిషయములకు సంబంధించినవి తప్ప తక్కిన అన్ని విషయముల వ్యాసములును వచనములో ప్రకటింతు మని సంపాదకుల సూచన. దీని ప్రత్యేకత యేమనగా, పద్యవాఙ్మయమును నిషేధించుట. ఈ పత్రికలో పద్యములు ప్రకటింపబడవు. ఈయపూర్వశపథమును సమర్థించుచు శ్రీ సుబ్బరామయ్యగారు రెండు పుటల వ్యాసమును రచించిరి. అందలి ముఖ్యవిషయములు గమనింపదగినవి.

"ఈదినములలో మానవుని నిత్యజీవితమున కావశ్యకము లగు విషయములను 'అక్షరాలా' స్పష్టముగ—అనగా దృష్టికి పదములును, మనస్సునకు వాని యర్థమును ఒక్కమారే—తెలుపునట్టి గ్రంథములు వెలువడవలెను. అవి సరళమగు గద్యరచనమున నుండవలెను.... నేటి కాలపు పత్రికలును గ్రంథములును సృష్టించుచున్న గద్యవాఙ్మయమున నొప్పిద మగు శైలి యున్నది యత్యల్పము. పద్యవాఙ్మయమున నంతకంటె నల్పతరము; కాని పద్యవాఙ్మయము విషయమున చింతింపబని లేదు. పద్యవాఙ్మయము మానసికానందమును గూర్చుటకే అధికముగ నుపయోగించును. అందుకు జాలిన పూర్వగ్రంథము లనేకములు గలవు. పూర్వముగాని నేడు గాని లేకున్నది, అనవద్య మగు గద్యవాఙ్మయము. శరీరమునకు సౌఖ్యమును గూర్చు జ్ఞానమును ప్రజలకు పంచిపెట్టుట కదియే ప్రధాన సాధనము. దానికి సంప్రాప్త మైన దుర్దశకే యిపుడు చింతిలవలసి యుండునది. శరీరసౌఖ్యము కుదుర నపుడు మానసికానందము దేనను గలుగజాలదు."

ఈవాక్యములలో గొంత యన్యాయ మున్నట్లు గోచరించుచున్నది. మానసికానంద మొసంగుటే పద్యవాఙ్మయ ప్రయోజనము కావచ్చును; కాని అందుకు చాలిన పూర్వగ్రంథము లనేకము లున్నవా? అంతేనా? అపూర్వ మైన ఆనందవిశేషమును గూర్చు అర్వాచీన గ్రంథములు లేవా? అపూర్వ గ్రంథములతో సంతృప్తిపడి, యికనానంద సంధాయక మగు పద్యరచనమునకు స్వస్తి చెప్పవలసినదా? ఇంకను కృషి సల్పుచో నివరకున్న వానికంటె నత్యున్నతము లైన కావ్యవిశేషములు సృష్టింపబడుట కవకాశము లేదా! ఆంధ్రకవిత్వాభివృద్ధి యగు నన్న ఆశయే యిక లేదా? ఆంధ్రకవితాసౌధ మాదికాలమునందే యొక్కసారిగ నువ్వెత్తుగ లేచి యాకస మంటి నేలం గూలిపోయినదా? సంపూర్ణముగ శిథిల మైపోయినదా? ఇక దాని నుద్ధరించుట కెవ్వడును జన్మింపజాలడా? ఏమో! మాకు మాత్ర మంతటి యాశాశూన్యతకు హేతువు కనిపించుట లేదు. పోని అసంగతి యెట్లున్నను "శరీరసౌఖ్యము కుదుర నపుడు మానసికానందము దేనను గలుగజాలదు "అని మరియొక మాట యున్నది. ఇది వింత కాదా? కవిత్వ మనునదే ప్రపంచమున లేనిచో కళ యనునదే సృష్టింపబడకున్నచో ఈవాక్యము యథార్థము కావచ్చును; కాని కళ యేర్పడిన దెందులకు? సుఖసమయమునందే ఆనందమును ద్విగుణీకృత మొనర్చుటకు గాదు; కష్టసమయములయందో దోదార్చి శాంతి యొసంగుటకు గూడను 'శరీరసౌఖ్యము కుదురనపుడు మానసికానందమును గలిగించు'టకే, ఆశ యను దానిని చూపించి దుఃఖోపశమనము గావించి, బ్రతుకునందింకను ఇచ్ఛ కలిగించుటకే కళ యనున దేర్పడినది.

"And from your work will every feeling bosom such nurture in its melancholy passion" అని జర్మన్ మహాకవి గెటీ కనిపెట్టినాడు. యీట్స్‌కవితో నొక సుప్రసిద్ధవంగదేశీయుడు స్వానుభవమును బట్టి "I read Rabindranath everday, to read one line of his is to forget all the troubles of the World" అన్నాడు. దైహికము లైన కష్టము లనుభవించు వేళలలో కళోపాసనకు దిగిన బ్రహ్మానందసహోదర మగు నానందము పొంద వచ్చు నని పెద్ద లన్నారు. ఇంతవును చెప్పవచ్చిన విషయ మిది. సుబ్బరామయ్యగారి ప్రశంస యెట్లున్నను, ప్రబుద్ధాంధ్ర వహించిన యీనియమమును గూర్చి మాకొక సందేహమున్నది. పద్యములు కథానాటికాదులు —అన్నియు కళకు సంబంధించినవే; అన్నియు మానసికానందమును ప్రధాన ఫలముగా నుద్దేశించినవే. అట్టిచో, మూడు కథలను ప్రకటించి, ఏకాంక నాటకాదులకు గూడ తావీయదలచిన యీపత్రిక- పద్యములను నిషేధించుటలో గల యౌచిత్య మేమో మాకు గోచరించుట లేదు. సారస్వతమునం దివి యన్నియు సమానమైన హక్కు గల భాగములు. ఇష్టమైనచో సారస్వతమునే సంపూర్ణముగ నిషేధించి కేవల శాస్త్రీయవిద్యా పారిశ్రామికాదిక విషయములనే ప్రకటింపదలచుట నియమ మగును; కేవల శారీరక సుఖమునే సమకూర్పగల వైజ్ఞానిక విషయములనే గ్రహించుట లెస్స యగును. అంతియ కాని కళాధిదేవత తలమాత్రము త్రుంచివైచి తక్కిన యవయవములతో నాటక మాడింపవలదని ప్రార్థించుచున్నాము"

విశ్వకళ (జనవరి 1934)

౧౫

"రాజమహేంద్రవరంలో శ్రీయుత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సంపాదకత్వమున వెలువడు మాసపత్రిక, ఇదివరలో వీరీ పత్రికను నాలుగు వత్సరములు నిర్వహించి ఆరోగ్యము చెడిపోయినందున 1925 లో నిలిపివేసిరి. మరల యీ జనవరి నుండి ప్రచురించుచున్నారు. గద్యవాఙ్మయము నభివృద్ధిపరుచు నుద్దేశముతో పద్యవ్యాసములను ప్రకటింపక గద్యవాఙ్మయమునకే సంపాదకులు ప్రాధాన్య మొసగుచున్నారు దీని చందా సంవత్సరమునకు ఒక రూపాయి మాత్రమే. ఆంధ్రుల అభిమానమునకు పాత్రమై వర్ధిలుగాక యని కోరుచున్నాము.

సుబోధిని (20—1—34)

౧౬

"కొంతికాలం క్రితం నిలుపుదల చేసి మరల రాజమహేంద్రవరమునుండి పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సంపాదకత్వముననే పునరుద్ధరింపబడిన అయిదవ సంపుటము ప్రథమసంచికను వందనపురస్సరముగా నందుకొని యందలి సద్విషయములు పఠించి యమందానంద హృదయులమైతిమి. శ్రీ శాస్త్రిగారి రచనాసామర్థ్యము లోకమెరింగియుండుటచే నెక్కువగా వ్రాయ బనియుండదు. అద్భుత విమర్శనలు, వినోదమైన కథలతో ప్రతినెలారంభమున వెలువడుచున్నది"

ఆదిశైవ పత్రిక
(శ్రీముఖ మాఘము)

౧౭

"ఈ మాసపత్రికను శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రాజమండ్రినుండి తిరిగి యీసంవత్సరములో పునః ప్రకటితమున కియ్యకొని ఐదవసంపుట ప్రథమ సంచికను వెలువడదీసి పంపిన ప్రతిని వందనములతో నందుకొంటిమి. వీరి అనారోగ్య కారణమే యింత కాలము యీపత్రికా ప్రచురణ విరమించుటకు కారణ మని తెలియుచున్నది. ఆంధ్రుల వాఙ్మయాభివృద్ధికే లక్ష్య ముంచి పత్రిక నడుప వాంఛించుచున్నటుల పత్రికాధిపతులు విన్నవించుచున్నారు. తేట తెనుగు పదములతో జనసామాన్యమునకు గ్రాహ్య మగు మాటలతో నవరసము

లోలుకు విషయసంపుటితో ఆహ్లాదము నిచ్చు కథావళితో ప్రథమసంచిక విరాజిల్లుచున్నది. శాస్త్రిగారి యుద్యమము వర్ధిల్లునటుల ఆంధ్రులు ప్రోత్సహించెదరని నమ్ముచు ప్రబుద్ధాంధ్ర దీర్ఘాయుష్మంతురాలగునటుల ఆశీర్వదించుచున్నాము.

దీనబంధు (3—1—34)

౧౮

"ఈ పత్రిక తెనుగువారికి అపరిచితమయినది కాదు. ఇదివరకు కొన్నాళ్లు నడచి కారణాంతరములచే నడుమ నాగిపోయి యిప్పు డిది పునరుద్ధరింపబడినది. సుప్రసిద్ధవచనరచయిత లగు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పత్రికా సంపాదకులు భాషాభిమానులకు సంతోషమును కల్పించు చాక పత్రిక."

ధర్మసాధని [25—1—34]

౧౯

"ఇది పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సంపాదకత్వమున రాజమహేంద్రవరము నుండి ప్రకటింపబడుచున్న మాసపత్రిక. 1925 వ సంవత్సరమున నిలుపు చేయబడిన యీ పత్రిక ౧ నెలనుండియే పునరుద్ధరింపబడినది. శాస్త్రిగారి రచనాసామర్థ్యము లోకమెరిగినదియే ఇది చక్కని కథలు, అద్భుత విమర్శములు, సొంపైన సాహిత్యచర్చలతో ప్రతినెలా రంజింపజేయుచున్నది. ఇది ఆబాలగోపాలమును చదువదగినది"

కడిరాణి [31—12—33]

పత్రికాస్వీకారము

౩ ఆంధ్రభూమి వేపేరి మద్రాసు

ఇది సర్వవిషయములను చర్చించు సచిత్రాంధ్ర మాసపత్రిక. సంవత్సరచందా 3-0-0 సంపాదకులు ఆంధ్ర శేషగిరిరావుగారు బి. ఏ. విద్యార్థిగా నుండినపుడే చక్కని వ్యాసములు వ్రాసి కొంతలవాసిని పేరు, బహుమతులు పొందిన మా మిత్రులు శేషగిరిరావుగారు ఇట్లొక మంచి రకపు మాసపత్రికకు సంపాదకు లగుట న్యాయ్యముగనే యున్నది. సహజముగనే వీరి రచనములు సరళములును, విషయగౌరవము కలవియగును. గృహలక్ష్మి సంపాదకులుగా నుండి చేసిన భాషాభావాఙ్మయముల సేవ వీరి నిసర్గప్రతిభకు అనుభవవైశిత్యములను గలిగించినది శేషగిరిరావుగారు ఇప్పటికి ఆంధ్రభూమి తొమ్మిదిసంచికలు ప్రకటించినారు. ఒక దానిలో కంటె నొకదానిలో విషయగౌరవము, నవీనత వైచిత్ర్యము కనపడుచున్నది. వీరు తమ రచనముల యెడల శ్రద్ధవహించుటే కాక ఇంగ్లీషులోనే ఉల్లాసీదా లగుచుండిన పట్టభద్రులను కొందరిని తెనుగురచనలలోనికి దింపినారు వాస్తవముగా ఇది ప్రశంసింపదగిన విషయము. ఆంధ్రభూమి ఆంధ్ర వాఙ్మయమునకు అమూల్యమైన ఆభరణముగా నున్నది. కేవలాంధ్రులకు అనేక నూతనవిషయములు ఆంధ్రభూమిద్వారా తెలియుచున్నవి స్త్రీలకు గూడ ఇది చాల ఉపయోగకరముగా నున్నది. పెక్కుమంది యువతీమణులును తమ వినూత్నరచనలతో నీపత్రికను అలంకరించుచున్నారు. సంవత్సరమైన నిండకపూర్వమే ఇంత ప్రజాదరమును సంపాదించిన ఆంధ్రభూమి యందుముందు వహించు మున్నతిని గురించి వేరుగ చెప్పనక్కరలేదు. సర్వాంగసుందరమైన ఆంధ్రభూమిపత్రికకు విజయమును గోరుచు మేము మా మిత్రుల సద్వ్యవసాయమును ప్రశంసించుచున్నాము. ఆంధ్రసోదరులు, సోదరీమణులు ఆంధ్రభూమిని గౌరవించి తాము గౌరవము పొందెదరు గాక

4 గృహాలక్ష్మి— ఎగ్మూరు మద్రాసు

స్త్రీల నిమిత్తము ఆంధ్రమున ప్రకటింపబడు పత్రిక యిది యొక్కటే. సంపాదకులు కే. యన్. కేసరిగారు. విద్యావతి, వినయవతి, సుగుణవతి, సౌందర్యవతి అగు కుల స్త్రీవలె గృహాలక్ష్మి ఆదర గౌరవములకు అర్హయై యున్నది. ఆంధ్రరమణులు చాలమంది గృహాలక్ష్మి సాయమున ముందుకు వచ్చియున్నారు. ఇంకను పెక్కుమంది రాగలరు. స్త్రీల వ్యాసములే ఇందనేకము లుంటున్నవి. సర్వాంగసుందర మైన యీపత్రిక ద్వారా డాక్టరు కేసరిగారు స్త్రీలోకమునకు చేయుచున్న సేవ ఉత్తమశ్రేణికి చేరుచున్నది. సంవత్సరచందా 4—0—0. విడిసంచిక 0—6—0. గృహాలక్ష్మి ఇంకను సుందరమై ఇంకను ఉన్నతి పొందుగాక యని కోరుచున్నాము.

5 ధర్మసాధని గుంటూరు

పక్షపత్రిక. సంవత్సరచందా 2—8—0. సంపాదకులు పాలపర్తి నరసింహము గారు. బ్రహ్మసమాజ ధర్మములను తెనుగువారిలో వ్యాపింపజేయుట కిది చాల పని చేయుచున్నది. తప్పకుండా చదవవలసిన తెనుగు పత్రికలలో ఇది యొకటి. ఇప్పుడు ౨౧ వ సంవత్సరము నడుచుచున్నది.

6 రెడ్డిరాణి రాయవరము తూ. గోదావరి

సచిత్ర మాసపత్రిక. సంవత్సరచందా 3—0—0. సంపాదకులు మల్లిడి సత్తిరెడ్డిగారు. రెడ్లలో చాల పలుకుబడి కల పత్రిక. ప్రఖ్యాతి పొందియుండిన మాసపత్రికలలో ఇది యొకటి.

7 విశ్వకళ గుంటూరు

మాసపత్రిక. గ్లేజు కాగితములు. డబుల్ క్రౌను సైజు. సంచికకు 16 పేజీలు గలవు. సంవత్సర చందా 1—0—0.

8 లోకలుబోర్డు కపిలేశ్వరపురం తూర్పు గోదావరి

మాసపత్రిక. సంవత్సరచందా 3—0—0. సంపాదకులు చాగంటి శేషయ్యగారు. రెండవ సంపుటము 8 సంచికలును మా కార్యస్థానము చేరినవి. లోకలుబోర్డులకు, మునిసిపాలిటీలకు సంబంధించిన సకల విషయములను ఇది చక్కని సులభశైలిలో ప్రకటించుచున్నది.

9 పశుసంరక్షణ. అంగలూరు కృష్ణాజిల్లా.

ద్వైమాసికపత్రిక. సంవత్సరచందా 1—0—0 సంపాదకులు డాక్టరు యేజెళ్ల శ్రీరాములు చౌదరిగారు. చౌదరిగారు పశువైద్యమున లబ్ధప్రతిష్ఠులు. పశువైద్యమునకు సంబంధించిన గ్రంథములు అనేకములు రచించినవారు. పత్రికలో చక్కని పశువుల చిత్రపటములును ప్రకటింపబడుచున్నవి. పశుసంపద గలవారి కిది చాలా ఉపయోగకరము.

10 ఆంధ్రవిశ్వకళాపరిషత్, కళాశాల తెనుగుసంఘపత్రిక. విశాఖపట్టణము.

ఇది నాలుగు మాసముల కొకసారి ప్రకటింపబడు పత్రిక. సంవత్సరచందా 1—0—0. విడిసంచిక 0—6—0. సంపాదకులు విఖ్యాతకవు లగు పింగళి లక్ష్మీకాంతముగారు. రెండవసంచిక మొదటి సంచిక మా కార్యస్థానము చేరినది. విలువగల వ్యాసాలతో చక్కగా నున్నది.

11 ఆదిశైవ పత్రిక. చిలుమూరు, అనంతవరం పోష్టు, గుంటూరుజిల్లా

సంవత్సర చందా 1—8—0. సంపాదకులు చిలుమూరు పురుషోత్తమ గురుక్కళుగారు. తొమ్మిదవ సంపుటము పదవ సంచిక మాకార్యస్థానము చేరినది. ఇది శైవ సంఘాభ్యుదయము నిమిత్తము ప్రారంభింపబడినది. హరద్విజులు దీనిని ఆదరించి ఉన్నతి పొందెదరుగాక.